
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7



ప్రకాశం
జిల్లా వార్తలు

ఆదివారం 28, సెప్టెంబరు 2025



పునర్విభజనకు కసరత్తు

రేపటి లోపు మునిసిపల్ వార్డుల విభజనతో కూడిన ముసాయిదా తయారీ

- చీమకుర్తి, దర్శి, అద్దంకి, గిద్దలూరులలో 20 నుంచి 27కి, కనిగిరిలో 28కు పెంపు
- అభ్యంతరాలు, సవరణలు, అనుమతుల అనంతరం అక్టోబరు 14న ఫైనల్ జాబితా
- ప్రభుత్వం ఉత్తర్వులు.. రంగంలోకి కమిషనర్లు

చీమకుర్తి, సెప్టెంబరు 27 : మునిసిపల్ ఎన్నికల కోసం ప్రభుత్వం ముందస్తుగా నిర్వహించాల్సిన కసరత్తును ప్రారంభించింది. గత ఎన్నికల సమయంలో నగర పంచాయతీలుగా ఉన్న వాటిని గ్రేడ్-2 మునిసిపాలిటీలుగా హోదా పెంచారు. దీంతో వార్డుల పెంపు, తద్వారా పునర్విభజన అనివార్యమైంది. ఎన్నికలు నిర్వహించాలంటే తప్పనిసరిగా వార్డుల పునర్విభజన చేయాల్సి ఉంది. ఈనేపథ్యంలో 2011 జనాభా లెక్కలను ప్రస్తుతం ఆయా మునిసిపాలిటీల పరిధిలో ఉన్న ఓటర్లను పరిగణనలోకి తీసుకుని వార్డుల పునర్విభజనకు ప్రభుత్వం ఆదేశించింది. మునిసిపల్ కమిషనర్‌లకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 13 మునిసిపాలిటీల్లో వార్డులు పెరగనున్నాయి. అందులో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చీమకుర్తితోపాటు దర్శి, గిద్దలూరు, అద్దంకి, కనిగిరి ఉన్నాయి. ఒక్క కనిగిరిలో 20 నుంచి 28కి మిగతా అన్ని మునిసిపాలిటీలలో 27కు వార్డుల పెంపు జరగనుంది. వార్డుల పునర్విభజన ఎలా చేయాలన్న విషయమై పక్కా విధివిధానాలను రూపొందించిన ప్రభుత్వం

మిగతా 8వ పేజీలో

ప్రజలకు దసరా కానుకగా జీఎస్టీ భారాన్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. ఈనెల 22 నుంచి కొత్త శ్లాబులను అమల్లోకి తెచ్చింది. ముఖ్యంగా నిత్యావసరాలు, వాహనాలు, ఎలక్ట్రికల్ వస్తువులు, గృహోపకరణాలతోపాటు, ప్రజారోగ్యం దృష్ట్యా పలు మందులపైనా జీఎస్టీని కుదించింది. అయితే ప్రతి ఇంట్లో ఉపయోగించే మందులపైన ప్రజల్లో అవగాహన లోపం వ్యాపారులకు వరంగా మారింది. జీఎస్టీ అమలులోకి వచ్చిన తేదీకి ముందే రేట్లు ముద్రించడంతో అవి కాస్తా హోల్‌సేల్ నుంచి రిటైల్ షాపులకు చేరాయి. దీంతో జీఎస్టీ తగ్గింపు సాధ్యపడే పరిస్థితి లేదని వ్యాపారులు వెల్లడిస్తున్నారు. మరోవైపు కేంద్రం పాత రేట్లతో పనిలేదు.. జీఎస్టీ తగ్గింపు నాటి నుంచే అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. అయితే అది అమలుకావడం లేదు. దీంతో మందుల్లో మతలబుతో జనానికి ఎటువంటి ఊరట లభించడం లేదు.



మందుల్లో GST మతలబు..!



- అమలుకాని కొత్త జీఎస్టీ
- పాత ఎమ్మార్పీలతోనే అమ్మకాలు
- ఇప్పటికే 20శాతం డిస్కౌంట్ ఇస్తున్నామంటున్న వ్యాపారులు
- కొనుగోలుదారుల్లో అవగాహన లోపం
- భారీగా నష్టపోతున్నా స్పందించని అధికారులు
- ప్రైవేటు ఆసుపత్రుల్లో మరింత దోపిడీ

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గతంలో మందుల షాపుల వ్యాపారం అంతంతమాత్రంగానే ఉండేది. కొవిడ్ సమయం నుంచి దశమారింది. ఒక్కసారిగా మందుల వాడకం అధికమైంది. పనిలోపనిగా సాధారణ జ్వరం బిళ్ల నుంచి సూది మందు వరకు రేట్లు రెండింతలు పెరిగాయి. దీంతో వ్యాపారం మరింత ఊపందుకుంది. ఆ తర్వాత జిల్లాలో మెడికల్ షాపుల సంఖ్య రెట్టింపు అయింది. అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం జిల్లాలో 420 హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. 1,000 నుంచి 1,100 వరకు రిటైల్ షాపులు నడుస్తున్నాయి. అయితే మందుల్లో లాభాలకు అలవాటుపడిన వ్యాపారుల్లో పోటీతత్వం పెరిగింది. కార్పొరేట్ సంస్థలతోపాటు పెద్దస్థాయి దుకాణాలు వెలిశాయి. దీంతో పలురకాల మెడిసిన్స్‌పై 10% నుంచి 20% వరకు డిస్కౌంట్‌లు ప్రకటించి అమ్మకాలు చేస్తున్నారు. తాజాగా కేంద్రప్రభుత్వం ఇప్పటి వరకు మెడిసిన్స్‌పై 12% ఉన్న జీఎస్టీని 5శాతానికి తగ్గించింది. అది ఈనెల 22 నుంచి అమలులోకి వచ్చింది. అయితే వ్యాపారులు మాత్రం ధరలు తగ్గించడం లేదు. ప్రజల్లో అవగాహన లేమి కూడా వ్యాపారులకు మరింత కలిసివచ్చింది. మందులపై తగ్గిన జీఎస్టీపై పలువురు వ్యాపారులను ప్రశ్నిస్తుండగా, జీఎస్టీ

మిగతా 8వ పేజీలో



రూ.1.12కోట్ల కరెన్సీతో ధనలక్ష్మీ అలంకరణలో పొదిలిలోని వాసవీకన్యకాపరమేశ్వరి

శ్రీ మాత్రే నమః

శరన్నవరాత్రులు కన్నుల పండువలా జరుగుతున్నాయి. ఆలయాలు దేవీ నామస్మరణతో మార్మోగుతున్నాయి. ఉత్సవాల్లో ఆరోరోజైన శనివారం అమ్మవార్లు వివిధ అలంకరణలలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. పొదిలిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవికి రూ.1.12 కోట్ల కరెన్సీ నోట్లతో చేసిన అలంకరణ ఆకట్టుకుంది. త్రిపురాంతకంలోని బాలాత్రిపుర సుందరీ దేవి స్కందమాతగా మయూర వాహనంపై కొలువుదీరారు.

- వివరాలు లోపలి పేజీల్లో..



మయూర వాహనంపై స్కందమాతగా త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీ దేవి

డీసీసీబీలో విచారణపై హైకోర్టులో రిట్

విచారణాధికారిని మార్చాలని పిటిషన్‌దారుల వినతి



ఒంగోలు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో జరుగుతున్న సెక్షన్ 51 విచారణ వ్యవహారం హైకోర్టుకు చేరింది. విచారణాధికారిగా నియమితులైన వి.గౌరీశంకర్‌ను మార్చాలని, ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్న పలువురు బ్యాంకు ఉద్యోగులను ప్రస్తుతం ఉన్న స్థానం నుంచి మార్చాలని పిటిషన్ దారులు హైకోర్టును ఆశ్రయించారు. పీడీసీసీ బ్యాంకు ఉమ్మడి జిల్లా పరిధిలో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఆ పరిధిలో ఉన్న బాపట్ల జిల్లా ఇంకొల్లుకు చెందిన రావి అంకమ్మ, జి.హరికృష్ణ అనే ఇరువురు ఈ పిటిషన్‌ను దాఖలు చేయగా హైకోర్టు విచారణకు స్వీకరించింది. పీడీసీసీబీలో గత వైసీపీ పాలనలో భారీగా అవినీతి, అక్రమాలు, అవకతవకలు జరిగాయని.. వాటిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు ప్రభుత్వానికి చేరాయి. దీంతో త్రిసభ్య కమిటీతో విచారణ చేయించిన గత కలెక్టర్ అన్సారియా సెక్షన్ 51 విచారణకు సిఫార్సు చేశారు. అందుకోసం సహకార శాఖ కమిషనర్ కార్యాలయంలో అదనపు కమిషనర్ వి.గౌరీశంకర్‌ను విచారణాధికారిగా నియమించారు. తొలుత ఆ ప్రతిపాదనకు జిల్లాకు చెందిన అధికార పార్టీ కీలక ప్రజాప్రతినిధులు అంగీకరించ లేదు. పారదర్శక విచారణ కోసం మరో అధికారితో విచారణ చేయించాలని సూచించారు. దాని వల్ల కొంత బ్రేక్ పడగా చివరకు గౌరీశంకర్‌నే నియమించారు. ఈ నెలలో రెండు విడతలు బ్యాంకుకు వచ్చిన ఆయన తూతూమంత్రంగా తప్ప సమగ్ర విచారణ, అక్రమార్కులపై చర్యలు తీసుకునే స్థాయిలో దృష్టిసారించలేదన్న ఆరోపణలు వచ్చాయి. ఇక గతంలో బ్యాంకులో పలు ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్న అధికారులు కీలక స్థానాల్లో ఉండి విచారణను ముందుకు సాగనివ్వడం లేదన్న విమర్శలు కూడా వ్యక్తమయ్యాయి. ఈ రెండు అంశాలను పిటిషన్‌దారులు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లి విచారణాధికారిని, బ్యాంకులో ఉన్న కొందరు అధికారులను మార్చాలని కోరారు. అప్పుడే పారదర్శక విచారణ సాధ్యమని విన్నవించారు. సదరు అధికారుల పేర్లను కూడా పిటిషన్‌లో కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. కాగా ఈ పిటిషన్‌లో ప్రతివాదులుగా ప్రభుత్వం, సహకార శాఖ కమిషనర్, కలెక్టర్, డీసీవో, బ్యాంకు సీఈవోలతో పాటు ప్రస్తుత విచారణాధికారిగా ఉన్న గౌరీశంకర్‌లను చేర్చారు. దసరా సెలవుల అనంతరం విచారణ జరగవచ్చని సమాచారం.

పశ్చిమ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు

- అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి కీలక అంశాలు
- సమస్యలతోపాటు వైసీపీ పాలనలో అక్రమాలపైనా చర్చ
- ప్రభుత్వం తరఫున క్రియాశీలకంగా మంత్రి డాక్టర్ స్వామి
- ముగిసిన శాసనసభ వర్షాకాల సమావేశాలు
- హాజరుకాని వైసీపీ శాసనసభ్యులు







ఒంగోలు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఈ విడత అసెంబ్లీ సమావేశాలలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు గళం విప్పారు. ప్రత్యేకించి పశ్చిమప్రాంత ఎమ్మెల్యేలు వివిధ అంశాలపై మాట్లాడారు. జిల్లాలో అధికార టీడీపీ నుంచి మంత్రి డాక్టర్ స్వామితోసహా ఆరుగురు, ప్రతిపక్ష వైసీపీ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈనెల 18 నుంచి శనివారం వరకు శాసనసభ వర్షాకాల సమావేశాలు జరిగాయి. వైసీపీ అధినేత వైఖరికి అనుగుణంగా ఆపార్టీకి చెందిన ఇరువురు ఎమ్మెల్యేలు సమావేశాలకు దూరంగా ఉన్నారు. అధికారపార్టీకి చెందిన వారంతా సభకు హాజరు కాగా మంత్రి స్వామి ప్రభుత్వం తరఫున ఇటు అసెంబ్లీలోనూ, అటు శాసనమండలిలోనూ క్రియాశీలకంగా వ్యవహరించారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ బిల్లును రెండు సభల్లోనూ ప్రవేశపెట్టడంతోపాటు సాంఘిక సంక్షేమశాఖకు సంబంధించి.. అందులోనూ వసతి గృహాల నిర్మాణాలు ఇతర అంశాలపై ప్రభుత్వ ప్రాధాన్యతను గట్టిగానే చెప్పారు. జిల్లాకు చెందిన ప్రత్యేకించి పశ్చిమప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న టీడీపీ

మిగతా 8వ పేజీలో

కొత్త టీచర్లకు శిక్షణ

- నాలుగు కేంద్రాల్లో ఏర్పాటు
- 10న పాఠశాలలకు కేటాయింపు
- 13 నుంచి విధులకు హాజరుకావాలి

ఒంగోలు విద్య, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు సాధించిన కొత్త టీచర్లకు నాలుగు కేంద్రాల్లో ప్రాథమిక శిక్షణ ఇవ్వనున్నారు. ప్రభుత్వ, స్థానిక సంస్థలు, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, చెంచు పాఠశాలల్లో 672 పోస్టులు డీఎస్సీలో ప్రకటించగా 661 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. మిగిలిన 11 అర్హులైన వారు రాక మిగిలిపోయాయి. కొత్త టీచర్లను విద్యాబోధనలో ప్రావీణ్యం కలిగి ఉండేలా తయారు చేయడం లక్ష్యంగా ఈ శిక్షణ ఇస్తున్నారు. అక్టోబరు 3 నుంచి 10 వరకు రెసిడెన్షియల్ విధానంలో ఇది కొనసాగనుంది. చివరి రోజున కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించి నియామక ఉత్తర్వులు జారీ చేస్తారు. వీరికి మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా స్థానాలు కేటాయిస్తారు. ఆయా పోస్టుకు సంబంధించి ఖాళీలు ఎన్ని ఉన్నప్పటికీ అభ్యర్థుల సంఖ్యకు సమానంగానే ప్రకటిస్తారు. వీరిని నాలుగు, మూడు కేటగిరీ పాఠశాలల్లోనే నియమిస్తారు. 10న కౌన్సెలింగ్ పూర్తయ్యాక

మిగతా 8వ పేజీలో

రైలులో 9 కిలోల గంజాయి పట్టివేత

- బాలుడి అరెస్టు
- రాక్సీ డాగ్ కీలక పాత్ర

9



గంజాయి ఉన్న బ్యాగ్‌ను పరిశీలిస్తున్న రాక్సీ డాగ్, పోలీసులు

మాల్స్, దుకాణాల్లో తనిఖీలు

- జీఎస్టీ అమలు తీరును పరిశీలించిన పౌరసరఫరాల శాఖ అధికారులు
- తగ్గిన ధరల వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచన

వివరాలు 9వ పేజీలో

అనుమతించిన మేరకే పొగాకు పండించాలి

- రైతులకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ సూచన

వివరాలు 9వ పేజీలో

ప్రభుత్వ వైద్యుల ఆందోళన బాట

- నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు
- రేపు ఓపీల బహిష్కరణ
- సమస్యలు పరిష్కారమయ్యే వరకూ దశలవారీగా కొనసాగించాలని నిర్ణయం
- దసరా అనంతరం ప్రత్యక్ష కార్యాచరణ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు ఆందోళన బాట పట్టారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ విధులను బహిష్కరించారు. నల్లబ్యాడ్జీలు

మిగతా 8వ పేజీలో



తిప్పాయపాలెంలో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన వైద్యులు

ఆట మొదలైంది..

సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి సీనియర్స్ పోటీలు శనివారం ఒంగోలులో ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తొలిరోజు కొందరు సత్తా చాటారు. ఆదివారం కూడా పోటీలు కొనసాగుతాయి. విజేతలుగా నిలిచిన వారు వచ్చే నెల 23 నుంచి 27వ తేదీ వరకు గోవాలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారు.

9



వలపర్లలో చోరీ

● టీచర్ ఇంట్లో 50 సవర్ల బంగారం అపహరణ



ఉపాధ్యాయ దంపతులతో మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజనేయులు

మార్టూరు, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్లలో ఉపాధ్యాయుని ఇంటిలో భారీ చోరీ చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కే.కొండలరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. దాదాపుగా 50 సవర్లకు పైగా బంగారాన్ని దొంగలు ఎత్తుకుపోయారని ఉపాధ్యాయుని బంధువులు తెలిపారు. వలపర్ల గ్రామంలో సాయిబాబా గుడివెనుక కాలనీలో నివసించే కొండలరావు, నాగిని దంపతులు ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరిలో కొండలరావు జే.పంగులూరు మండలంలోని కొండమంజులూరులోని ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా, భార్య నాగిని వలపర్ల జడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అయితే వారిద్దరూ ఈ నెల 22న కర్నాటక రాష్ట్రంలో గంగావతిలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్లారు. వారు శనివారం సాయంత్రం వలపర్ల గ్రామంలోని ఇంటికి వచ్చి చూడగా ఇంటి ప్రధాన తలుపులు తాళం పగల గొట్టి ఉంది. బీరువా తలుపులు తెరచి ఉండడాన్ని వారు గమనించారు. అనంతరం బీరువాలోని బంగారం కూడా లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దాంతో బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, సంతమాగులూరు సీఐ వెంకటరావు, బల్లికురవ ఎస్ఐ నాగరాజులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఉపాధ్యాయుల దంపతులతో మాట్లాడారు. కాలనీకి చివర్లో సింగిల్‌గా ఇల్లు ఉండడంతో దొంగలు సులువుగా చోరీ చేశారని గ్రామస్థులు పోలీసులు భావిస్తున్నారు. అయితే దొంగతనం రెండు రోజుల క్రితం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. క్లూస్ టీం వస్తుందని పోలీసులు తెలిపారు. మార్టూరు సీఐ ఎం.శేషగిరిరావు దొంగతనం జరిగిన ఇంటిలో పరిశీలించారు. దొంగతనం జరిగిన తీరును విచారించారు. పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

IN THE SUPREME COURT OF INDIA
EXTRA-ORDINARY APPELLATE JURISDICTION
SPECIAL LEAVE PETITION (CIVIL) NO.15000 OF 2025 WITH PRAYER FOR INTERIM RELIEF WITH

RAVI, VENKATESWARLU ...Petitioner(s)/Appellant(s)
VERSUS
M/S. ACQUA DEV INDIA LTD. AND OTHERS ... Respondent(s)

To,

1. G. Venkateswarlu S/o Kotaiah, Director of M/S Acqua Devi India Limited R/O 404, Padmaja Plaza, West Maredpally, Secunderabad.	PID : 220043/2025 For R(2) IN SLP (C) No. 15000/2025 (Sec XII-A)
2. N.V.S.S.Rao S/o Prakash Rao, Business R/O. A-303, Apen Apartments, Tarnaka, Hyderabad.	PID : 220044/2025 For R(3) IN SLP (C) No.15000/2025 (SEC XII-A)
3. Kode Basava Venkateswar Rao S/o Raghavaiah R/O. Ongole, Prakasam District, District- Prakasam, Andhra Pradesh	PID : 220045/2025 For R(4) IN SLP (C) No.15000/2025 (Sec XII-A)
4. K. Gopalan S/o Krishnaswamy, R/O. H.No.C8, Sri Swami Sarada Nagar, Andheri (West), Mumbai-400058.	PID : 220046/2025 For R(6) IN SLP (C) No.15000/2025 (Sec XII-A)

WHEREAS the Petition for Special Leave to Appeal with prayer for interim relief along with application for **CONDONATION OF DELAY IN FILING, SUBSTITUTED SERVICE** above mentioned (copy enclosed) filed in the Registry by **Mr. SADINENI RAVI KUMAR,** Advocate on behalf of the Petitioner(s) above named was listed for hearing before this Court on **16th May, 2025,** when the Court was pleased to pass the following order :

"1. Delay condond.
2. Issue notice, returnable within six weeks."

AND WHEREAS, the matter above-mentioned was listed before **Ld. Registrar's Court** on **11th September, 2025**, When the following order was passed:

"Service is complete on respondent no.5 but none has entered appearance.

Ld. Counsel for the petitioner has filed an application seeking paper publication on respondent nos. 2 to 4 and 6 in newspapers namely, "Indian Express", English & "Andhra Jyoti", Telugu. Application is hereby allowed. Proof of publication be filed within four weeks.

Ld. Counsel for respondent no.1 (Company) has, instead of curing the defects in the vakalatnama, filed a letter stating therein that Mr. G. Venkateswarlu is no more a Director of the Compnay, The Counsel is in the process of getting Board Resolution of respondent no.1-company and will file the same once he same is received. Four weeks time is granted to do the needful.

Ld. Counsel for respondent no.1 had also mentioned in the letter that the name of respondent no.1 is M/S Acquadev India Limited and not M/S Acqua Dev Limited as is mentioned in the SLP. Four weeks time is granted to the ld. Counsel for the petitioner to take appropriate steps in this regard.

List again on 31.10.2025."

NOW, THEREFORE, TAKE NOTICE that the above petition with prayer for interim relief will be posted for hearing before this Court in due course and you may enter appearance before this Court either in person or through an advocate on record of this Court duly appointed by you in that behalf within 30 days from the date of service of notice. You may thereafter show cause to the Court on the day that may subsequently be specified as to why Special Leave Petition and interim relief as prayed be not granted and the resultant appeal be not allowed.

TAKE FURTHER NOTICE that the prayer for interim relief after notice will also be listed before the Court in due course.

You may file your affidavit in opposition to the petition as provided under Rule 14(1) of Order XXI, S.C.R.2013 within 30 days from the date of receipt of notice or not later than 2 weeks before the date appointed for hearing, whichever be earlier, but shall do so only by setting out the grounds in opposition to the questions of law or grounds set out in the SLPs and may produce such pleadings and documents filed before the Court/Tribunal against whose order the SLP is filed and shall also set out the grounds for not granting interim order or for vacating interim order if already granted.

TAKE FURTHER NOTICE that if you fail to enter appearance as aforesaid, no further notice shall be given to you even after the grant of special leave for hearing of the resultant appeal and the matter above mentioned shall be disposed of in your absence.

Dated : **13th September, 2025**

ASSISTANT REGISTRAR

Copy to :
1. Mr. Sadineni Ravi Kumar (adv.)

You are required to file affidavit with proof of paper publication well before 31.10.2025.

ASSISTANT REGISTRAR

పంచాయతీల పునర్విభజనపై కసరత్తు

15వ తేదీ లోపు ప్రక్రియ పూర్తికి ప్రభుత్వం ఆదేశం



మద్దిపూడి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల పునర్విభజనకు సంబంధించి కసరత్తు ప్రారంభమైంది. వచ్చేనెల 15తేదీలోపు ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సంబంధిత అధికారులు ఆవైపు దృష్టి సారించారు. ఈనేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ముఖ్యంగా పెద్దపంచాయతీలతోపాటు 3,4 కిలోమీటర్ల దూరంతో ఉన్న వాటిని విభజించాలని ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రమైన మద్దిపూడి పంచాయతీలో గంగపాలెం, పొట్టిరెడ్డిపాలెం, దుగ్గిరెడ్డిపాలెం, రాజుపాలెం శివారు గ్రామాలు ఉన్నాయి. గంగపాలెం నుంచి మద్దిపూడి మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. గంగపాలెంను ప్రత్యేక పంచాయతీగా విభజిస్తే అక్కడి ప్రజలకు గ్రామ పరిపాలన అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. ఈ గ్రామంలో 900 పైచిలుకు ఓట్లు ఉన్నాయి. అంకేపల్లి పంచాయతీ పరిధిలో గంజిపాలెం, సన్నమూరు, విజయలక్ష్మీపేట గ్రామాలు ఉన్నాయి. విజయలక్ష్మీపేట నుంచి అంకేపల్లికి చేరుకోవాలంటే కూచిపూడి మీదుగా 10కి.మీ తిరిగి రావాల్సి వస్తోంది. సన్నమూరు మీదుగా అయితే 5 కి.మీ ప్రయాణించాల్సి వస్తుందని విజయలక్ష్మీపేట వాసులు అంటున్నారు. సన్నమూరు పంచాయతీగా ఏర్పాటు చేస్తే విజయలక్ష్మీపేట, సన్నమూరు గ్రామాలకు ఉపయోగకరంగా ఉంటుంది. గంజిపాలెంను యథావిధిగా అంకేపల్లిలో కొనసాగించవచ్చు. కెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని టి.అగ్రహారం 4 కి.మీ దూరం ఉంటుంది. ప్రతి చిన్న అవసరానికి కెల్లంపల్లికి రావడం ఆగ్రామస్తులకు ఇబ్బందికరంగా మారింది. అగ్రహారంలో 700కుపైగా ఓటర్లు ఉన్నారు. కాకర్ల పంచాయతీ పరిస్థితి మరింత విచిత్రంగా కనిపిస్తోంది. పంచాయతీ కేంద్రమైన కాకర్లలో కేవలం 714 ఓట్లు ఉన్నాయి. అదే పంచాయతీ పరిధిలోని శివరాయునిపేటలో 2,151 ఓట్లు కలిగి అతిపెద్ద గ్రామంగా ఉంది. అప్పట్లో రాజకీయ కారణాలతో చిన్నగ్రామమమైన కాకర్లను పంచాయతీ కేంద్రంగా చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి శివరాయునిపేటను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు. గుండ్లసముద్రం పంచాయతీ పరిధిలోని ఎస్టీ గ్రామమైన రాజుపాలెంను ప్రత్యేక పంచాయతీగా విభజించాలన్న ప్రతిపాదనలు ఎన్నోఏళ్లుగా ఉన్నాయి. నూరుశాతం గిజనులు నివాసం ఉండే రాజుపాలెం పంచాయతీని ఎస్టీలకు కేటాయించేందుకు అవకాశం ఉంటుంది. పంచాయతీ ఎన్నికలు తరుముకొస్తున్న నేపథ్యంలో పునర్విభజనపై మండలంలో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది.

మందుల్లో మతలబు

(7వ పేజీ తరువాయి)

ఈనెల 22 నుంచి మాత్రమే అమలులోకి వచ్చిందని వెల్లడిస్తున్నారు. అప్పటికే మందులపై ధరలు, బ్యాచ్ నంబర్లు ముద్రించారంటున్నారు. ఒక్కో రకం మందుపై ఏడాదిన్నర వరకు గడువు ఉంటుందని, ఇప్పటికి ఇప్పుడు మార్చడం వీలు కాదని చెబుతున్నారు. గతంలో మెడికల్ దుకాణాల వారు రూ.5వేలకు మందులు కొనుగోలు చేస్తే రూ.250 నుంచి రూ.600 వరకు జీఎస్టీ ఉండేది. ప్రస్తుతం పూర్తిగా మినహాయించిన నేపథ్యంలో కొంతమేర తగ్గించాల్సి ఉంది. కానీ ఆ ప్రయోజనం వినియోగదారుడికి అందడం లేదు. గ్లూకో మీటర్, టెస్ట్ స్ట్రిప్‌లు, థర్మామీటర్లు, డయాగ్నోస్టిక్ కెమికల్స్ కిట్‌లు, ఇతర మందులపై జీఎస్టీ 18/12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించినా ఆచరణలో అమలుచేయడం లేదు.

ప్రైవేటు ఆసుపత్రుల షాపుల్లో ఆగని దోపిడీ

జిల్లాలో పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో అనుసంధానంగా నడుస్తున్న మెడికల్ షాపుల్లో ఎమ్మార్పీనే అమలు చేస్తున్నారు. బయట రిటైల్ మెడికల్ షాపుల్లో 20శాతం డిస్కౌంట్ ఇస్తుండగా, ఆసుపత్రుల్లో ఉండే షాపుల్లో అడ్డగోలుగా దోచేస్తున్నారు. ఆసుపత్రుల్లో షాపులకు జీఎస్టీ వర్తించదంటూ తేల్చిచెప్పి ముద్రించిన ధరలకే మందులు అమ్ముతూ కోట్లు దండుకుంటున్నారు. ఆసుపత్రుల్లో మెడికల్ షాపుల వ్యవహారం పరిశీలిస్తే మందుల తయారీ కంపెనీల ప్రతినిధులు డాక్టర్ల దగ్గరకు వెళ్లి తమ ఉత్పత్తుల గురించి ప్రచారం చేయడం సాధారణమైపోయింది. ఆయా మందుల వినియోగాన్ని బట్టి వారికిచ్చే వాటాలు ఆధారపడి ఉంటాయి. కాగా తయారీ సమయంలో ఒక మందు తయారీకి రూ.5 ఖర్చు అయితే, కొనుగోలుదారుడు వద్దకు వచ్చేసరికి దాని ధర రూ.150కి చేరుతోంది. వాస్తవానికి ప్రిస్క్రిప్షన్‌లో మందు పేరు రాయాలనే నిబంధనను పూర్తిగా తుంగలో తొక్కేశారు. మరోవైపు యాంటిబయాటిక్స్ వినియోగం తగ్గించాలని డాక్టర్లు చెబుతున్నా, మెడికల్ షాపుల్లో మాత్రం రోగం మందుతోపాటు యాంటిబయాటిక్ వాడాల్సిందే అంటూ అంటగట్టేస్తున్నారు.

ప్రజల్లో అవగాహన లోపం

దాదాపు చాలా మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసిన మందులకు బిల్లు ఇవ్వడం లేదు. దీంతో జీఎస్టీ ఎంత వర్తిసుంది అనే విషయంలో ప్రజల్లో అవగాహన లోపిస్తుంది. బిల్లు ఇవ్వకపోవడంపై వాణిజ్య పన్నుల శాఖ పట్టించుకున్న దాఖలాలు కూడా లేవు. దీంతో మెడికల్ షాపుల దోపిడీ మరింత పెరిగింది. మందులపై జీఎస్టీ తగ్గిందన్న విషయాన్ని వ్యాపారులు బోర్డుల ద్వారా అవగాహన కల్పించడం లేదు. ఇప్పటికైనా మెడికల్ షాపుల్లో అమలు కాని తగ్గింపు జీఎస్టీపై అటు డ్రగ్ కంట్రోల్ అధికారులు, వాణిజ్యపన్నుల శాఖ అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పునర్విభజనకు కసరత్తు

(7వ పేజీ తరువాయి)

అందుకు నిర్దేశిత గడువును విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు ఈనెల 29వ తేదీలోపు వార్డుల పునర్విభజన పూర్తిచేసి ముసాయిదాను విడుదల చేయాల్సి ఉంది. ప్రజాప్రతినిధులు, మునిసిపల్ కౌన్సిల్ నుంచి అభ్యంతరాలు, సూచనలకు అక్టోబర్ 6 (ఏడు రోజులు), వార్డుల విభజన ప్రతిపాదనలను కలెక్టర్ ఆమోదం పంపేందుకు అక్టోబర్ 8 (రెండు రోజులు), కలెక్టర్ నుంచి మున్సిపల్ రాష్ట్ర కమిషనర్, డైరెక్టర్ అనుమతి కోసం పంపేందుకు అక్టోబర్10, కమిషన్ ఆమోదానికి అక్టోబర్ 12, ఆమోదం పొందిన జాబితాతో కూడిన గెజిట్ నోటిఫికేషన్‌కు తుది గడువును అక్టోబర్ 14గా విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. విభజన ప్రక్రియ ఆయా పట్టణాలలో ఈశాన్యం వైపు నుంచి మొదలు పెట్టి క్లాక్‌వైజ్ పూర్తిచేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

మారనున్న రిజర్వేషన్ల ముఖచిత్రం

వార్డుల పునర్విభజన ప్రభావం రిజర్వేషన్లపై కూడా పడనుంది. గత ఎన్నికల నాటి నుంచి రిజర్వేషన్ల ఖరారులో కొత్త సైకిల్ అమలు చేశారు. ఈ మేరకు రాబోయే ఎన్నికల్లో ఇదే సైకిల్‌ను కొనసాగించాల్సి ఉంది. కానీ వార్డుల పునర్విభజన జరిగే మునిసిపాలిటీల్లో వార్డుల రిజర్వేషన్‌కు మళ్లీ కొత్త సైకిల్‌ను ప్రారంభించాల్సి ఉంది. ఆయా వార్డుల పరిధిలో కులాలను బట్టి రిజర్వేషన్ ఖరారు చేయనున్నారు. వార్డుల పునర్విభన కసరత్తు మొదలుకావడంతో మునిసిపల్ ఎన్నికల ప్రక్రియ మొదలైనట్లే. దీంతో సహజంగానే ఆశావహుల్లో ఆసక్తి, ఎన్నికల వేడి మొదలైంది. కాగా వార్డుల పెంపుతో వార్డుల్లో ఓటర్ల సంఖ్య తగ్గనుంది. గతంలో సగటున 1,200మంది ఉండగా విభజన అనంతరం 900 మందిలోపే ఉండే అవకాశం ఉంది.

వార్డుల పునర్విభజన ప్రారంభించాం

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చీమకుర్తి మునిసిపాలిటీ పరిధిలో వార్డుల పునర్విభజన ప్రక్రియను ప్రారంభించాం. నిబంధనలను పక్కాగా అమలు చేస్తాం. మ్యాపుల ప్రకారం విభజన చేసి ఉన్నతాధికారులకు గడువులోపు నివేదిస్తాం.

- వై.రామకృష్ణయ్య, కమిషనర్, చీమకుర్తి మునిసిపాలిటీ

పశ్చిమ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు

(7వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డిలు అసెంబ్లీలో ఈసారి చురుగ్గా వ్యవహరించారు. కొన్ని అంశాలపై ముగ్గురూ కలిసి, అలాగే తమ నియోజకవర్గాలకు పరిమితమైన వాటిపై విడివిడిగానూ చర్చ పెట్టారు. తమ ప్రాంతంలోని ప్రజల సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల ఆవశ్యకతను సభలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. మంత్రుల ద్వారా ఆయా అంశాలపై సమాధానాలు రాబట్టడంలో చొరవ చూపారు. కొన్ని అంశాలపై గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపైనా చర్చ పెట్టారు. సభ జరిగినన్ని రోజులు నిత్యం ఆ ముగ్గురిలో ఎవరో ఒకరు ఏదో ఒక అంశంపై మాట్లాడటం కనిపించింది. కీలకమైన ప్రశ్నోత్తరాల సమయంతోపాటు ఇతర సమయంలోనూ అవకాశాన్ని అందిపుచ్చుకొని తమ ప్రాంత అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

హామీలు పొందగలిగారు

పశ్చిమప్రాంతంలో ప్రభుత్వ వైద్యం దుస్థితి, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అరకొర సౌకర్యాలు, డాక్టర్లు, సిబ్బంది కొరత, పేదల ఇక్కట్లు, వైద్య సౌకర్యాల మెరుగు పర్చాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యేలు ముత్తుముల, కందుల, ఉగ్ర అసెంబ్లీ సమావేశాల్లో ఎలుగెత్తి చాటారు. సంబంధిత మంత్రి సత్యకుమార్ నుంచి కొన్ని హామీలను కూడా పొందగలిగారు. ఆ సందర్భంగా కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ప్రత్యేక చొరవ చూపి కనిగిరిలో మాతా శిశురక్షణ కోసం కంగారు మదర్స్ విభాగం ఏర్పాటును మంత్రి సత్యకుమార్ ప్రశంసించడం విశేషం. అసెంబ్లీ సమావేశాల చివరిరోజైన శనివారం రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలు, ఇళ్ల స్థలాల పంపిణీ, లెవలింగ్ పేరుతో జరిగిన దోపిడీపై చర్చలో ఎమ్మెల్యేలు ఉగ్రనరసింహారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొని తమ ప్రాంతంలో ఆ సమయంలో జరిగిన అక్రమాలను, నాటి వైసీపీ పాలకుల అవినీతిని ఎండగట్టారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర తమ ప్రాంతంలో టిడ్కో ఇళ్ల కేటాయింపులు, ఇతర స్థానిక అంశాలను సభ దృష్టికి తీసుకెళ్లారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తమ ప్రాంతంలో అధికంగా ఉన్న మైనారిటీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల ఏర్పాటు, మిర్చి రైతుల కోసం ప్రత్యేకంగా మినీయార్డు ఏర్పాటు, మార్కాపురంలో నిలిచిపోయిన ముస్లిం షాదిఖానా నిర్మాణం, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళారు.

ఉమ్మడి సమస్యలపై అంతంతమాత్రమే

గిద్దలూరు ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి ప్రభుత్వ వైద్యశాలల్లో సౌకర్యాల మెరుగుతోపాటు గిరిజన తాండాలలో ప్రసూతి కేంద్రాల ఏర్పాటు, భూసార పరీక్షా కేంద్రాల ఏర్పాటు, పట్టణంలోని రాచర్ల రోడ్డులో ప్రజల ఇక్కట్లు తీర్చేందుకు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, టిడ్కో ఇళ్ల కేటాయింపు తదితర అంశాలను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గతంతో పోల్చితే ఈసారి అసెంబ్లీలో జిల్లా ఎమ్మెల్యేలు కొంత చురుగ్గానే వ్యవహరించారు. అయితే జిల్లా ఉమ్మడి సమస్యలు, కీలక అభివృద్ధి అంశాలపై ఉమ్మడిగా అధికారపక్ష ప్రజాప్రతినిధులు సభ లోపల కానీ, వెలుపల వివిధ అవకాశాల ద్వారా కానీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం పెద్దగా చేసినట్లు కనిపించలేదు.

కొత్త టీచర్లకు శిక్షణ

(7వ పేజీ తరువాయి)

నియామక ఉత్తర్వులు ఇస్తారు. 13న వీరు కొత్త పాఠశాలల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది. డీఎస్సీలో టీచర్ పోస్టులు సాధించిన వారు తప్పనిసరిగా శిక్షణకు హాజరు కావాల్సిందేనని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆదేశాలు జారీచేశారు.

శిక్షణ ఎవరికి ఎక్కడంటే?

పొదిలిలోని ఒంగోలు రోడ్డులో ఉన్న సెయింట్ మేరీ బీఈడీ కళాశాలలో స్కూలు అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ టీచర్లకు టీచర్లకు శిక్షణ ఉంటుంది.

చీరాల రామాపురంలోని చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో స్కూలు అసిస్టెంట్లు జీవశాస్త్రం, గణితం, ఫిజికల్ సైన్స్ వారికి శిక్షణ ఇస్తారు.

చీరాల ఎన్‌టీఆర్ నగర్‌లోని వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో స్కూలు అసిస్టెంట్లు వ్యాయామ విద్య, సాంఘిక శాస్త్రం టీచర్లకు ట్రైనింగ్ ఉంటుంది.

కనిగిరి మాచవరంలోని ఆల్ఫా అగ్రికల్చరల్ కళాశాలలో సెకండరీ గ్రేడ్ తెలుగు, ఉర్దూ టీచర్లకు శిక్షణ ఇస్తారు.

ప్రభుత్వ వైద్యుల ఆందోళన బాట

(7వ పేజీ తరువాయి)

ధరించి ఓపీలకు హాజరయ్యారు. ప్రధానమైన డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు రోజువారీ ఉద్యమం కొనసాగించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఎలాంటి ఉద్యోగోన్నతులు లేకుండా పనిచేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర శాఖల్లో ఐదారేళ్లు పనిచేస్తే ప్రమోషన్లు వస్తున్నా తమ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉందని వాపోయారు. ఇన్‌సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, టైమ్ బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులకు బేసిక్ పే 30శాతం, ట్రైబల్ అలవెన్స్ మంజూరు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, చంద్రన్న సంచార చికిత్స కింద రూ.5వేలు అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైద్యులకు కచ్చితమైన పనిగంటలు, వారాంతపు సెలవు, స్పష్టమైన జాబ్‌చార్ట్ ఇవ్వాలని, నాన్ మెడికల్ వ్యక్తులు విచ్చలవిడిగా తనిఖీలు చేయకుండా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. జిల్లావ్యాప్తంగా 170 మంది వైద్యాధికారులు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బాయ్‌కాట్ చేశారు. సోమవారం ఓపీలను బహిష్కరించనున్నారు. కేవలం అత్యవసర కేసులను మాత్రమే చూడాలని నిర్ణయించారు. మంగళవారం ఒంగోలులో ర్యాలీ నిర్వహించి ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇవ్వనున్నారు. అప్పటికి కూడా సమస్యలు పరిష్కారం కాకపోతే దసరా అనంతరం తదుపరి కార్యాచరణ రూపొందించుకోవాలని తీర్మానించుకున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యాధికారుల సమస్యలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కే.రాహుల్ కోరారు. ఇప్పటికే ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించి వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అలరించిన బాల భక్తి నీరాజనం

ఒంగోలు కల్చరల్, సెప్టెంబర్ 27(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం రాత్రి పలువురు చిన్నారులు అమ్మవారికి సమర్పించిన భక్తినీరాజనం శాస్త్రీయ సంగీత కార్యక్రమం భక్తులను విశేషంగా అలరించింది. స్థానిక లాయర్‌పేట సాయిబాబా మందిరంలో శ్రీ రాఘవ కూచిపూడి నృత్య, సంగీత కళానిలయం చిన్నారులు ఆలపించిన పలు భక్తిగీతాలు రసరమ్యంగా కొనసాగాయి. విఘ్నేశ్వరుని ప్రార్థనతో ఆరంభించి శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, అమ్మవారు మొదలైన దేవీదేవతల సంకీర్తనలను చిన్నారులు హృద్యంగా ఆలపించారు. కళానిలయం నిర్వాహకురాలు కరవది సాయిశరణ్య నిర్వహణలో కొనసాగిన ఈ కార్యక్రమంలో తబలాపై కొత్తపల్లి శ్రీనివాస్, వయొలిన్‌పై చావలి శ్రీనివాస్‌లు వాద్య సహకారాన్ని అందజేశారు. స్థానిక కేశవస్వామిపేట ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో మంత్రిప్రగడ నరసింహా రావు కుటుంబసభ్యులు ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో ప్రముఖ ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు శక్తిపీఠాల ఔన్నత్యాన్ని వివరించారు.



దేవీదేవతల సంకీర్తనలను ఆలపిస్తున్న చిన్నారులు



శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో వల్లూరమ్మ

లలితా త్రిపురసుందరీదేవిగా వల్లూరమ్మ

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఆరోరోజైన శనివారం వల్లూరమ్మ తల్లి లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో బి.రమేష్ పర్యవేక్షించారు.

కామేపల్లిలో...

జరుగుమల్లి మండలం కామేపల్లిలోని శ్రీపోలేరమ్మ శనివారం లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి చీరలు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో బైరాగిచౌదరి పాల్గొన్నారు.

సింగరాయకొండలో..

సింగరాయకొండ : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని జాలమ్మతల్లి దేవస్థానంలోని అమ్మవారు శనివారం లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. చెట్టుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారిని సుందరమైన పుష్పాలతో అలంకరించారు. పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు.

స్వచ్ఛ గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

● డీపీవో వెంకటేశ్వరరావు



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

సింగరాయకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని మూలగుంటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలను ప్రతిఒక్కరూ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.జయమణి, డిప్యూటీ ఎంపీడీవో ఆర్.రమేష్‌బాబు, ఎంఈవో కత్తి శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సౌజన్య, పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పొన్నలూరు సర్వసభ్య సమావేశం

పొన్నలూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

అర్ధరాత్రి పోలీసుల స్పెషల్ డ్రైవ్



బస్టాండ్ వద్ద అపరిచితులను విచారిస్తున్న సీఐ సుబ్బారావు, సిబ్బంది

మార్కాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ ఆదేశాల మేరకు మార్కాపురం పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ముందుగా పట్టణంలోని అన్ని లాడ్జీలను తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. కొత్త వ్యక్తులు, అనుమానితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద అపరిచిత వ్యక్తులను విచారించారు. మోటార్ సైకిళ్లపై తిరుగుతున్న వారిని ఆపి పత్రాలను పరిశీలించారు. పలుచోట్ల యువకులు మద్యం సేవించి వీధుల్లో తిరుగుతున్నట్లు గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు.

అలనాటి జ్ఞాపకాలు అతి మధురం

● హైదారాబాదులో వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల పూర్వవిద్యార్థుల సమావేశం

చీరాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గురువుల మందలింపు, స్నేహితులతో ఆట పాటలు, కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలనాటి జ్ఞాపకాలు అతి మధురమని కర్నాటక రాష్ట్ర తాగునీరు సరఫరా ప్రతినిధి కామేపల్లి భూపాల్, ఖమ్మం స్టడీ సర్కిల్ కామర్స్ అకాడమీ చైర్మన్ జీవీ నరసింహారావు అన్నారు. శనివారం హైదరాబాదులో వీఆర్ఎస్ వైఆర్ఎన్ కళాశాల 1983-85 ఎంకామ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశవిదేశాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడి కళాశాలకు గుర్తింపు తెచ్చారన్నారు. కళాశాల అభివృద్ధికి తమవంతు సహకరిస్తామన్నారు. కుటుంబ సభ్యులతో హాజరై నాటి మధురానుభూతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌వీ బ్రహ్మయ్య, హరినాథ్‌బాబు, లక్ష్మీదేవీ, వెంకటేశ్వర్లు, బడేసాహెబ్, తదితరులు పాల్గొన్నారు. వీరంతా చీరాల, బాపట్ల, వేటపాలెం, ఒంగోలు, గుంటూరు, విజయవాడ, తదితర ప్రాంతాలకు చెందిన వారు కావడం విశేషం.

ఇంకుడు గుంతల నిర్మాణాలు వేగవంతం చేయాలి

డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

ముండ్లమూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రతి గ్రామ పంచాయతీలో 25 ఇంకుడు గుంతలు నిర్మాణాలు చేపట్టాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని శంకరాపురం, రమణారెడ్డిపాలెం గ్రామాలను సందర్శించారు. రమణారెడ్డిపాలెంలో జరుగుతున్న మ్యాజిక్ డ్రెయిన్‌ల పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా మండలానికి ఒకటి చొప్పున పల్లె పుష్కరిణి కార్యక్రమంలో భాగంగా శంకరాపురం చెరువును అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. మండలంలోని మారెళ్ళ నుంచి బలరామ్‌నగర్ వరకు 1200 మొక్కలు, గంగన్నపాలెం నుంచి నూజెండ్లపల్లి వరకు 800 మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతరం డ్వామా కార్యాలయంలో సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో జరిగిన సమావేశంలో పీడీ జోసెఫ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులు వేగవంతం



రమణారెడ్డిపాలెంలో మ్యాజిక్ డ్రెయిన్‌ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

గోకులం షెడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. కాగా, శంకరాపురం వచ్చిన పీడీ జోసెఫ్‌కుమార్‌ను మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ మల్లేశ్వరి నారాయణ స్వామి, ఎంపీడీవో అబ్దుల్ కరీం దుశ్శాలువాతో సన్మానించారు.

మా ఊరికి రోడ్డొచ్చిందహో..

పాత గోళ్లవిడపి గ్రామస్థుల హర్షం

ఆ ఊరి ప్రజలు సుమారు 40 సంవత్సరాలుగా గుంతల రోడ్డుతో నకరం అనుభవించారు. ప్రజా ప్రభుత్వం స్పందించడంతో ఎట్టకేలకు కొత్త రోడ్డు నిర్మించారు. టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ప్రయాణ కష్టాలపై స్పందించి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు కొత్త రోడ్లను నిర్మిస్తున్నారు. పాత గోళ్లవిడపి గ్రామ రహదారి దుస్థితిని తెలుసుకున్న ఎరిక్షన్‌బాబు అధికారులతో మాట్లాడి రోడ్డును బాగు చేయాలని సూచించారు. పంచాయతీరాజ్ అధికారులు ఎర్రగొండపాలెం - వినుకొండ రోడ్డు నుంచి పాత గోళ్లవిడపి గ్రామానికి అలాగే గ్రామ వీధుల్లో రూ.2.27కోట్లతో రోడ్లు వేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - ఎర్రగొండపాలెం రూరల్, (ఆంధ్రజ్యోతి)



14 మంది ఆడిటర్లకు సంజాయిషీ నోటీసులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయసహకార పరపతి సంఘాల్లో (సొసైటీ) 2024-25 ఆర్థిక సంవత్సరం ఆడిట్‌ను పూర్తిచేయడంలో వెనుకబడిన 14 మంది సహకార ఆడిటర్లకు జిల్లా సహకార ఆడిట్ అధికారి డి.శ్రీనివాసరావు సంజాయిషీ నోటీసులు జారీచేశారు. జిల్లాలోని 93 సొసైటీల్లో 37 సొసైటీలకు సహకార ఆడిటర్లను, 56 సొసైటీలకు చార్టెడ్ అకౌంటెండెంట్ (సీఏ) ఆడిటర్లకు అప్పగించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆడిటర్లకు ఆడిట్ కార్యక్రమాన్ని ఎవరికి ఏ సొసైటీ, ఎప్పటిలోపు పూర్తి చేయాలో నిర్దేశిస్తూ డీసీఏవో ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ఉత్తర్వుల్లో ఆగస్టు ఆఖరునకు ఆడిట్ పూర్తిచేయాలని ఆదేశించారు. ఒక ఆడిటర్‌కు సగటున మూడు సొసైటీలు కేటాయించారు. అయితే సెప్టెంబరు ఆఖరుకు కూడా ఆడిట్ పూర్తయ్యే పరిస్థితి లేకపోవడంతో ఆడిటర్లకు సంజాయిషీ నోటీసులు ఇచ్చారు. సొసైటీల ఆడిట్‌ను వెంటనే పూర్తి చేయలని ప్రైవేటు చార్టెడ్ అకౌంటెంట్లకు కూడా డీసీఏవో శ్రీనివాసరావు లేఖలు రాశారు.

దుకాణాల్లో తనిఖీలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం వస్తుపన్ను (జీఎస్టీ) తగ్గించడంతో షాపుల్లో అమలుపై జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు దృష్టి సారించారు. డీఎస్‌వో పద్మశ్రీ నేతృత్వంలో ఆ శాఖ అధికారులు ఒంగోలు నగరంలోని పలు దుకాణాలను శనివారం రాత్రి పరిశీలించారు. ముందుగా డీమార్ట్‌లో పరిశీలించారు. జీఎస్టీ ధరలు తగ్గించిన తర్వాత అక్కడ అమ్మకాల ధరలను పరిశీలించారు. అనంతరం మోర్ సూపర్ మార్కెట్‌ను సందర్శించారు. ఆ షాపులో పలురకాల వస్తువుల ధరలను పరిశీలించారు. ప్రభుత్వం జీఎస్టీ తగ్గించినందున తదనుగుణంగా ధరలు తగ్గింపుతో విక్రయాలు చేస్తున్నట్లు బోర్డులు ఏర్పాటు చేయాలని షాపుల నిర్వహకులను ఆదేశించారు.



సూపర్ మార్కెట్‌లో ధరలను పరిశీలిస్తున్న డీఎస్‌వో పద్మశ్రీ

రైల్లో 9 కిలోల గంజాయి పట్టివేత

● బాలుడు అరెస్టు ● కీలక పాత్ర పోషించిన రాక్సీ డాగ్

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాను అడ్డుకునేందుకు ఈగల్ టీమ్, జీఆర్‌పీ, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సంయుక్తంగా రైళ్లలో తనిఖీలు నిర్వహించి శుక్రవారం అర్ధరాత్రి ఒంగోలు రైల్వేస్టేషన్‌లో బొకారో రైలులో 9.500 కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రైల్వే ఎస్సై మధుసూదనరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తమిళనాడుకు చెందిన బాలుడు ఒడిశా నుంచి గంజాయిని తరలిస్తూ తనిఖీల్లో పట్టుబడ్డాడు. బాలుడు తరలిస్తున్న గంజాయి విలువ రూ.75 వేలు ఉంటుందని అన్నారు. రైళ్లలో గంజాయి పట్టుకునేందుకు ఈగల్ టీమ్ రాక్సీ డాగ్‌ను వినియోగిస్తున్నారు. ధన్‌బాద్ నుంచి అలెప్పీ వెళుతున్న రైలులో బాలుడు రెండు బ్యాగ్‌లలో గంజాయిని తరలిస్తూ పోలీసులకు పట్టుపడ్డాడు. ఒకచోట 6 కిలోల బ్యాగ్, మరోచోట 3.5 కిలోల బ్యాగ్ పోలీసుల తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు. బాలుడిని అరెస్టు చేసి నెల్లూరులోని జువైనల్ జస్టిస్‌బోర్డు ముందు హాజరు పెడతామని అన్నారు. ఈ తనిఖీలలో ఈగల్ టీమ్ సీఐ సుధాకర్, ఎస్సైలు శ్రీకాంత్, శివరామయ్య, రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్, జీఆర్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

వెదురు సాగు చేయాలి

గిద్దలూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీడు భూముల్లో వెదురు సాగు చేసి ఆదాయం పొందవచ్చని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణ అన్నారు. స్థానిక విఠా సుబ్బరత్నం కల్యాణ మండపం ఆవరణలో వెదురు సాగు రైతుల జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీడీ నారాయణ మాట్లాడుతూ గిద్దలూరు, రాచర్ల, అర్ధవీడు మండలాల్లో సాగుకు అనుకూలంగా లేని బీడు భూములను గుర్తించామని, ఈ బీడు భూముల్లో వెదురు సాగు చేసి అదనపు ఆదాయం పొందేందుకు 400 మంది రైతులను ఎంపికచేసినట్లు చెప్పారు. రైతులకు ఎన్‌ఆర్‌ఈజీఎస్, హార్టికల్చర్, డీఆర్‌డీఏ శాఖల ద్వారా ప్రోత్సాహం కల్పించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి శ్వేత, వెలుగు బీపీఎం దానం, మండల సమాఖ్య అధ్యక్షురాలు జైనాబీ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ వెలుగు పీడీ నారాయణ

రైతులందరికీ ఎరువులు పంపిణీ చేస్తాం : రావెళ్ల

కొండపి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కొండపి సహకార సంఘం పరిధిలోని 12 గ్రామ పంచాయతీలలోని రైతులకు ఎరువులను పంపిణీ చేస్తామని సంఘ చైర్మన్ రావెళ్ల వెంకటరఘునాథ్‌బాబు తెలిపారు. శనివారం సొసైటీ ఆధ్వర్యంలో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువుల పంపిణీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏవో మాల్యాద్రి, కొండపి సహకార సంఘ సీఈవో నల్లపు పవన్, పీడీసీసీ బ్యాంకు కొండపి బ్రాంచ్ మేనేజర్ నల్లపు మాల్యాద్రి, సహకార సంఘ కమిటీ సభ్యులు మూలె రామిరెడ్డి, దేవరాల బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి) : సెపక్‌తక్రా సీనియర్స్ 35వ రాష్ట్ర స్థాయి పోటీలు శనివారం ఒంగోలులో ఘనంగా ప్రారంభం అయ్యాయి. స్థానిక మినీ స్టేడియంలో ఏర్పాటుచేసిన పోటీలను పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి శీతారామయ్య ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించాలన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఒంగోలులో జరగడం అభినందనీయం అన్నారు. క్రీడాకారులు విజేతలుగా నిలిచి జాతీయ స్థాయిలో రాణించాలని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ రెండు రోజులపాటు పోటీలలో రాష్ట్రంలోని అన్నీ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. గెలుపొందిన విజేతలు అక్టోబరు 23వ తేది నుంచి 27వ తేది వరకు గోవాలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా అధ్యక్షులు వైసురేష్, కార్యదర్శి డి.రవి, కోచ్ శ్రీనివాసరావు, ఉమా మహేశ్వరరావు, డాక్టర్ ఆర్, సాయికృష్ణ పలువురు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పీడీసీసీబీ చైర్మన్ డాక్టర్ శీతారామయ్య

అల్లుకున్న నిర్లక్ష్యం

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ఫీజు వైర్లు, విద్యుత్ స్తంభాలు కనిపించకుండా దట్టంగా తీగ మొక్కలు అల్లుకున్నాయి. దీంతో మేతకు వెళ్లే పశువుల కాపరులకు, రైతులకు ప్రమాదం జరగవచ్చని ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్, ఫీజు వైర్లు చుట్టూ అల్లుకున్న తీగలను తినేందుకు పశువులు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈనెల 19న అర్ధవీడు మండలం చింతమల్లెపాడు గ్రామానికి చెందిన పశువులు ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగలను తినేందుకు రాగా అక్కడికి వెళుతున్న రైతు చిన్న కాశయ్య వాటిని తోలే క్రమంలో విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాదాలు జరుగకముందే తీగలను తొలగించాలని రైతులు కోరుతున్నారు. - కంభం, ఆంధ్రజ్యోతి



కాలనీ పేరుతో లక్షలకోట్ల ప్రజాధనం వృథా!

● అసెంబ్లీలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ కాలనీ పేరుతో రూ.లక్షల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శనివారం జగనన్న కాలనీలపై ఆయన మాట్లాడారు. కొండపోరంబోకు భూములు, వాగులు తదితర స్థలాలను కాలనీలకు కేటాయించిందన్నారు. ప్రజలు నివాసయోగ్యం లేనిచోట్ల కేటాయించి నిధులను వృథా చేసిందన్నారు. మార్కాపురం పట్టణవాసుల కోసం 129 ఎకరాల వాగు భూమి, మరో 84 ఎకరాలు కొనుగోలు చేసి కాలనీలకు కేటాయించారన్నారు. వాటిలో ఒకటి పట్టణానికి 8 కిలోమీటర్లు, మరొకటి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. మొదటి ఫేజ్‌లో 3,732 ప్లాట్లు వేసి 2,300 గృహాలు, సెంకడ్ ఫేజ్‌లో 3,140 ప్లాట్లువేసి 2,400 గృహాలు మంజూరు చేసినా వాటిల్లో చేరేందుకు ఏ ఒక్క కుటుంబం సుముఖంగా లేదన్నారు. ఆయా కాలనీల్లో వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు ముందుకు రాలేదన్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించి ఆ కాలనీల్లో వసతులు కల్పించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. అదే విధంగా జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి కుటుంబాలు, యువ సాంకేతిక నిపుణులు, విద్యార్థులు, చిరు వ్యాపారులు, ఎమ్ఎస్ఎమ్ఈ, రైతులకు ఊరట లభించిందన్నారు.

మునగ సాగుతో రైతులకు లాభాలు

మార్కాపురం రూరల్ : మునగ సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని జిల్లా డీఆర్‌డీఏ వెలుగు పీడీ నారాయణ తెలిపారు. ఎస్సీబీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో మార్కాపురం డివిజన్‌లోని మునగ సాగు చేసే రైతులతో అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. మునగ కాయలతో పాటు ఆకులకూ డిమాండ్ ఉందన్నారు. దీంతో రెండింటివల్లా ఆదాయం సమకూరుతుందని చెప్పారు. ఎండబెట్టిన మునగ ఆకు పొడిని ఔషధాల తయారీలో ఉపయోగిస్తారని వివరించారు. మునగ సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి ఎకరాకు రెండు సంవత్సరాలలో రూ.లక్షా 60 వేల సాయం అందుతుందని తెలిపారు. కొరమీను చేపల యూనిట్లకు కూడా ప్రభుత్వ రాయితీ అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్ డీపీఎం దానం, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్, ఎల్‌హెచ్ ఏపీఎం నారాయణ, హెచ్‌వో రమేష్, ఏపీఎం పిచ్చయ్య, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో నాగరాజు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలు సాగుచేయాలి

తాళ్లూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డ్వామా ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో హార్టికల్చర్ పెంపకం, ఇంకుడు గుంత నిర్మాణం, మొక్కల పెంపకంపై ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేకశ్రద్ధ చూపాలని పీడీ జి.జోసఫ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.అజిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాళ్లూరు ప్రాంతంలో అధికంగా వరి సాగుచేస్తూ రైతాంగం నష్టపోతున్నారన్నారు. రైతులు వరికి బదులు ఉద్యానవన పంటల పెంపకం చేపట్టేలా పోత్సహించాలని ఫీల్ అసిస్టెంట్లకు సూచించారు. మండలంలో 160 ఎకరాలల్లో ఉద్యాన పంటల పెంపకం మంజూరు చేస్తే నేటికి పది ఎకరాల్లో కూడా సాగు చేసేందుకు రైతులు ముందుకురాకపోవటంలో ఫీల్డ్ అసిస్టెంట్ల నిర్యక్ష్యం కనబడుతుందన్నారు. ప్రభుత్వలక్ష్యాలను అమలు చేయటంతో నిర్లక్ష్యం వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు అవసరం లేదన్నారు. వారం రోజుల్లో అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని, లేకుంటే వారిని తొలగించి కొత్తవారిని నియమిస్తామన్నారు.

గ్రంథాలయ పుస్తక ఎంపిక కమిటీలో 'మంచికంటి'



సమావేశంలో పాల్గొన్న మంచికంటి, ఇతర సభ్యులు

ఒంగోలు కల్చరల్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరానికి చెందిన ఉపాధ్యాయుడు, ప్రముఖ రచయిత, మరో గ్రంథాలయ ఉద్యమ వ్యవస్థాపకులు మంచికంటి వెంకటేశ్వర రెడ్డి ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పుస్తకాల సెలక్షన్ కమిటీకి ఎంపికయ్యారు. శుక్ర, శనివారాలలో విజయవాడ స్టేట్ సమగ్ర శిక్ష కార్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఈ మేరకు ఆయనను ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆయన కొండపి మండలం జాళ్లపాలెం ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తూ గ్రంథాలయ ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నడిపిస్తున్నారు. ఈ వర్క్‌షాప్‌లో రాబోయే సంవత్సరానికి ఎంపీ పాఠశాలల్లో గ్రంథాలయం అమలు గురించి మంచికంటి సమన్వయం చేశారు. నయితాలీం అధ్యక్షుడు సీఏ ప్రసాద్, పలువురు రచయితలు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. మంచికంటి వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వం పాఠశాలలకు పంపిణీ చేస్తున్న విలువైన పుస్తకాలను ఉపాధ్యాయులు విద్యార్థుల కోసం వినియోగించి వారిని జ్ఞాన సముపార్జన దిశగా ప్రేరేపించాలని అన్నారు.

జిల్లాలో 11.8 మి.మీ వర్షపాతం నమోదు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తారు నుంచి మంచి వర్షం కురిసింది. శనివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 11.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. హనుమంతునిపాడు 76.2, పెద్దారవీడులో 52.8, గిద్దలూరు 36.4, యర్రగొండపాలెం 33.8, దోర్నాల 33.4, బేస్తవారిపేట 25.4, అర్థవీడు 19.2, కంభం 17.8, మార్కాపురం 17.4, దొనకొండ 15.8, కొనకనమిట్ల 14.8, కనిగిరి 14.2, కొండపి 10.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

కొండపి, సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.ఉప్పలపాడు ఎస్సీ కాలనీ వద్ద ద్విచక్ర వాహనాన్ని మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం జరిగింది. ఎస్సీ కాలనీకి చెందిన కొప్పోలు మాలకొండయ్య, కోటేశ్వరరావు మోటార్‌సైకిల్‌పై వెళుతున్నారు. జాళ్లపాలెం గ్రామానికి చెందిన భూమా బ్రహ్మారెడ్డి కె.ఉప్పలపాడు నుంచి కొండపి వైపు వెళుతూ ట్రాక్టర్‌ను అతివేగంతో నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. బాధితులు ఒంగోలులో ప్రైవేటు వైద్యశాలలో చేరారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చేనెల 31 వరకు అడ్మిషన్ల గడువు పెంపు

ఒంగోలువిద్య, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ) ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి పదవ తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు వచ్చేనెల 31 వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200 అపరాధ రుసుంతో ఈ ప్రవేశాలకు ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. పదవ తరగతిలో ప్రవేశానికి 14 సంవత్సరాలు నిండినవారు, ఇంటర్‌లో ప్రవేశాలకు 10వ తరగతి పాసై 15 సంవత్సరాల వయస్సు నిండినవారు అర్హులన్నారు.



పొగాకు వేలం కేంద్రంలో రైతు నాయకులు, రైతులతో మాట్లాడుతున్న బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

అనుమతించిన మేరకే పొగాకు పండించాలి

● రైతులకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ సూచన

పొన్నలూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బోర్డు అనుమతించిన మేరకే పొగాకును పండించాలని చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ రైతులకు సూచించారు. అధికంగా పంట ఉత్పత్తి చేసి నష్టపోవద్దన్నారు. పొగాకు పంట నియంత్రణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై కందుకూరు-1 వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొగాకును అధికంగా సాగుచేస్తే రానున్న సీజన్‌లో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పొగాకు పండించే బ్రెజిల్, చైనా, జింబాబ్వే, మలావియ, టాంజానియా తదితర దేశాల్లో పంట ఉత్పత్తి అధికంగా వచ్చిందన్నారు. ఈనేపథ్యంలో వచ్చే సీజన్‌లో ఇక్కడ పొగాకు ధరల్లో హెచ్చుతగ్గులు ఉండవచ్చని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకొని పంటను నియంత్రించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని కోరారు. వేలం నిర్వహణాధికారి ఎం.కిరణ్ మాట్లాడుతూ రైతులు పరిమితికి లోబడి తక్కువ ఖర్చుతో నాణ్యమైన పొగాకును పండించాలన్నారు. కార్యక్రమంలో బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న జేవీవీ నాయకులు

ఐక్యమత్యం పెంచడమే దేశభక్తి

ఒంగోలు విద్య, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కులమతాలకతీతంగా ప్రజలలో ఐక్యమత్యానికి కృషి చేయడమే నిజమైన దేశభక్తి అని జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్‌జయప్రకాష్ అన్నారు. మహాకవి గురజాడ అప్పారావు, విశ్వకవి గుర్రంజాషువ, మహాత్మాగాంధీల జయంతులను పురస్కరించుకొని జనవిజ్ఞానవేదిక ఒంగోలు నగర కమిటీ ధ్వర్యంలో శనివారం శ్రీ హర్షిణీ డిగ్రీ కళాశాలలో వ్యాసరచన, వక్తృత్వ, పాటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర జేవీవీ నగర అధ్యక్షుడు ఎస్వీ రంగారెడ్డి అధ్యక్షత వహించగా శ్రీ హర్షిణీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దాడి ఆంజనేయులు, కళాశాల అధ్యాపకులు ఇస్మాయిల్, మురళీ తదితరులు ఉన్నారు.

సుధాకర్‌ప్రసాద్‌కు ఘన నివాళి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, ఎన్‌జీవో సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి స్వర్గీయ తోట సుధాకర్ ప్రసాద్ వర్ధంతి శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక రెవెన్యూ భవన్‌లో సుధాకర్ ప్రసాద్ విగ్రహానికి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పిన్నిక మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



అలాస్ ఆర్గానిక్ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు

అలాస్ ఫుడ్ వరల్డ్ ఆర్గానిక్ రెస్టారెంట్ ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్. సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సౌత్‌బైపాస్‌లో ఆహ్లాదకరమైన వాతావరణంలో శనివారం నూతనంగా అలాస్ ఫుడ్‌వరల్డ్ ఆర్గానిక్ రెస్టారెంట్‌ను మాజీ ఎమ్మెల్యేలు పోతుల రామారావు, ఆదెన్నలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు మాట్లాడుతూ అలాస్ ఫుడ్ వరల్డ్ ఆర్గానిక్ రెస్టారెంట్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అలాస్ గ్రూపు ఛైర్మన్ ఏవీఎస్ రాజు తనకు చిరకాలమిత్రుడు అని అన్నారు. ఈ వ్యాపారం కూడా మంచి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అలాస్ ఫుడ్ వరల్డ్ రెస్టారెంట్ యజమాని హర్ష మాట్లాడుతూ రొయ్య, చాపలు,మాంసం కూరగాయలు సొంత ఫామ్‌లో ఉత్పత్తి చేస్తూ ప్రజలకు మంచి ఆర్గానిక్ ఫుడ్ అందించాలనే లక్ష్యంతో ఈ హోటల్‌ను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేషం రాజు, గోపీనాథ్ తదితరులు ఉన్నారు.

లలితా త్రిపురసుందరీ పాలయమాం

ఒంగోలు కల్చరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):దసర శరన్నవ రాత్రి ఉత్సవాలలో ఆరవ రోజైన శనివారం అమ్మవారు లలితా త్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు దేవాలయాలలో మహిళలు లలితా సహస్రనామ పారాయణంతో పాటు, ప్రత్యేక కుంకుమార్చనలు జరిగాయి. ఒంగోలు నగరంలో ని వివిధ దేవాలయాలలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, విశేష కుంకుమార్చనలు జరిగాయి. శనివారం రాత్రి స్థానిక గద్దలగుంటపాలెం, రైలుపేటలో భక్తులు అమ్మవారి వేషధారణలతో, మేళతాళాల మధ్య నగరోత్సవం నిర్వహించి అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు.



కొత్తపట్నం రోడ్‌లోని రాజరాజేశ్వరి ఆలయంలో పార్వతీదేవి అలంకరణలో అమ్మవారు



లలితాత్రిపుర సుందరీ దేవిగా కేశవస్వామిపేటలోని విజయదుర్గ అమ్మవారు



అచలానంద ఆశ్రమంలో శాకంబరీగా గోవిందమాంబ అమ్మవారు

శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనం

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు శ్రీచెన్నకేశవ స్వామివారి దేవాలయంలో శరన్నవరాత్రులలో భాగంగా శనివారం అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకుడు పరాంకుశం సమీర్‌కుమార్ ప్రత్యేక అలంకరణ అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వెండి పట్టీల అలంకరణలో అమ్మవారు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన నాగులుప్పలపాడులోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయం వద్ద శుక్రవారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాలక్ష్మి అవతారంలో అమ్మవారికి 10 కేజీల వెండి పట్టీలతో అలంకరించారు. శనివారం రాత్రి బాలా త్రిపుర సుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైసీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. లీగల్‌సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ధర్నాసి హరిబాబు, దారా మాధవరావు, భూపని కాశయ్య, నల్లమలపు సుబ్బారెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, కాకుటూరి సంపత్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు ఉన్నారు.

డిజిటల్ బుక్ ఆవిష్కరణ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురైన కార్యకర్తలకు అండగా నిలిచేందుకు వైసీపీ తీసుకువచ్చిన డిజిటల్ బుక్‌ను స్థానిక వైసీపీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ జిల్లా పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబులు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

క్విస్‌లో ఉత్సాహంగా దసరా సంబరాలు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ముందస్తు దసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి అని, ఈసందర్భంగా విద్యార్థినులు దుర్గామాత ప్రతిమకు ప్రత్యేక ఆలంకరణలు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. విద్యార్థినులు సంప్రదాయదుస్తుల్లో హాజరై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, కల్చరల్ డీన్ వనిత కృష్ణ ఉన్నారు.



ముగ్గులో తీర్చిదిద్దిన అమ్మవారు

పేస్‌లో కృత్రిమ మేధపై శిక్షణ



మాట్లాడుతున్న డెవలపర్

ఒంగోలు విద్య, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో కృత్రిమ మేధ(ఏఐ) అండ్ డేటా సైన్స్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు శనివారం ఫ్లట్టర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఫ్లట్టర్ డెవలపర్ రమేష్ పాల్గొని మాట్లాడారు. ఫ్లట్టర్ టెక్నాలజీలో తాజా పరిజ్ఞానం,ఆధునిక టాయ్, కెరీర్ అవకాశాలను వివరించారు. మొబైల్, వెబ్ యాప్ డెవలప్‌మెంట్‌ను ఫ్లట్టర్ వేగవంతం చేసి సమర్థవంతంగా పనిచేస్తున్న ఏఐ విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఫ్లట్టర్ టెక్నాలజీతో ఐటీ రంగంలో ఉ ద్యోగ అవకాశాలకు అధిక డిమాండ్ ఉందన్నారు.

పాఠశాల విద్యార్థులకు ఆర్టీసీ బస్‌పాస్‌లు

కొత్తపట్నం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవసరమైన ఉచిత బస్ పాస్‌లను శనివారం ఒంగోలులోని శ్రీరామ్ సూపర్‌స్పెషాలిటీ వైద్యులు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ శాంతకుమారిలు అందిం చారు. కొత్తపట్నం ఉన్నత పాఠశాలలో చదువుకున్న డాక్టర్ వంశీకృష్ణ తాను చదువుకున్న పాఠశాల అబివృద్ధికి ఎన్నో కార్యక్రమా లు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రస్తుతం పాఠశాలకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉచితంగా బస్‌ల్లో ప్రయాణించేందుకు అవసరమైన పాస్‌లను సమకూర్చారు. ఈ పాస్‌లను శనివారం ఆయన హైస్కూలు ప్రధానోపాధ్యాయులు బలిశెట్టి శ్రీనివాసరావు, ఇతర పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి జనరల్ మేనేజర్ డాక్టర్ సౌమిత్ర పల్లవ్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాశిం సైదా, కొత్తపట్నం హైస్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సంబంధించిన పాస్‌లను పాఠశాల హెచ్‌ఎంకు అందిస్తున్న శ్రీరామ్ ఆసుపత్రి వైద్యులు వంశీకృష్ణ దంపతులు

పంచాయతీలు సొంత నిధులు సమకూర్చుకోవాలి

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు సొంత నిధులు సమకూర్చుకోవాలని ఎంపీడీవో కె.రాజశేఖరరావు అన్నారు. ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సర్పంచ్‌లకు, డిజిటల్ సహాయకులకు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీలు సొంత నిధులుపెంచుకొని అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామసర్పంచ్‌లు .పంచాయితి కార్యదర్శులు, ఇంజనీరింగ్,డిజిటల్ సహాయకులు పాల్గొన్నారు.

అమ్మనబ్రోలులో నేడు మెగా ఉచిత వైద్యశిబిరం

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయదశమి సందర్భంగా అమ్మనబ్రోలు గ్రామంలోని చిలకబడి వద్ద ముప్పవరపు సుచిత్ర వీరయ్యచౌదరి యువసేన ఆధ్వర్యంలో విజయవాడ హెల్ప్ వైద్యశాల, పెదకాకాని శంకర్ కంటి వైద్యశాలల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా గుండె, కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం,సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ కేవీపీ పాండు రంగారావు తెలిపారు. నగరంలోని కర్నూల్ రోడ్డు, శ్రీనగర్ కాలనీ, భారత్ పెట్రోల్ బంకు ప్రాంతంలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ అంతరాయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యసేవలు

చీమకుర్తి,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఆసుపత్రులతో అందిస్తున్న మెరుగైన వైద్యసేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు కోరారు.స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం చీమకుర్తి సీహెచ్‌సీలో ఉచిత వైద్యశిబిరం, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 12 విభాగాలలో వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

ప్రముఖ హార్మోనిస్టు సుభాని మృతి

ఒంగోలు కల్చరల్, సెప్టెంబర్ 27(ఆంధ్రజ్యోతి):ఒంగోలు నగరానికి చెందిన ప్రముఖ హార్మోనిస్టు షేక్ సుభాని(76) శనివారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణించారు. ఆయన ఒంగోలు అన్నవరప్పాడు మూడవ లైనులో నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సుభాని ఆరు దశాబ్దాలుగా తెలుగు నాటకరంగానికి హార్మోనిస్టుగా సేవలు అందిస్తూ రెండు తెలుగు రాష్ట్రాలలో జరిగిన అనేక నాటక ప్రదర్శనలలో వాద్య సహకారాన్ని అందజేశారు. సుభాని ఆకస్మిక మరణం పట్ల జిల్లా పౌరాణిక రంగస్థల కళాకారులు, ఐక్యవేదిక నాయకులు వాకా సంజీవ రెడ్డి, మిడసల మల్లిఖార్జున రావు, వెంకట్రామయ్య, కనమాల రాఘవులు, కొత్తపట్నం రత్తయ్య, శ్రీనివాసులు రెడ్డి, కొప్పోలు వెంకటేశ్వర్లు, మాకా ఆంజనేయులు, లక్ష్మారెడ్డి తదితరులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

సెలవు రోజులలో విద్యుత్ బిల్లులు చెల్లించ వచ్చు

ఒంగోలు క్రైం,సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సౌకర్యం కోసం ఈనెల 28,30 తారీఖులు సెలవులు అయినప్పటికి విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కౌంటర్లు తెరిచి ఉంటాయిని ఆ శాఖ ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాని వినియోగించుకొని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించు కోవచ్చని అన్నారు.

ఇంటి గోడను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని నెహ్రూ కాలనీలో 20 ఏళ్ళ నుంచి నివాసం ఉంటున్న ఎస్సీ మాలకులానికి చెందిన ఈద జాస్మిన్ ఇంటి గోడను కూల్చిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ డిమాండ్ చేశారు. శనివారం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.

లలితాదేవీ పాహిమాం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పట్టణంలో శనివారం అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు సంతాన లక్ష్మిగా, శివాలయంలో స్కందమాతగా, వాసవీమాత రాజ రాజేశ్వరి దేవిగా లక్ష్మీనారాయణస్వామి ఆలయం లో అమ్మవారు క్షీరసాగరకన్యగా పూజలందుకున్నారు. త్రిపురాంతకం : త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శనివారం బాలాత్రిపురసుందరీ దేవి అమ్మవారు స్కందమాత అలంకారంలో మయూర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రటరీ వెంకటసాయిప్రసాద్ శర్మ సతీసమేతంగా అమ్మవారిని దర్శనం చేసుకున్నారు.

గిద్దలూరు : శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు మీనాక్షిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహికంగా తెచ్చిన గంగాజలంతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఉభయదాతల చేత ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేలారే రేలా కార్యక్రమా న్ని నిర్వహించారు. జబర్దస్త్ కళాకారుడు శాంతికుమార్ నిర్వహించిన కార్యక్రమం అలరించింది. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు జిలకర సత్యం పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

పట్టణంలోని షరాఫ్ బజారులోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవ పూజలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి అలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణ మహోత్సవంలో పాల్గొనగా అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.

కంభం : 6వ రోజు శనివారం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీ గజలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కోటా సత్యమాంబదేవి శ్రీ మీనాక్షి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పెద్ద దోర్నాల : అమ్మవారు శనివారం లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయం, పోలేరమ్మ, సాయి బాబా మందిరం, తిమ్మాపురంలోని శ్రీ చౌడేశ్వరీ ఆలయాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

రాచర్ల : శ్రీ పట్టాభి రామస్వామి ఆలయంలో శ్రీ లలితా త్రిపుర సుందరీదేవీగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

పొదిలి : శ్రీ పార్వతీ సమేత నిర్మ మహేశ్వర స్వామి, శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి, అంకాలపరమేశ్వరి దేవాలయంలో, వేణుగోపాల స్వామి, మహాలక్ష్మమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవార్లు ప్రత్యేక అలం కారాల్లో పూజలందుకున్నారు.


గిద్దలూరులో మీనాక్షీదేవి అలంకారంలో అమ్మవారు


కంభంలో గజలక్ష్మీదేవిగా వాసవీమాత


రాచర్లలో లలితా త్రిపురసుందరీదేవిగా అమ్మవారు


అమ్మవారి పూజలో పాల్గొన్న రాష్ట్ర ఎన్నికల కమిషన్ జాయింట్ సెక్రటరీ వెంకటసాయిప్రసాద్ శర్మ


రాకపోకల బంద్‌తో వెనుదిరుగుతున్న ప్రయాణికులు

కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలు బంద్

- నల్లమలలోని బైర్లూటి రోడ్డుపై ఉధృతంగా వరద
- కర్నూలు వైపు వెళ్లేవి దారి మళ్లింపు

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలు శనివారం తాత్కాలింకంగా ని లిపి వేశారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు పరిధిలోని సిద్ధా పురం చెరువు నిండి అలుగు ద్వారా వరద నీరు నల్లమలలోని బైర్లూటి వద్ద రోడ్డుపై ఉ.ధృతంగా ప్రవహిస్తోంది. అప్రమత్తమైన అధికారులు వాహన రాకపోకలను నిలిపి వేశారు. మందస్తు చర్యల్లో భాగంగా గుంటూరు వైపు నుంచి కర్నూలు వైపు వెళ్లే వాహనాలను కుంట వద్ద నుంచి దారి మళ్లించి గిద్దలూరు - నంద్యాల మీదుగా తరలిస్తున్నట్లు ఎస్‌ఐ వీ మహేష్ తెలిపారు.

పోషకాహారం అందించడమే లక్ష్యం

పొదిలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అన్ని పాఠశాలలో పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని విజయవాణి చారిటబుల్ ఫౌండేషన్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ తొండమల్లి రంగారావు అన్నారు. శనివారం స్థానిక జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ వాసుదేవ్ ఆధ్వర్యంలో పోషకాహారం, ప్రాముఖ్యత అంశంపై ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పోషకాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అనంతరం పాఠశాలలోనే భోజనం తింటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ఎంపీడీవోకు ఎస్సీ కాలనీవాసుల వినతి

పెద్దారవీడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎస్సీకాలనీ వాసులు ఎంపీడీవో జాన్ సుందరానికి వినతిపత్రం సమర్పించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండలంలోని రామాయపాలెం పంచాయతీ మల్లవరం ఎస్సీ కాలనీకి చెందిన తమ సామాజిక వర్గానికి చెందిన 250 కుటుంబాలు కాలనీలో నివాసముంటున్నాయని, తమకు తాగడానికి నీరు లేదని వాపోయారు. తమ కాలనీలో బోర్లు ఉన్నప్పటికీ నీరు రావడం లేదన్నారు.పంచాయతీ నిధులతో కాలనీలో నూతనంగా బోరు మంజూరు చేసి నీటి సరఫరా పునరుద్ధరించాలని కోరారు. పంచాయతీ కార్మికులుగా పనిచేస్తున్న ముగ్గురికి గత పది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కాలనీవాసులు సాల్మన్, వై.తిరుమలయ్య, బి.షాలెంరాజు, ఎం.సాల్మన్, వై.కోటయ్య పాల్గొన్నారు.

రేపు యాదవ సంఘ కార్యాలయం ప్రారంభం

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆదర్శ బీఈడీ విద్యా సంస్థల ఆవరణలో ఈనెల 29వ తేదీ సోమవారం ఉదయం 10గంటలకు నియోజకవర్గ యాదవ సంఘ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు సంఘ కార్యనిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయాన్ని ఆదర్శ విద్యాసంస్థల అధినేత, స్థలదాత బుడత తిమ్మయ్య యాదవ్, బుడత హరికిషన్ ప్రారంభించనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

బేకరీలో అగ్ని ప్రమాదం

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొలుకుల సెంటర్ బేకరీలో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. గ్యాస్ సిలిండ్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మంటలను అదుపు చేసే క్రమంలో బేకరీ యజమాని వీ సతీష్‌కు కాళ్లకి కాలిన గాయాలయ్యాయి. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది.

నర్సరీని ఏర్పాటు చేయాలని వినతి

మార్కాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణహితం కోసం మొక్కలను పంపిణీ చేసేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో నర్సరీని పట్టణంలో ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు ప్రాజెక్టు టైగర్ డిప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రవూఫ్‌ను కోరారు. అటవీశాఖ కార్యాలయంలో శనివారం బీజేపీ నాయకులు డీడీ రవూఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మార్కాపురం సంప్రదాయ మట్టి పలకను ఆయనకు అందించారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ ప్రవీణ్, పట్టణ పార్టీ అధ్యక్షులు పాదర్తి ఆంజనేయులు, రామకృష్ణ పాల్గొన్నారు.


డిప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రవూఫ్‌కు పలకను అందజేస్తున్న బీజేపీ నాయకులు

జగనన్న లేఅవుట్లలో అవినీతిపై విచారణ చేపట్టాలి

కనిగిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కనిగిరి నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్లస్థలాల పేరుతో జగనన్న లేఅవుట్లలో జరిగిన భారీ అవినీతిపై విచారణ చేపట్టి బాధ్యులుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఈత కొట్టే పరిస్థితి ఏర్పడిందని సంబంధిత చిత్రాలను చూపించారు. నియోజకవర్గంలో రూ.18కోట్లు ఖర్చు చేసినట్లు చూపించి రూ.8 కోట్లు విడుదలైతే తప్పుడు లెక్కలు చూపించి దోచేశారని ఆరోపించారు. జగనన్న కాలనీలను ఊరికి దూరంగా కొండల్లో,

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

శ్మశానాల్లో, వాగులు వెంట కేటాయించి చేతులు దులుపుకున్నారని చెప్పారు. కనిగిరి మండలంలో కేవలం 64మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్ళు నిర్మించుకున్నారన్నారు. హెచ్‌ఎంపాడులో ఒక్కరూ కూడా నిర్మించుకోలేదని తెలిపారు. వెలిగండ్లలో 20మంది మాత్రమే నిర్మించుకున్నారన్నారు. సీఎస్‌పురం, పీసీపల్లి మండలాల్లో జగనన్న లేఅవుట్ల పేరుతో భూమి చదును పేరుతో లక్షలాది రూపాయలు దుర్వినియోగంచేసి ప్లాట్లను మాత్రం కేటాయించలేదన్నారు.



జగనన్న లేఅవుట్లలో దుస్థితిని వివరిస్తున్న డాక్టర్ ఉగ్ర

మన ప్రభుత్వంలో జ్యోతిరావ్‌పూలే స్కూల్‌కి స్థలం కేటాయించమని అడిగితే, ఆ స్థలంలో నీటి వనరులు, నీటికట్టడాలు ఉన్నాయని అధికారులు దాటవేసే దోరణితో మాట్లాడుతున్నారని డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో లేని ఆంక్షలను అధికారులు ఇప్పుడు పాటిస్తున్నారన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో ఓ ఏతః ఏకంగా ఇల్లు ఇస్తామని ఒక్కొక్కరి వద్ద రూ.30 వేలు వసూలుచేస్తే ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. హెచ్‌ఎంపాడు మండలంలోని హనుమంతాపురం గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వంలో 43 మందికి ఇళ్ళ స్థలాలు కేటాయిస్తే అదే పట్టాలను వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చినట్లు, రూ.15 లక్షలు ఖర్చు చేసినట్లు చూపారని తెలిపారు. ఏమాత్రం ప్రజలకు ఆమోదయోగ్యంగా లేని జగనన్న లేఅవుట్లను రద్దు చేసి పేదలకు 3సెంట్లు చొప్పున ఇళ్ళ స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని డాక్టర్ ఉగ్ర కోరారు.

గ్రామస్థుల నీటిసమస్య తీరుస్తున్న టీడీపీ నేతలు

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలు ట్యాంకర్ ఏర్పాటుచేసి గ్రామస్థుల నీటి సమస్యను తీరుస్తున్నారు. సీఎస్‌పురం మండలం కొవిలంపాడు గ్రామ పంచాయతీలో గత పది రోజుల నుంచి నీటి సరఫరా కావడంలేదు. దీంతో రోజువారీ అవసరాలకు సైతం ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాలతో టీడీపీ గ్రామ నాయకుడు, నీటి సంఘం అధ్యక్షుడు దోనపాటి మోహన్‌రెడ్డి, తెలుగు యువత ఒంగోలు పార్లమెంట్ అధికార ప్రతినిధి షేక్ రజ్జబ్‌బాషా ఆధ్వర్యంలో సొంత నిధులతో నీటి ట్యాంకర్‌ను ఏర్పాటుచేసి ఇంటింటికి నీటి సరఫరా చేస్తున్నారు.



ట్యాంక్‌ద్వారా నీటి కష్టాలు తీరుస్తున్న టీడీపీ శ్రేణులు

అన్నప్రసాద కేంద్రం ప్రారంభం

పామూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పామూరుకు సమీపంలోని వరికుంటపాడు గ్రామంలో వైకుంఠపురంలోగల శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో రూ.20 లక్షలతో వడ్లమూడి నాగేశ్వరరావు, సరోజనమ్మ పేరిట నిర్మించిన అన్నప్రసాద కేంద్రాన్ని శనివారం వడ్లమూడి కుటుంబసభ్యులు ప్రారంభించారు. ఈసందర్భంగా స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. నిర్వాహకులు వడ్లమూడి నాగేంద్రబాబు, లక్ష్మీశిరీషా, హరికృష్ణ, జోత్స్న కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

దర్శి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో మోటార్ వెహికిల్స్ అధికారి పి.రవికుమార్ సిబ్బందితో కలిసి శనివారం ముమ్మరంగా వాహనాలను తనిఖీలు చేశారు. ఈసందర్భంగా బెంగుళూరు నుంచి పిడుగురాళ్లకు వెళ్తున్న ట్రావెల్స్ బస్సును తనిఖీ చేశారు. అధిక చార్జీలు వసూళ్లు చేస్తున్నట్లు తేలటంతో కేసు నమోదు చేశారు. మరో రెండు లారీలు అధికలోడుతో వెళ్తుండటంతో కేసులు నమోదు చేసి లక్ష రూపాయలు జరిమానా విధించారు.

మహిళల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం

ముండ్లమూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని నాయుడుపాలెం సర్పంచ్ గొర్రె శ్రీదేవి అన్నారు. శనివారం గ్రామంలో జరిగిన స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటుచేశారు.

రైతులకు సరిపడా యూరియా

కనిగిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు తగినంత యూరియా అందుబాటులో ఉందని ఏడీఏ జైనులాబ్దీన్ అన్నారు. లింగారెడ్డిపల్లి గ్రామంలో శనివారం యూరియా బస్తాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లింగారెడ్డిపల్లి పీఏసీఎస్ ఛైర్మన్ కమతం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భూముల రీసర్వేలో తప్పులను సరిచేసుకోవాలి

కనిగిరి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో రైతులు తమ భూముల నమోదులో తప్పులను సరిచేసుకోవచ్చని తహసీల్దార్ ఏ.రవిశంకర్ అన్నారు. మండలంలోని తాళ్లూరు గ్రామంలో భూముల రీసర్వే సందర్భంగా శనివారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు.

ఆదాయ వనరులను పెంపొందించుకోవాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు ఆదాయ వనరులను పెంపొందించుకోవాలని ఎంపీడీవో షేక్ అబ్దుల్ కరీం అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు.

చిరుధాన్యాల ఆహారాన్ని తీసుకోవాలి

పామూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంలో గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, ఎంపీఎస్ పార్వతీ అన్నారు. శనివారం పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల, మండలంలోని నర్రమారెళ్లలో 8వ రాష్ట్రీయ పోషన్ మాసం కార్యక్రమం నిర్వహించారు.


పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

పీసీపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో జీవీ కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలోని వేపగుంపల్లి చెత్తసంపద కేంద్రాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా గ్రీన్ అంబాసిడర్‌లకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి విశ్వరూపాచారి ఉన్నారు.

లలితా త్రిపురసుందరీదేవిగా అమ్మవారు

దర్శి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో దేవి శరన్నవరాత్రులు గత ఆరు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. అందులోభాగంగా శనివారం కనకదుర్గమ్మ, పోలేరమ్మ, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవి, దద్దాలమ్మ, వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో అమ్మవార్లు లలితా త్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చి పూజలందుకున్నారు.



తాళ్లూరు: గుంటిగంగలో లలితా త్రిపుర సుందరీ అలంకారంలో అమ్మవారు

తాళ్లూరు: మండలంలోని గుంటిగంగమ్మ, తాళ్లూరు వేణుగోపాలస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయం, తూర్పుగంగవరం వాసవీమాతా దేవాలయాల్లో జరుగుతున్న దసరానవరాత్రి ఉత్సవాల్లో శనివారం అమ్మవారు శనివారం లలితాత్రిపురసుందరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో శనివారం శ్రీఈశ్వరీమహదేవి అమ్మవారు శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: మండలంలో జరుగుతున్న శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం పలు దేవాలయాల్లో భ్రమరాంబదేవి, పార్వతీదేవీలను వారాహి అలంకరణ చేశారు. మారెళ్ళ, ముండ్లమూరు, పులిపాడు, పెదఉల్లగల్లు, ఈదర గ్రామాల్లోని శివాలయాల్లో అమ్మవార్లను ప్రత్యేక అలంకరణ చేశారు.

వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

ముండ్లమూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుజ్జూరి జయంత్ బాబు అన్నారు. శనివారం శంకరాపురం గ్రామంలో జరిగిన ఆసంఘం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలపై అవగాహన

కనిగిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘ మహిళల ఆర్థిక తోడ్పాటుకు స్త్రీనిధి రుణాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని స్త్రీనిధి ఏజీఎం విజయ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఏపీఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు. తుమ్మకుంట గ్రామంలో స్త్రీనిధి మేనేజర్ సంపత్‌కుమార్ అవగాహన కల్పించారు.

పంటలసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

దర్శి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ అన్నారు. శనివారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో గిరిజన, ఎస్సీ రైతులకు మినుము పంట సాగుపై శిక్షణ తరగతులు నిర్వహించారు.



జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బెంగుళూరుకు చెందిన తండ్రీ కుమారులను కిడ్నాప్ చేసి సంతమాగులూరు సమీపంలో జంట హత్యలకు పాల్పడిన కేసులో 12వ నిందితుడైన సంతమాగులూరుకు చెందిన గడ్డం ప్రభాకర్ రెడ్డిని శనివారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని కోర్టులో ప్రవేశ పెట్టనున్నట్లు వారు చెప్పారు. ఈ కేసులో మొత్తం 13 మందిని నిందితులుగా ఉన్నారని, వీరిలో ఇప్పటివరకు 11 మందిని అరెస్టు చేశామని తెలిపారు. మరో ఇరువురు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

స్థానిక సంస్థలకు.. మొండిచేయి!

ఏడాదిగా జమ కాని స్టాంప్ డ్యూటీ సర్‌చార్జి



- మూడు జిల్లాల్లో రూ.100 కోట్లకు పైగా దస్తావేజు రుసుం బకాయి
- ప్రభుత్వం ఆదేశిస్తేనే ఖజానాకు ప్రొసీడింగ్స్
- నిధుల లేమితో కునారిల్లుతున్న పురాలు, పంచాయతీలు

ప్రభుత్వం స్థానిక సంస్థలకు మొండిచేయి చూపుతోంది. ఏడాదిగా స్టాంప్ డ్యూటీ సర్‌చార్జీ మునిసిపాలిటీలు.. పంచాయతీలకు జమ కాలేదు. దీంతో నిధుల లేమితో స్థానిక పాలన కునారిల్లుతోంది. కొన్ని పంచాయతీలు, మునిసిపాలిటీలు కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించలేని దుస్థితిని ఎదుర్కొంటున్నాయి. పారిశుధ్య పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. స్టాంప్ డ్యూటీ సర్‌చార్జి విడుదల చేయాలని స్థానిక సంస్థల పాలక వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నా వాటి మొర ఆలకించే పరిస్థితి కనిపించడం లేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సర్‌చార్జి బకాయి రూ.100 కోట్లకు పైగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

(చీరాల, ఆంధ్రజ్యోతి)

మునిసిపాలిటీలు, పంచాయతీలు, మండల, జడ్పీ ఖాతాలకు సర్‌చార్జి నిధులు 2024 జూలై నుంచి జమ కావడం లేదు. ఈ నిధులన్నీ ప్రభుత్వమే వాడేసింది. స్టాంపు డ్యూటీ సర్‌చార్జి నిధులు ప్రతి నెలా ప్రభుత్వ ఖజానా ద్వారా స్థానిక సంస్థలకు జమవుతాయి. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్థానిక సంస్థల వారీగా ప్రొసీడింగ్స్ ఖజానాకు పంపిస్తారు. ఖజానా శాఖ అధికారులు మునిసిపాలిటీలు, పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ ఖాతాలకు నిష్పత్తి ప్రకారం నిధులు జమ


చీరాల రిజిస్ట్రార్ కార్యాలయం

చేస్తారు. పంచాయతీ పరిధిలో జరిగే ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 1.5 శాతం సర్‌చార్జి మూడు భాగాలుగా విభజిస్తారు. ఇందులో మూడో వంతు పంచాయతీలకు.. ఒక వంతు చొప్పున జడ్పీ, మండల

మునిసిపాలిటీ, పంచాయతీ పరిధిలోని ఇళ్లు, స్థలాలు, అపార్ట్‌మెంట్లు, పొలాల క్రయ విక్రయాలు జరిగితే స్టాంపు డ్యూటీ సర్ చార్జీని స్థానిక సంస్థల ఖాతాలకు జమ చేయాలి. ఒక స్థిరాస్తి కోటి రూపాయలకు విక్రయం జరిగితే అందులో 1.5 శాతం అంటే రూ.1.5 లక్షలు సంబంధిత పంచాయతీ లేదా మునిసిపాలిటీ ఖాతాకు జమ చేయాలి. పంచాయతీ పరిధిలో జరిగే ఆస్తుల విక్రయాలకు సంబంధించి నిష్పత్తి ప్రకారం పంచాయతీతో పాటు మండల, జిల్లా పరిషత్తుల ఖాతాలకు సర్‌చార్జిలు జమ చేయాలి. విక్రయించిన ఆస్తి తాలూకా పేర్ల మార్పులు స్థానిక సంస్థలు చేయాలి. చట్ట ప్రకారం ప్రతి రిజిస్ట్రేషన్‌కు కచ్చితంగా నిర్ణయించిన శాతం సర్‌చార్జి స్థానిక సంస్థలకు జమ కావాల్సిందే.

(మిగతా 8వ పేజీలో)

అద్భుతంగా.. ఆర్టీసీ


సిటీ బస్‌స్టాప్ (ఊహచిత్రం)

- కాలుష్య రహిత రవాణాపై కసరత్తు
- నవనగరాల్లో తొమ్మిది బస్‌స్టేషన్లు, డిపోలు
- అమరావతి శివార్లలో మూడు భారీ టెర్మినల్స్
- 165 ఎకరాలు కేటాయించాలని సీఆర్డీఏకి వినతి

అత్యాధునికంగా.. ఆహ్లాదకరంగా.. కాలుష్య రహితంగా.. ప్రపంచ రాజధానిగా రూపొందుతోన్న అమరావతికి ఏ మాత్రం తీసిపోనట్లుగా.. రాజధానిలో బస్‌స్టేషన్లు, డిపోలు, టెర్మినల్స్ నిర్మాణానికి ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు అమరావతిలో అవసరమైన భూములకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించి ఏపీసీఆర్డీఏకు ఆర్టీసీ అధికారులు వినతి పత్రం అందజేశారు. ఒకవైపు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయాన్ని తలదన్నేలా విమానాశ్రయం, పెదపరిమి-నెక్కల్లు మధ్య 15 వందల ఎకరాల్లో రైల్వేస్టేషన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను మొదలుపెట్టింది. ఈ క్రమంలో ఆర్టీసీ కూడా ముందుకు వచ్చింది. అమరావతి 2.0లో రాజధానిలో వివిధ సంస్థలు భారీగా నిర్మాణాలు చేపడుతుండగా.. ఆర్టీసీ కూడా రాజధానిలో భావి రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూముల కేటాయింపుపై సీఆర్డీఏను ప్రత్యేకంగా కోరింది.

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

ఎన్నో విశిష్టతలు.. మరెన్నో రకాల ప్రత్యేకతలతో యావత్ ప్రపంచాన్ని ఆకట్టుకునేలా రూపుదాలుస్తున్న రాజధాని అమరావతిలో రవాణా సదుపాయాలు ఏవిధంగా ఉంటాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. అన్ని రకాల రవాణా సౌకర్యాలను ప్రయాణికులకు.. ఆహ్లాదకరమైన అనుభూతులను పంచేలా ప్రయాణికులను మైమరిపించేలా సదుపాయాలను వినూత్నంగా విభిన్నంగా ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఇందుకోసం అమరావతిలో అద్భుతమైన రోడ్‌గ్రిడ్‌ను రూ.వేల కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం.. నగరానికి వాయు, రైలు, రోడ్డు కనెక్టివిటీలను విస్తృతంగా పెంచడంతోపాటు జల రవాణా సదుపాయాలను కల్పించి ప్రయాణికులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకోవాలని భావిస్తుంది. ప్రస్తుతం అమరావతి నిర్మాణపనులు ఊపందుకోవడంతోపాటు భూములను పొందిన కొన్ని సంస్థలు (మిగతా 8వ పేజీలో)

బస్ టెర్మినల్ (ఊహచిత్రం)


కలెక్టర్‌కు.. పర్యాటక అవార్డు

సీఎం చంద్రబాబు నుంచి అందుకున్న వినోద్‌కుమార్



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పర్యాటక రంగం అభివృద్ధికి ఉన్న అవకాశాలను వివరిస్తూ బెస్ట్ కంటెంట్‌తో కాఫీటేబుల్ బుక్‌ను అందు బాటులోకి తెచ్చినందుకు కలెక్టర్ వినోద్‌కుమార్ అవార్డు దక్కించుకున్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సంద ర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా శని వారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి బాపట్ల కలెక్టర్ పర్యాటక అవార్డు అందుకున్నారు. ఇటీవలే ఇక్కడ బాధ్యతలు చేపట్టిన వినోద్‌కుమార్ అం తకముందు అనంతపురం జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వ హించారు. అక్కడ సేవలందిస్తున్న సమయంలోనే పర్యా టకంపై కాఫీటేబుల్ బుక్‌ను సిద్ధం చేసి ప్రభుత్వం చేసే కార్యక్రమాలకు ఊతం అందించారు. ఆ సేవలకు గుర్తిం పుగా వినోద్‌కుమార్‌ను పర్యాటక దినోత్సవం రోజున ప్రభుత్వం అవార్డుతో సత్కరించింది.

తల్లి హత్య కేసులో తనయుడి అరెస్టు

బాపట్ల రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగదు ఇవ్వలేదని మద్యం మత్తులో తల్లిని హత్య చేసిన కేసులో బాపట్ల మండలం పూండ్ల గ్రామానికి చెందిన జాలయ్యను అరెస్టు చేసినట్లు డీఎస్పీ జి.రామాంజనేయులు తెలిపారు. బాపట్ల రూరల్ పోలీసుస్టేషన్‌లో శనివారం నిందితుడ్ని మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు తెలిపారు. పూండ్ల గ్రామానికి చెందిన పి.రమణమ్మ గ్రామంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నది. ఆమె కుమారుడు డబ్బులను అడగ్గా ఇవ్వలేదు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న కుమారుడు ఇనుపరోడ్డుతో ఆమె తలపై కొట్టడంతో మృతి చెందింది. దీంతో కుమారుడు పారిపోయాడు. మృతురాలి భర్త శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో జాలయ్యను చుండూరుపల్లి గ్రామంలో శనివారం అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు


మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజనేయులు

డీఎస్పీ తెలిపారు. నిందితుడ్ని అరెస్టు చేసిన రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

అదుపుతప్పిన ట్రాక్టర్.. ఇద్దరి మృతి

- రోడ్డుపై ఉన్న ఓ వ్యక్తికి తీవ్రగాయాలు

అద్దంకి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూలి పనులకు వెళ్లేందుకు ఎక్కిన ట్రాక్టరే వారి ప్రాణాలను తీసింది. ట్రాక్టర్ అదుపుతప్పగా రోడ్డుపై పని చేసుకుంటున్న ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటనతో మండలంలోని తిమ్మాయపాలెంలో విషాదం అలుముకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు.. తిమ్మాయపాలెం ఎస్సీ కాలనీకి చెందిన వేము నర్సమ్మ (60), కొప్పుల స్వరూపరాణి(47) మరో ఇద్దరు మహిళా కూలీలు ముండ్లమూరు మండలం పోలవరానికి పనులకు వెళ్లేందుకు శనివారం ఉదయం రోడ్డుపై ఉన్నారు. అదే సమయంలో ఇటుకల లోడుతో అటువైపు వెళ్తున్న ఓ ట్రాక్టర్ ఎక్కారు. నలుగురు కూలీలు ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చొన్నారు. సుమారు 100 మీటర్ల దూరం వెళ్లే సరికి ట్రాక్టర్ అదుపు తప్పి మార్జిన్‌లో ఉన్న ఇసుక కుప్పపైకి ఎక్కింది. దీంతో ఇద్దరు మహిళా కూలీలు కిందపడగా వారి పై



నర్సమ్మ, స్వరూపరాణి (పాత చిత్రం)

ట్రాక్టర్ ట్రాలీ దూసుకెళ్లింది. దీంతో నర్సమ్మ, స్వరూప రాణి అక్కడికక్కడే మృతి చెందారు. ఆ ప్రాంతంలో ఓ ఇంటి ముందు ఇంకుడుగుంత పనులు చేసుకుంటున్న తోకల శ్రీనివాసరావును ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్ మద్యం మత్తులో ఉండి ట్రాక్టర్ నడపడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. మృతదేహాలను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.


రేపల్లె: 23వవార్డులో రాజరాజేశ్వరిదేవిగా దుర్గమ్మ

వైభవంగా దసరా ఉత్సవాలు

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలో శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఆరో రోజు శనివారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బగళాముఖి అమ్మవారికి లక్ష్మీపూజ, లక్ష్మీహోమ కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. చెరుకుపల్లికి చెందిన నృత్యకారిణి భావన ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి నృత ప్రదర్శనతో భక్తులను అలరించారు. ఆయా కార్యక్రమాలను త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్య నిర్వహణాధికారి జి.నరసింహమూర్తి, సీనియర్ సహాయకులు నాగుల శ్రీనివాసరావు, కొండవీటి శ్రీనివాసరావులు పర్యవేక్షించారు. జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో దసరా ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతుండగా పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

కృష్ణానదిలో పెరిగిన వరద

దిగువకు 3.84 లక్షల క్యూసెక్కుల విడుదల

కొల్లూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో వరద ప్రవాహం గంటగంటకు పెరిగింది. శనివారం సాయంత్రం ఏడు గంటలకు ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు 3,84,525 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు బ్యారేజీ అధికారులు ప్రకటించారు. ఆదివారం 5 నుంచి 6 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. దీంతో నదీ పరివాహక గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు.

అరవింద వారధి వద్ద పెరిగిన వరద ప్రవాహం


కలెక్టరేట్‌లో జీఎస్టీ 2.0 హెల్ప్‌డెస్క్

- సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించాలి
- పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. జీఎస్టీ కమిషనర్ మురళీకృష్ణతో కలిసి శనివారం కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వాహనాలు, ఎలక్ట్రానిక్, మందులు, వస్త్రాలు, నిత్యావసరాలపై జీఎస్టీ తగ్గింపు లభిస్తుందన్నారు. తగ్గే ధరలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌కు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో ఎస్పీ బి.ఉమామహేశ్వర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, ఏవో మల్లికార్జునరావు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ బి.ఉమామహేశ్వర్

పనులు సకాలంలో పూర్తి చేయాలి

జలవనరులశాఖ ద్వారా చేపడుతున్న పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. గుంటూరు సర్కిల్ పరిధిలోని జలవనరులశాఖ ద్వారా చేపడుతున్న వివిధ రకాల పనులకు సంబంధించి శనివారం కలెక్టరేట్‌లో ఆ శాఖాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, భూగర్భజలాలు, పంచాయతీ రాజ్‌శాఖలతో సమన్వయం చేసుకుని జలవనరుల శాఖ పనిచేయాలన్నారు. జిల్లాలో 716 రకాల పనులు చేపట్టడం జరుగుతుందని అందులో 148 పనులు పూర్తి చేయగా, 568 పనులు వివిధ దశలలో ఉన్నట్లు జిల్లా వాటర్ రీసోర్స్ అధికారి అబా అబుతలీమ్ కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ఈఈలు మురళికృష్ణ, సుధాకర్, ప్రేమ్‌కుమార్, సతీష్, శివరాంప్రసాద్, డీఈలు మల్లికార్జునరావు, జాకీర్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అడవి విలపిస్తోంది

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

తీర ప్రాంత రక్షణ ముప్పులో పడుతోంది. సముద్రతీరంలో మడ అడవుల విస్తీర్ణం పెరగాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా పరిస్థితులు నెలకొంటున్నాయి. మడ అడవులు రొయ్యల చెరువులుగా మారిపోయాయి. దీనికితోడు అటవీ భూముల్లో చెట్లు నరికివేసి ఆక్రమించేశారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌తో ఆ అటవీ భూములను రిజిస్ట్రేషన్ చేసినట్లు గతంలోనే ఫిర్యాదులు అందాయి. సూర్యలంక తీరంలో భూములకు ఉన్న డిమాండ్‌ను బట్టి అటవీ భూముల కైంకర్యం వెనుక గత ప్రభుత్వంలోని వైసీపీ పెద్దల హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. బాపట్ల రూరల్ పరిధిలోని దాదాపు నాలుగు గ్రామాల పరిధిలో 48 ఎకరాల వరకు అటవీభూములను తమకు సాగుకు ఇచ్చినట్లు గత ప్రభుత్వంలోనే కొంతమంది రోడ్డెక్కారు. ఈ భూమికి సంబంధించి రెవెన్యూ, అటవీ విభాగాల మధ్య చిన్నపాటి వివాదం కూడా అప్పట్లో నడిచింది. విచారణ అనంతరం ఆ భూములు అటవీ విభాగం పరిధిలోకి వస్తాయని తేలాయి. అటవీ అధికారుల అంచనా ప్రకారమే దాదాపు 2,000 ఎకరాల అటవీ భూమి ఆక్రమణకు గురైనట్లు అందులో రొయ్యల సాగవుతుందని అధికారులు గుర్తించారు. కనీస నిబంధనలు పాటించకుండా అభివృద్ధి పేరిట తీర ప్రాంత అటవీ భూముల


సూర్యలంక తీరంలోని అటవీ భూమి

విషయంలో జరుగుతున్న దందా అంతా ఇంతా కాదు. అటవీ భూముల పరిరక్షణ కోసం అధికారులు ఆలస్యంగా మేల్కొన్నారు. ప్రైవేటు వ్యక్తులెవరూ ఆ భూముల్లోకి వెళ్లడానికి వీల్లేకుండా ఇటీవలే చర్యలు చేపట్టారు. జిల్లాలో దాదాపు 72 కిలోమీటర్ల సుదూర తీర ప్రాంతంలోని గ్రామాలకు రక్షణగా నిలిచే మడ అడవులను కాపాడుకోవడంతో పాటు అటవీ భూములను ఆక్రమణల చెరనుంచి విడిపించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

గణాంకాలు కరువు

తీర ప్రాంతంలో ఉన్న అటవీ భూముల విస్తీర్ణంపై అధికారుల వద్దే కచ్చితత్వంతో కూడిన గణాంకాలు లేవు. సూర్యలంక తీరంలో ఉన్న పట్టా భూములే అతి స్వల్పం. వాటి రికార్డులు నిర్వహించడంలో అటు రెవెన్యూతో పాటు ఇటు అటవీ విభాగాల నిర్లక్ష్యం అడవి తల్లికి శాపంగా మారుతోంది.

గుమ్మడి.. లాభాల జడి..!

ఆశాజనకంగా ధరలు

టన్ను కాయలు రూ. 12 వేల నుంచి రూ.15 వేలకు

అమ్ముకొనేందుకు రైతుల ఆసక్తి



హైదరాబాద్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న మంచి గుమ్మడి కాయలు

బల్లికురవ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పది రోజుల క్రితం వరకు ధరలు లేక గుమ్మడి సాగు చేసిన రైతులు విలవిలలాడారు. విజయదశమి పర్వదినం దగ్గర పడడంతో ధరలు పెరిగాయి. దీంతో రైతులు గుమ్మడిని అమ్మకాలు చేసేందుకు పరుగులు పెడుతున్నారు. దీంతో ధరలు ఎక్కడ తగ్గుతాయోనని రైతులు కోతలు, అమ్మకాలలో వేగం పెంచారు.

బల్లికురవ మండలం కొత్తపాలెం, గుంటుపల్లి, అంబడిపూడి, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, ఎస్ఎల్.గుడిపాడు, వెలమవారిపాలెం, నక్కబొక్కలపాడు, బల్లికురవ, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, రామాంజనేయపురం, కొణిదెన, గంగపాలెం, వేమవరం, ఉప్పుమాగులూరు, కోటవారిపాలెం, కొప్పెరపాలెం గ్రామాలలో రైతులు ఈ ఏడాది మంచి గుమ్మడి (ఎర్రకాయలు)ను సుమారు వంద ఎకరాల్లో సాగు చేశారు. మొదట్లో టన్ను కాయల ధర రూ.6వేలు ఉంది. ప్రస్తుతం విజయదశమి పండగకు హైదరాబాద్, ఇతర పట్టణాల్లో గిరాకీ పెరిగింది. రెండు రోజుల నుంచి టన్ను రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తున్నారు. కొందరు రైతులు నేరుగా హైదరాబాద్ మార్కెట్‌కు లారీలను పెట్టుకొని కాయలను తీసుకు వెళ్లి అమ్మకాలు చేస్తున్నారు. కొందరు చిరు వ్యాపారులు రైతుల వద్ద టన్ను రూ.12 వేలకు కొనుగోలు చేసి అమ్మకాలు చేసుకుంటున్నారు. ఇదే ధర ఉంటే పెట్టుబడి



పోను ఎకరాకు రూ.40 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు ఐదు టన్నుల మేర దిగుబడి వస్తుందని, పెట్టుబడి కూడా గుమ్మడి సాగుకు తక్కువేనని రైతులు అంటున్నారు. మొత్తం మీద కోతలు కోసే సమయానికి ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు తెలిపారు. బూడిద గుమ్మడి ధరలు టన్ను రూ.5 వేల వరకు మాత్రమే ఉండడంతో బూడిద గుమ్మడి సాగు నష్టాలను తెచ్చి పెట్టిందని రైతులు వాపోతున్నారు.

వలపర్లలో చోరీ

● టీచర్ ఇంట్లో 50 సవర్ల బంగారం అపహరణ



ఉపాధ్యాయ దంపతులతో మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజనేయులు

మార్టూరు, సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్లలో ఉపాధ్యాయుని ఇంటిలో భారీ చోరీ చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కే.కొండలరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. దాదాపుగా 50 సవర్లుకు పైగా బంగారాన్ని దొంగలు ఎత్తుకుపోయారని ఉపాధ్యాయుని బంధువులు తెలిపారు. వలపర్ల గ్రామంలో సాయిబాబా గుడివెనుక కాలనీలో నివసించే కొండలరావు, నాగిని దంపతులు ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరిలో కొండలరావు జే.పంగులూరు మండలంలోని కొండమంజులూరులోని ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా, భార్య నాగిని వలపర్ల జడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అయితే వారిద్దరూ ఈ నెల 22న కర్నాటక రాష్ట్రంలో గంగావతిలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్లారు. వారు శనివారం సాయంత్రం వలపర్ల గ్రామంలోని ఇంటికి వచ్చి చూడగా ఇంటి ప్రధాన తలుపులు తాళం పగల గొట్టి ఉంది. బీరువా తలుపులు తెరచి ఉండడాన్ని వారు గమనించారు. అనంతరం బీరువాలోని బంగారం కూడా లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దాంతో బాపట్ల డిఎస్పీ రామాంజనేయులు, సంతమాగులూరు సీఐ వెంకటరావు, బల్లికురవ ఎస్ఐ నాగరాజులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఉపాధ్యాయుల దంపతులతో మాట్లాడారు. కాలనీకి చివర్లో సింగిల్‌గా ఇల్లు ఉండడంతో దొంగలు సులువుగా చోరీ చేశారని గ్రామస్థులు పోలీసులు భావిస్తున్నారు. అయితే దొంగతనం రెండు రోజుల క్రితం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. క్లూస్ టీం వస్తుందని పోలీసులు తెలిపారు. మార్టూరు సీఐ ఎం.శేషగిరిరావు దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించి జరిగిన తీరును విచారించారు. పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అలరించిన బాల భక్తి నీరాజనం



దేవీదేవతల సంకీర్తనలను ఆలపిస్తున్న చిన్నారులు

ఒంగోలు కల్చరల్, సెప్టెంబర్ 27(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం రాత్రి పలువురు చిన్నారులు అమ్మవారికి సమర్పించిన భక్తినీరాజనం శాస్త్రీయ సంగీత కార్యక్రమం భక్తులను విశేషంగా అలరించింది. స్థానిక లాయర్‌పేట సాయిబాబా మందిరంలో శ్రీ రాఘవ కూచిపూడి నృత్య, సంగీత కళానిలయం చిన్నారులు ఆలపించిన పలు భక్తిగీతాలు రసరమ్యంగా కొనసాగాయి. విఘ్నేశ్వరుని ప్రార్థనతో ఆరంభించి శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, అమ్మవారు మొదలైన దేవీదేవతల సంకీర్తనలను చిన్నారులు హృద్యంగా ఆలపించారు. కళానిలయం నిర్వాహకురాలు కరవది సాయిశరణ్య నిర్వహణలో కొనసాగిన ఈ కార్యక్రమంలో తబలాపై కొత్తపల్లి శ్రీనివాస్, వయోలిన్‌పై చావలి శ్రీనివాస్‌లు వాద్య సహకారాన్ని అందజేశారు. స్థానిక కేశవస్వామిపేట ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో మంత్రిప్రగడ నరసింహా రావు కుటుంబసభ్యులు ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో ప్రముఖ ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు శక్తిపీఠాల ఔన్నత్యాన్ని వివరించారు.



శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో వల్లూరమ్మ

లలితా త్రిపురసుందరీదేవిగా వల్లూరమ్మ

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఆరోరోజైన శనివారం వల్లూరమ్మ తల్లి లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో బి.రమేష్ పర్యవేక్షించారు.

కామేపల్లిలో...

జరుగుమల్లి మండలం కామేపల్లిలోని శ్రీపోలేరమ్మ శనివారం లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి చీరలు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో బైరాగిచౌదరి పాల్గొన్నారు.

సింగరాయకొండలో..

సింగరాయకొండ : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని జాలమ్మతల్లి దేవస్థానంలోని అమ్మవారు శనివారం లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. చెట్టుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారిని సుందరమైన పుష్పాలతో అలంకరించారు. పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు.

ఆత్మీయంగా పలకరించుకుంటూ.. ఆనందాలు పంచుకొంటూ..

హైదరాబాద్‌లో వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల పూర్వవిద్యార్థుల సమావేశం



హైదరాబాద్‌లో సమావేశమైన పూర్వవిద్యార్థులు

చీరాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గురువుల మందలింపు, స్నేహితులతో ఆటపాటలు, కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలనాటి జ్ఞాపకాలు అతి మధురమని కర్నాటక రాష్ట్ర తాగునీరు సరఫరా ప్రతినిధి కామేపల్లి భూపాల్, ఖమ్మం స్టడీ సర్కిల్ కామర్స్ అకాడమీ చైర్మన్ జీవీ నరసింహారావు అన్నారు. శనివారం హైదరాబాదులో వీఆర్ఎస్ వైఆర్ఎన్ కళాశాల 1983-85 ఎంకామ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశవిదేశాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడి కళాశాలకు గుర్తింపు తెచ్చారన్నారు. కళాశాల అభివృద్ధికి తమవంతు సహకరిస్తామన్నారు. కుటుంబ సభ్యులతో హాజరై నాటి మధురానుభూతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌వీ బ్రహ్మయ్య, హరినాథ్‌బాబు, లక్ష్మీదేవీ, వెంకటేశ్వర్లు, బడేసాహెబ్, తదితరులు పాల్గొన్నారు. వీరంతా చీరాల, బాపట్ల, వేటపాలెం, ఒంగోలు, గుంటూరు, విజయవాడ, తదితర ప్రాంతాలకు చెందిన వారు కావడం విశేషం.

స్వచ్ఛ గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

● డీపీవో వెంకటేశ్వరరావు



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

సింగరాయకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని మూలగుంటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలను ప్రతిఒక్కరూ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.జయమణి, డిప్యూటీ ఎంపీడీవో ఆర్.రమేష్‌బాబు, ఎంఈవో కత్తి శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సౌజన్య, పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పొన్నలూరు సర్వసభ్య సమావేశం

పొన్నలూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

అర్ధరాత్రి పోలీసుల స్పెషల్ డ్రైవ్



బస్టాండ్ వద్ద అపరిచితులను విచారిస్తున్న సీఐ సుబ్బారావు, సిబ్బంది

మార్కాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ ఆదేశాల మేరకు మార్కాపురం పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ముందుగా పట్టణంలోని అన్ని లాడ్జీలను తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. కొత్త వ్యక్తులు, అనుమానితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద అపరిచిత వ్యక్తులను విచారించారు. మోటార్ సైకిళ్లపై తిరుగుతున్న వారిని ఆపి పత్రాలను పరిశీలించారు. పలుచోట్ల యువకులు మద్యం సేవించి వీధుల్లో తిరుగుతున్నట్లు గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు.

లక్ష్య సాధనవైపు దృష్టి సారించాలి

● మార్కెట్ యార్డ్ అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత

● ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న గుంజి వెంకట్రావు

పర్చూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : లక్ష్య సాధనవైపు దృష్టి సారించి, పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను అభివృద్ధి పథంలో నిలిపే విధంగా పాలక మండలి దృష్టి సారించాలని పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు అన్నారు. శనివారం స్థానిక ఏఎంసీలో నూతన పాలక మండలి తొలి సమావేశం జరిగింది. పరిచయ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు ఆకాంక్ష మేరకు రైతులకు మెరుగైన సేవలు అందించే విధంగా మార్కెట్‌యార్డ్ సేవలను విస్తరించాలన్నారు. మిర్చి కొనుగోలు కేంద్రాలు పర్చూరు, ఇంకొల్లు నందు ఏర్పాటు చేయాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అదేవిధంగా మార్టూరు కూరగాయల యార్డ్‌లో వ్యర్థాల కోసం యార్డ్ పరిధిలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి రైతులకు వర్మీకంపోస్టు ఎరువు ఉపయోగ పడేలా చూడాలని సభ్యులు తీర్మానించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ శంకరశెట్టి చిరంజీవి, యార్డ్ కార్యదర్శి ఓటీయస్ ప్రసాద్, పాలక మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకే రీ సర్వే

చినగంజాం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని రైతులకు భూ సమస్యలు లేకుండా పరిష్కరించేందుకే రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో ఆయన మాట్లాడారు. రీసర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని తహసీల్దార్ అన్నారు. చినగంజాం గ్రామ రెవెన్యూ పరిధిలో రీసర్వే జరిగేటప్పుడు రైతులు తమ హక్కు పత్రాలు, ఆధార్, ఫొటోలతో వచ్చి తమ భూసమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, ఉపసర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సుజాత, మండల సర్వేయర్ లోకేష్, గ్రామ రెవెన్యూ అధికారులు బండారు దానియేలు, ఆమంచి సత్యనారాయణ, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

నేడు ట్రైస్కూటీల అందజేత



పంపిణీకి సిద్ధంగా ఉన్న స్కూటీలు

అద్దంకి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు 35 ట్రై స్కూటీలను ఆదివారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దివ్యాంగులకు ఆదివారం పంపిణీ చేయనున్నారు. అద్దంకి పట్టణ, మండల పరిధిలో ఉన్న 35 మంది దివ్యాంగులకు ఒక్కొక్కటి 1.40 లక్షల రూపాయల విలువైన స్కూటీ లను అందజేయనున్నారు. ఉదయం 10 గంటలకు అద్దంకి పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దసరా ఉత్సవాల పూజలలో మంత్రి రవికుమార్ పాల్గొంటారు. అనంతరం 10:30 గంటలకు మున్సిపల్ కార్యాలయం వద్ద దివ్యాంగులకు ట్రై స్కూటీ ల పంపిణీ లో పాల్గొననున్నారు.

అద్భుతంగా ఆర్టీసీ

(7వ పేజీ తరువాయి)

తమ కార్యాలయాలను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొచ్చి పనులను చేపడుతున్నాయి. సీడ్‌యాక్సిస్ రోడ్డు వెంబడే తమకు భూములు కేటాయించాలని మరికొన్ని సంస్థలు ప్రభుత్వపెద్దలపై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ క్రమంలో రాజధానిలో బస్‌స్టేషన్ల ఏర్పాటుకు 165 ఎకరాలను కేటాయించాలని ఏపీఎస్‌ఆర్టీసీ సీఆర్‌డీఏకు విన్నవించుకుంది. ఈ మేరకు ఆ సంస్థ ఎండీ ఈ ఏడాది జూన్‌లోనే లిఖితపూర్వక విజ్ఞాపనపత్రాన్ని సీఆర్‌డీఏకు అందజేసి, ఆ విషయాన్ని ప్రభుత్వపెద్దల దృష్టికి కూడా తీసుకెళ్లారు. రాజధాని అమరావతి నగరంలో తిరిగే సిటీ సర్వీసులన్నీ పూర్తిగా ఎలక్ట్రికల్ లేదా, బ్యాటరీ వాహనాల రూపంలోనే ఉంటాయి. దీనివలన అమరావతిలో కాలుష్యం గణనీయంగా తగ్గనున్నది. ఆర్టీసీ నుంచి మూడు నెలల క్రితం సీఆర్‌డీఏకు ఈ ప్రతిపాదనలు అందినప్పటికీ ఎందువలనో ఆ సంస్థకు భూ కేటాయింపులు చేయలేదు. ఆర్టీసీకి భూ కేటాయింపులు, బస్‌స్టేషన్లు, డిపోల ఏర్పాటు తదితరాలన్నీ కూడా రాష్ట్రప్రభుత్వ పరిధిలో ఉండే అంశాలే కాబట్టి.. ప్రభుత్వం ఒకింత జాప్యం చేస్తుండవచ్చని భావించాలి.

మూడు టెర్మినల్స్.. తొమ్మిది బస్‌స్టేషన్లు

నవ నగరాల్లో ఎక్కడికక్కడ అంటే బస్‌స్టేషన్, దానికి అనుబంధంగా డిపోను ఏర్పాటు చేసేలా ఆర్టీసీ అధికారులు ప్రణాళికలను రూపొందించారు. ఒక్కో నగరంలో బస్‌స్టేషన్‌కు ఐదెకరాలు, డిపోకు ఇంకో ఐదెకరాలు.. వెరసి ఒక్కోచోట పదెకరాల చొప్పున నవనగరాల్లో కలిపి 90 ఎకరాలను కేటాయించాలని ఆర్టీసీ కోరుతుంది. నగరానికి మూడు వైపులా మూడు భారీ ఇంటర్‌ఛేంజ్ టెర్మినల్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఒక్కో టెర్మినల్స్ కోసం 25 ఎకరాల వంతున మూడు టెర్మినల్స్‌కు కలిపి 75 ఎకరాలు అవసరమని ఆర్టీసీ భావిస్తుంది. ఈ టెర్మినల్స్‌లో సుదూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు దిగి అక్కడి నుంచి సిటీ సర్వీసులను వినియోగించుకుని రాజధాని నగరంలో తాము వెళ్లాల్సినచోటుకు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించారు.

- హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల కోసం రాయపూడి సమీపంలో ఓ టెర్మినల్
- బెంగళూరు, రాయలసీమ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం నీరుకొండ, పెదపరిమి మధ్య ఓ టెర్మినల్
- ఉత్తరాంధ్ర, రేపల్లె ప్రాంతాల నుంచి వచ్చేవారి కోసం మంగళగిరి పశ్చిమశివారులో మరో టెర్మినల్‌ను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ప్రతిపాదిస్తోంది.

స్థానిక సంస్థలకు మొండిచేయి!

(7వ పేజీ తరువాయి)

పరిషత్‌లకు విభజించి ఖాతాలకు జమ చేస్తారు. ఇక పట్టణ పరిధిలో ఆస్తుల క్రయవిక్రయాల సర్‌చార్జి మొత్తం మునిసిపాలిటీ ఖాతాకే జమ చేస్తారు. ఒక్క నరసరావుపేట మునిసిపాలిటీకి ఏడాదిగా సర్‌చార్జి నిధులు రూ.7 కోట్లు విడుదల కావాల్సి ఉంది.

నిధుల లేమితో..కునారిల్లుతున్నాయి

నిధుల లేమితో కొన్ని మునిసిపాల్టీల్లో జీతాలు సకాలంలో చెల్లించలేని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. రిజిస్ట్రేషన్ సర్‌చార్జికి సంబంధించిన ప్రొసీడింగ్స్ ఖజానాకు పంపించకుండా రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ ఆదేశించినట్లు సమాచారం. మళ్లీ ఆదేశాలు ఇచ్చే వరకు ప్రొసీడింగ్స్ నిలుపుదల చేయాలని ఆదేశించారు. సర్‌చార్జి నిధుల కోసం స్థానిక పాలక వర్గాలు, అధికారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నిధులు జమ కావాలంటే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి. ప్రభుత్వ ఆదేశాల వస్తే ప్రొసీడింగ్స్‌ను పంపుతామని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఎప్పటికి కరుణిస్తుందోనని సదరు పాలకవర్గాలు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నాయి.

ఘనంగా పల్లపువారి కొలుపులు

బల్లికురవ, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినఅంబడిపూడి గ్రామంలోని పల్లపు వంశస్థుల రేణుకమ్మ అంకమ్మ తల్లి కొలుపులు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆదివారంతో కొలుపులు ముగుస్తాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా అంకమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేక అలంకరణ చేశారు. దీంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామ పరిసర గ్రామాలలో ఉన్న పల్లపు వంశస్థులు అంబడిపూడి గ్రామంలోని దేవాలయానికి చేరుకున్నారు.

మెప్మా ఆధ్వర్యంలో ముగ్గుల ప్రదర్శన



ముగ్గులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్ర

అద్దంకి,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత హే సేవా-2025లో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మెప్మా సిబ్బంది ముగ్గుల ప్రదర్శన, ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేశారు. రంగు రంగుల ముగ్గులను తిలకించారు. వివిధ రకాల వంటకాలను రుచి చూశారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ కమీషనర్ రవీం ద్ర, స్వచ్ఛ ఆం ధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు, మేనేజర్ శ్రీదేవి, టీపీవో లక్ష్మీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి, మెప్మా సీఎంఎం సత్యవతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపాలెంలో స్వచ్ఛతా సేవా ర్యాలీ

అద్దంకి,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చ క్రాయపాలెంలో శనివారం స్వచ్ఛతాసేవా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుభాషిణి, మండల టీడీపీ అధ్యక్షుడు గోగులమూడి రాజశేఖర్, గ్రామపార్టీ అధ్యక్షుడు రాయుడు నరేం ద్రబాబు, మలిపెద్ది రవీంద్ర, డిజిటల్ అసిస్టెంట్ ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారం కోసమే రీసర్వే

అద్దంకి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసమే ప్రభుత్వం భూముల రీసర్వే చేపట్టిందని తహసీల్దార్ శ్రీచరణ్ అన్నారు. మండలంలోని మణికేశ్వరం, నన్నూరపాడులలో మూడవ విడత రీసర్వేను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో గ్రామసభలు, ర్యాలీ లు నిర్వహించి రీ సర్వే పై అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమాలలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మస్తాన్‌రావు, ఆర్ఐ శంకర్, సర్వేయర్ శ్రీలక్ష్మీ, వీఆర్‌వోలు, టీడీపీ నేతలు కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ క్రీడలను జయప్రదం చేయాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సురేష్‌బాబు

అద్దంకి,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు10, 11 తేదీలలో బాపట్లలో జరిగే జిల్లాస్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయాలని రెవెన్యూ అసోసియేష్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు కోరారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో జరిగిన కార్యక్రమంలో బ్రోచర్ ను ఆవిష్కరించారు. వీఆర్ఏ నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకు అందరు రెవెన్యూ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అద్దంకి, సంతమాగులూరు, పగులూరు మండలాల తహసీల్దార్లు శ్రీచరణ్, రవిబాబు, సింగారావు, డివిజన్ అధ్యక్షులు గోపికృష్ణ, కార్యదర్శి పీకా సురేష్, జిల్లా క్రీడల కార్యదర్శి అర్జున్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్యనారాయణ, శ్రీకాంత్, రామకృష్ణ, ఆర్ఐ శంకర్, ఏఎస్‌వో అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళీయం పుస్తక ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన చంద్రమౌళీయం పుస్తకం అరుదైనదని ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం జానపద కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌వీ కన్వెన్షన్‌లో జ్యోతి చంద్రమౌళి రచించిన చంద్రమౌళీయం వజ్రోత్సవ సంచిక ఆవిష్కరణ కార్యక్రమం డాక్టర్ యు.దేవపాలన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జ్యోతి చంద్రమౌళి రాసిన పుస్తకాలు ఏదో ఒక కొత్త విషయాన్ని సమాజానికి తెలియజేస్తాయన్నారు. ఈ సందర్భంగా రచయిత జ్యోతి చంద్రమౌళి దంపతులను సభ్యులు, అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మద్రాసు విశ్వ విద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు విస్తాలి శంకరరావు, డాక్టర్ చదలవాడ ఫణీంద్రబాబు, ధర్మవరపు శ్రావణ్‌కుమార్, బీరం సుందరరావు, జ్యోతి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

పైరుకు సరిపడా అందుబాటులో యూరియా

బల్లికురవ, సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడిన యూరియాను ప్రభుత్వం రైతుసేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచిందని నక్కబొక్కలపాడు నీటి సంఘం అధ్యక్షులు దర్శి రామస్వామి తెలిపారు. శనివారం ప్రభుత్వం నుంచి రైతుసేవా కేంద్రానికి వచ్చిన యూరియాను అయన దగ్గర ఉండి రైతులకు పంపిణీ చేశారు. రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని అందరికీ, యూరియాను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దూళిపాళ్ల పూర్ణయ్య, రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అక్టోబరు 1న మెగా వైద్యశిబిరం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి స్వస్థ్ నారి సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా అద్దంకి సామాజిక ఆరోగ్య కేంద్రంలో అక్టోబరు 1న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె. వాహిల చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో చెవి, ముక్కు, గొంతు, మానసిక రుగ్మతలు, చర్మవ్యాధులు, సాధారణ వ్యాధులు, చిన్న పిల్లలకు సంబంధించిన వ్యాధులు, గర్భిణులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. అద్దంకి, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు పాల్గొని రక్తదానం చేయాలని ఆమె కోరారు.

భూసమస్యలు లేకుండా సర్వే చేయించుకోవాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

బల్లికురవ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామాలలో భూమస్యలు లేకుండా భూసర్వే చేయిస్తోందని రైతులు దగ్గర ఉండి సర్వే చేయించుకోవాలని తహసీల్దార్ రవినాయక్ కోరారు. శనివారం మండలం లోని కొప్పెరపాలెం గ్రామంలో భూసర్వేపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలోని అన్ని భూములను ప్రత్యేకసర్వే బృందాలు సర్వే చేస్తాయని రైతులు తమ వద్ద ఉన్న హక్కు పత్రాలను వారికి చూపించి కొలతలు వేయించుకోవాలన్నారు. రీసర్వే పూర్తి అయితే రైతుల మధ్య ఉన్న సమస్యలు కూడా తొలగి పోతాయన్నారు. ఈ ర్యాలీలో డిప్యూటీ తహసీల్దార్ ప్రహర్ష, ఆర్‌ఐ పోతురాజు గ్రామ టీడీపీ నాయకులు కోట శ్రీను, గ్రామ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలి

- కంటి వైద్యులు డాక్టర్ శ్రద్ధాలాజర్

పంగులూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కంటి సంరక్షణలో ప్రతి వ్యక్తి తగిన జాగ్రత్తలు పాటించాలని నేత్రవైద్య నిపుణులు డాక్టర్ శ్రద్ధా లాజర్ సూచించారు. పంగులూరులో శనివారం రోటరీక్లబ్, పెద్దకాకానికి చెందిన శంకర్‌నేత్రాలయం సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బత్తులవీరనారాయణ ప్రారంభించారు. ఈ శిబిరంలో 35 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. వీరిలో 16 మందికి శుక్లం ఆపరేషన్లు అవసరంగా గుర్తించారు. వీరికి 28వ తేదీన శంకర్ నేత్రా లయంలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు డాక్టర్ బత్తుల వీరనారాయణ తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు బాచిన చెంచుప్రసాద్, క్లబ్ ప్రతినిధులు షేక్‌కాలేషావలి, వీరరాఘవయ్య, ఐ.సుబ్బారావు, కరణంహనుమంతరావు, సీతారామయ్య, పీఆర్‌వో సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

- వీధి విక్రయదారులు, చిరు వ్యాపారులకు ప్రభుత్వ రుణాలు

చీరాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వీధి విక్రయిదారులు, చిరు వ్యాపారులు ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు సాగాలని మెప్మా సిటీమిషన్ మేనేజర్ చినకొండయ్య చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెప్మా విభాగం నుంచి 5 వేల మందికి రుణాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. దీని కోసం వ్యాపారులు వెంటనే మెప్మా కార్యాలయాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. వీరికి అక్టోబరు 1న బాపనమ్మ కల్యాణ మండపంలో రుణమేళా నిర్వహించనున్నట్లు మేనేజర్ తెలిపారు.

ఉపాధి పనులను బాధ్యతతో నిర్వహించండి

- క్షేత్ర సహాయకులతో ఏపీడీ సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఏపీడీ సింగయ్య

బల్లికురవ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఉపాధి హామీ పథకం పనులను బాధ్యతగా నిర్వహించకుంటే చర్యలు తప్పవని ఏపీడీ బత్తిన సింగయ్య హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల క్షేత్రసహాయకులు, కార్యాలయ సిబ్బందితో ఏపీడీ సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది లేబర్ బడ్జెట్‌లో కేటాయించిన కూలీలు వైదన, చెన్నుపల్లి, కొప్పెరపాడు, వెలమవారిపాలెం, ముక్తేశ్వరం, చెన్నుపల్లి గ్రామాల నుంచి తక్కువ మంది వచ్చారని వెంటనే అయా గ్రామాలలో కూలీల సంఖ్య పనులకు పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అలానే హార్టీకల్చర్ ద్వారా పండ్ల మొక్కలు నాటించాలన్నారు. సోక్‌పిట్లను వెంటనే నిర్మాణం చేయించాలన్నారు. ఇప్పటికే బల్లికురవ మండలంలో పనులలో అవకతకవలు జరిగిన్నట్లు సామాజిక తనిఖీలో వెల్లడైందని బాధ్యతగా పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి రోజు రెండు సార్లు కూలీల ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. ఎవరైన నిర్లక్ష్యంగా ఉంటే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.. అన్ని గ్రామాలలో వెంటనే పనులు చేయించాలన్నారు. పంట కాలువలను అభివృద్ధి పరచాలన్నారు. ఈ సమీక్షలో ఎంపీడీవో కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీగా రామకోటయ్య బాధ్యతల స్వీకరణ

అద్దంకి, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): అద్దంకి సీనియర్, జూనియర్ సివిల్ జడ్జీ కోర్టులలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా బత్తుల రామకోటయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు రామకోటయ్యను అభినందించారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

అద్దంకి,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల చెల్లింపు కు ఆదివారం అద్దంకి, మార్టూరులలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయం లలో కౌంటర్ లు తెరిచి ఉంటాయని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు మున్సిపల్ సమావేశం

అద్దంకి,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపల్ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమీషనర్ రవీం ద్ర తెలిపారు.

నేడు సృజన సాహిత్య సమావేశం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సృజన సాహిత్య సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిన కమతేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించ నున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో కే.అనీలకుమారసూరి, గాడేపల్లి దివాకర్‌దత్తు ప్రసంగిస్తారన్నారు. అనంతరం ప్రముఖ నటులు వత్యం సీతారామశాస్త్రీ భస్మాసుర ఏకపాత్రాభినయం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా శరన్నవరాత్రి వేడుకలు

- లలితా త్రిపురసుందరిగా అమ్మవారి అలంకారణ
- కుంకుమ పూజలు, సహస్రనామ పారాయణం చేసిన మహిళలు



ఇంకొల్లు మండలం దుద్దుకూరులో లలితాత్రిపుర సుందరిగా అంకమ్మ దేవర, రేణింగవరం త్రిశక్తిపీఠంలో అమ్మవారి అలంకరణ

అద్దంకి,సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని శనివారం గజలక్ష్మిగా అలంకరించారు. దత్తపాదుకా క్షేత్రం, వేయిస్తంభాలగుడి, పోలేరమ్మ దేవాలయాల్లో కూడా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

బల్లికురవ : మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో పోలేరమ్మ దేవాలయంలో దసరా నవరాత్రి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పోలేరమ్మ తల్లి శనివారం లలిత త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అలానే కొత్తపాలెం, వేమవరం, మల్లాయ పాలెం, కొప్పెరపాడు గ్రామాలలో నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు..

పంగులూరు : మండలంలోని రేణంగివరంలోని త్రిశక్తి పీఠం, ముప్పవరంలోని శ్రీలక్ష్మీగణపతిషిర్డీసాయి ఆలయంలో శనివారం అమ్మవారిని శ్రీలలితా త్రిపురసుందరిదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా కుంకుమపూజలు చేశారు. చందలూరులోని చిట్టా బత్తినవారి రేణుకమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని శ్రీలలితాత్రిపురసుందరిదేవిగా అలంకరించి లలితా అష్టోత్తర నామపారాణం చేశారు.

పర్చూరు : శ్రీలలిత త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు శనివారం భక్తులకు దర్శనమిచ్చారు స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వేడుకగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేపడుతున్నారు.

మేదరమెట్ల : దసర పండుగ సందర్భంగా మండలంలోని పలు దేవాలయాలల్లో అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం మేదరమెట్లలోని మిద్దెల డొంకలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని బాల త్రిపుర సుందరిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలరావూరులోని ఉ మమహేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని లలితాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలలో దసర పండగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇంకొల్లు : మండలంలోని దుద్దుకూరు గ్రామంలోని శ్రీచెన్ను పాటివారి అంకమ్మతల్లి దేవర గుడిలో శ్రీదేవీశరన్నవ రాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తు న్నారు. వేడుకలలో భాగంగా శనివారం అంకమ్మతల్లి అమ్మవారిని శ్రీలలితా త్రిపురసుంరిదేవి రూపంలో ప్రత్యేకంగా అలంకరించా రు. ఈ సందర్భంగా లలితా సహస్రనామ పారాయణం, కుంకుమపూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక భక్తబృందం అమ్మవారిని స్తుతిస్తూ భజనలు చేశారు.

ఇంకొల్లు : దసరా శరన్నవరాత్రుల సందర్భంగా 6వ రోజు ఇంకొల్లు మండలంలోని దుద్దుకూరు శివాలయం లో అమ్మవారిని లలితత్రిపుర సుందరిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంకొల్లులోని రేణుకమ్మ అలయంలో దసరా సందర్భంగా అమ్మవారికి లలితా త్రిపురసుందరిగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసారు.

చినగంజాం : స్థానిక భూ సమేత భావనారాయణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తు న్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దేవ స్థానంలో శనివారం ఉదయం శ్రీవారికి విశేష పూజలు, విశేష హోమాలు నిర్వహించారు. మహిళా భక్తులు విష్ణుసహస్ర నామ స్తోత్రపారాయణాన్ని నిర్వహించి, తదనంతరం వసంతోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఆశ్వవాహనంపై భావనారాయణస్వామి ఉంచి భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారికి చక్రస్నానం నిర్వహించి, నిత్యహోమం, పూర్ణాహుతి జరిపి భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ, సేవాదళ్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో బాగంగా మండల పరిధిలోని గ్రామాల్లోని ఆలయాల్లో వివధ రూపాల్లో అమ్మవార్లను అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పలుచోట్ల అన్నప్రసాద వితరణ చేశారు.



బల్లికురవ, ముప్పవరం షిరిడీ సాయి మందిరం, పర్చూరు, ఇంకొల్లులో లలితాత్రిపురసుందరిగా అమ్మవారు, చినగంజాంలో స్వామివారి గ్రామోత్సవం

ఏబీసీ వంతెన రెండో లేయర్ పనులు ప్రారంభం

మరో నెల రోజుల పాటు రాకపోకలు లేనట్లే



రెండో లేయర్ కప్పు పనులు చేస్తున్న కూలీలు

బల్లికురవ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లాపల్లి సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కాలువపై హైలెవల్ వంతెన పనులు రెండో లేయర్ కప్పు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. నెలరోజుల క్రితం వంతెనకు రెండున్నర అడుగుల ఎత్తులో మెదటి దశ కప్పు వేశారు. అప్పటి నుంచి బల్లికురవ అద్దంకి రోడ్డులో ఏబీసీ కాలువపై నుంచి వెళ్లే రాకపోకలు నిలిచి పోయాయి. మరలా రెండో లేయర్ కప్పు నాలుగు అంగుళాల మందంతో వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ లేయర్ కప్పు పూర్తి అయ్యాక మరో 20 రోజుల పైబడి క్యూరింగ్ చేయాల్సి ఉంది. దీంతో ఈ రోడ్డులో మరో నెల రోజుల వరకు రాక పోకలు లేనట్లే అని ప్రజలు అంటున్నారు. హైలెవల్ వంతెన పనులు శరవేగంగా చేపట్టిన కాలువలకు నీటి విడుదల వలన మెదట్లో 10 రోజుల పాటు పనులు ముందుకు కదలలేదు. కాలువలో పిల్లర్లు వేసి మెదటి దశ కప్పు వేసి సాగుకు నీటిని దిగువకు విడుదల చేశారు. సాగు నీటికి ఇబ్బందులు లేకపోయిన రాక పోకలు లేక ప్రజలు మాత్రం కొంత ఇబ్బంది పడుతున్నారు. వల్లాపల్లి గ్రామానికి చెందిన రైతులకు కాలువ దక్షిణం వైపున పంట భూములు ఉండటం వారు పంటల సాగుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.ఈ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2 కోట్ల నిధులను మంజురు చేసింది.

చీరాల అభివృద్ధిపై అసెంబ్లీలో చర్చ

- సీఎం చంద్రబాబును ఆకర్షించిన ఎమ్మెల్యే ప్రసంగం
- సభ దృష్టికి ఆర్‌వోబీ సహా పలు సమస్యలు
- కొండయ్యతో ప్రత్యేకంగా చర్చించిన సీఎం



సీఎంకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే కొండయ్య నియోజకవర్గ సమస్యలపై మాట్లాడటంతో వాటికి ముఖ్యమంత్రి చంద్రబాబును ఆ మాటలు ఆకర్షించాయి. దీంతో సమావేశం ముగింపు అనంతరం నేరుగా సీఎం ఛాంబర్‌కు ఎమ్మెల్యేను ప్రత్యేకంగా పలిపించి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే ఎమ్మెల్యే కూడా అసెంబ్లీ సమావేశాలను సద్వినియోగం చేసుకుంటూ ఒక్కో రోజు ఒక్కో సమస్యను సభదృష్టికి తీసుకు వెళ్లి నియోజక అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతున్నారు. మొదటి రోజు చీరాల ఆర్వోబీ(రైల్వే ఓవర్ బ్రిడ్జి), తరువాత రోజు కుందేరు అభివృద్ధిపై, తాజాగా రామాపురం, వాడరేవు తీర ప్రాంతాల అభివృద్ధిపై మాట్లాడారు. ప్రశ్నోత్తరాల సమయం లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం వారంలో సుమారు 25 వేల మంది పలు ఇతర రాష్ట్రాల నుండి సైతం పర్యాటకులు వస్తున్నట్లు వివరించారు. అలాగే పిడుగురాళ్ల - వాడరేవు 167ఏ జాతీయ రహదారి నిర్మాణాలు వేగవంతంగా జరుగుతుండగా తద్వారా పర్యాటకులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అయితే వాడరేవు - సూర్యలంక కనెక్టివిటీ రోడ్డును పూర్తి చేయాలని సభలో కోరారు. అలాగే పొట్టిసుబ్బయ్యపాలెం డబుల్ రోడ్డు పెండింగ్ దశలో ఉందని చెప్పారు. అంతేకాకుండా పర్యాటకులకు మౌలిక వసతుల కల్పనకు దృష్టి సారిస్తే పర్యాటకం అభివృద్ధి చెంది, ఉపాధి, ఉద్యోగ అవకాశలు మెరుగుపడతాయని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన పర్యాటక మంత్రి దుర్గేష్ పర్యాటక అభివృద్ధిపై స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. చీరాలలో పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి భరోసా కల్పించారు. అనంతరం ముఖ్యమంత్రి సైతం నేరుగా పిలిపించుకుని హ్యాండ్‌లూమ్ పార్క్, తదితర సమస్యలపై ఎమ్మెల్యే నుంచి ఆరా తీశారు. అభివృద్ధి పనులకు భరోసా కల్పించారు.

రైతులకు అండగా ప్రజా కూటమి ప్రభుత్వం

ఏపీఎస్‌డబ్ల్యూసీ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరావు



నిల్వలను పరిశీలిస్తున్న చైర్మన్ రావి వెంకటేశ్వరావు

పర్చూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అండగా ప్రజాకూటమి ప్రభుత్వం నిలిచిందని, అందుకు నిదర్శనంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం నల్లబర్లీ పొగాకును కొనుగోలుచేసి చరిత్రను సృష్టించిందని ఏపీ ఎస్‌డబ్ల్యూసీ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరావు అన్నారు. శనివారం స్థానిక గోడౌన్‌లో ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసిన పొగాకు నిల్వలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను ప్రైవేట్ కంపెనీలు కొనుగోలు చేయ లేదన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కొనుగోలుకు శ్రీకారం చుట్టిందన్నారు. దీనికి సంబంధించి రూ.276 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటి కొనుగోలు చేసిన రైతుల ఖతాల్లోకి రూ.100కోట్లను జమ చేశామన్నారు. పొగాకు రైతులతో పాటు, సరైన మద్దతు ధరలేక ఇబ్బంది పడుతున్న మామిడి, ఉల్లి, కొబ్బరి రైతులను కూడా ప్రభుత్వం ఆదుకుందన్నారు. జీఎం డి.మాధవ రావు, ఈఈ.జి.సురేంద్ర, ఆర్ఎం ఎండీ షాకీర్ హుస్సేన్, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సరే.. ముంపు సంగతేమిటి?

- జాతీయ రహదారి వెంబడి నీటి సరఫరాపై దృష్టిసారించని అధికారులు
- వరదనీటితో పైర్లు దెబ్బతింటాయంటున్నరైతులు



జాతీయ రహదారి వెంబడి పొలాల్లో నిలిచిన వర్షపునీరు, సర్వీసు రోడ్డు ఏర్పాటుతో కుంచించుకుపోయిన డ్రైనేజీ కాలువ

పర్చూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణంలో అధికారుల మందుచూపు కొరవడంతో పంటపొలాలు, గ్రామాల సైతం ముంపునకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతు న్నారు. భారీ వర్షాల సమయంలో ఎగువ నుంచి వచ్చే వరద నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా కాల్వల నిర్మాణంపై దృష్టి సారించ కుండా రోడ్డు నిర్మాణం చేస్తూ చేతులు దులుపు కుంటున్నారన్న విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. పర్చూరు సమీపంలో నాగులపాలెం ఎత్తిపోతల పథకం వద్ద అంచు వరకు సర్వీసు రోడ్డు నిర్మించారు. ఎగువ నీరు ఎటు పోవాలో అర్థంకానికి పరిస్థితి నెలకొంది. నూతన జాతీయ రహదారి పొడవునా ఒకటి రెండు చోట్ల తూములు వేసి చేతులు దులుపుకోవడం మినహా పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరిగేలా చేర్యలు చేపట్టిన దాఖలాలు కనపించడం లేదు. ఇటు డ్రైనేజ్, అటు జాతీ య రహదారుల సంస్థ అధికారుల మధ్య సమన్వయ లోపం వల్లే ఇలాంటి పరిస్థితి నెల కొందని రైతులు వాపోతున్నారు. నిర్మాణ పనుల్లో తగు జాగ్రత్తలు తీసుకుంటే వరద ముంపు ఉండేది కాదని నిపుణులు అంటు న్నారు. ఇప్పటికైనా డ్రైనేజ్, జాతీయ రహదారుల సంస్థ అధికారులు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని యుద్ధ ప్రాతిపతికన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. పైచే రోడ్డు నిర్మాణంతో అభివృద్ధి మాట ఏమోకానీ, వరద నీరు పంట పొలాల్లోకి చేరి నిల్వ ఉంటే తమ భూములు చౌడుగా మారతాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు దీనిపై దృష్టి సారించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కారును వెనుక వైపు ఢీకొన్న లారీ

- ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

అద్దంకి, సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి): కారును వెనుక వైపు లారీ ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా దామ చర్ల మండలం రాళ్లవాగు తండాకు చెందిన చినమస్తాన్, శ్రీధర్‌లు మరోవ్యక్తితో కలిసి శనివారం మధ్యాహ్నం ఒంగోలు వైపు వెళ్తుండగా అద్దంకి-శింగరకొండ మధ్య నామ్ రోడ్డులో వెనుక నుండి వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ చినమస్తాన్, శ్రీధర్‌లను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని రాస్తారోకో

అద్దంకి, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం రాత్రి అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో బంధువులు రాస్తారోకో చేశారు. మండలంలోని తిమ్మాయపాలెంలో శనివారం ఉదయం ట్రాక్టర్ కింద పడి ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందగా న్యాయం చేయాలని కోరుతూ బంధువులు శనివారం రా త్రి రాస్తోరోకో చేపట్టారు. రాత్రి 7-30 గంటలకు ప్రారంభమైన రాస్తారోకో పొద్దుపోయే వరకు కొనసాగింది. నామ్ రోడు లో ట్రాఫిక్ రెండు వైపులా నిలిచిపోయింది. డీఎస్పీ మొయిన్, సీఐ సుబ్బరాజులు బాధితులను సమన్వమ పరిచి రాస్తారోకో విరమింపజేశారు.

పూరీ - తిరుపతి రైలులో గంజాయి స్వాధీనం

- పోలీసుల అదుపులో ఇరువురు అనుమానితులు




చీరాల రైల్వేస్టేషన్‌లో పట్టుబడిన గంజాయి

చీరాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చీరాల రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తుండగా శనివారం పెద్దమొత్తంలో మొత్తం గంజాయి పట్టుబడింది. పూరీ - తిరుపతి రైలులో ఈగల్, జీఆర్‌పీ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. 16 కిలోల గంజాయిని గుర్తించారు. అలాగే కేరళకు చెందిన ఇరువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇటీవల కాలంలో గంజాయి నిత్యం పట్టుబడుతుండడం గమనార్హం.

శ్మశానంలో ఇనుప గేట్లు మాయం

- పట్టించుకోని పంచాయతీ అధికారులు




శ్మశానవాటిక స్థలం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధేనువకొండ పునరావాస కాలనీ బలరామకృష్ణపురం శ్మశానంలో ఇనుప గేట్లు అపహరణకు గురయ్యాయయి. గుండ్లకమ్మ ప్రాజెక్టు ముంపు ప్రధాన ముంపు గ్రామమైన ధేనువకొండకు పునరావాసకాలనీ బలరామకృష్ణపురానికి మొదటిలో శ్మశానం లేదు. దీంతో చనిపోయిన వ్యక్తులను 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాత ధేనువకొండ గ్రామానికి వాహనాలలో తీసుకువెళ్లి పూడ్చుకోవాల్సిన పరిస్థితి. దీనిపై స్పందించిన అప్పటి ప్రభుత్వం పునరావాసకాలనీ బలరామకృష్ణపురానికి సమీపంలో మూడు ఎకరాల భూమిని కోనుగోలు చేసి శ్మశానికి కేటాయించారు. అక్కడ ఎస్సీ, ఎస్టీలకు ఎకరం, బీసీలకు ఒక ఏ కరం, ఓసీ సామాజిక వర్గానికి ఒక ఎకరం చొప్పున మూడు సామాజిక వర్గాలకు శ్మశానవాటికను అభివృద్ధి చేశారు. అయితే కొన్నినెలల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు శ్మశానం కంచెకు ఏర్పాటు చేసిన ఇనుప గేట్లను గుట్టుచప్పుడు కాకుండా దొంగిలించుకు పోయారు. ఆ విషయాన్ని అంటూ పంచాయతీ అధికారులు, కానీ ప్రజా ప్రతినిధులు కాని పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోలేదు. దీంతో ఇటీవల మిగిలిన ఇనుప గేట్లును కూడా దొంగిలించుకుపోయ్యారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి శ్మశానాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మాజీ ఎంపీపీ హనుమంతరావుకు ఘన నివాళి

ఇంకొల్లు,సెప్టెంబరు 27,(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ మద్దినేని హనుమంతరావు కు శనివారం పలువురు నివాళ్లులర్పించారు. ఇంకొల్లులో మద్దినేని హనుమంతరావు దశదినకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై హనుమంతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు.మద్దినేని హనుమంతరావు గతంలో పర్చూరు ఏఎంసీ చైర్మన్‌గా, ఇంకొల్లు మండల ఎంపీపీగా రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా పనిచేశారు. హనుమంతరావుకు పావులూరు ఆంజనేయస్వామి కమిటీ సభ్యులు ఆత్మకూరి రాంబాబు, నాగిరెడ్డి,ఇంకొల్లు రోటరీక్లబ్ సభ్యులు,అడ్వకేట్లు,గ్రామ ప్రముఖులు,స్థానిక నాయకులు తదితరులు హాజరై నివాళ్లులర్పించారు.



'సోమశిల'కు కొనసాగుతున్న వరద



అనంతసాగరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి శనివారం 13,036 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. డ్యాంలో 72.537 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పవర్ టన్నెల్ ద్వారా డెల్టాకు 2,650, ఉత్తర కాలువకు 250, కండలేరుకు 10,200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



లోకరక్షిణీ నమో స్తుతే!



● వేడుకగా నవరాత్రి ఉత్సవాలు ● వివిధ అలంకరణల్లో అమ్మవార్ల దర్శనం

జిల్లాలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఆరో రోజు శనివారం వివిధ అలంకరణలలో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. నవావరణ పూజలు, కన్యపూజలు, శ్రీలలితా కుంకుమార్చన, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంభహారతి తదితర పూజలు జరిగాయి. నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారు గజలక్ష్మిగాను, ఇరగాళమ్మ త్రిపురభైరవిగాను, మూలస్థానేశ్వర ఆలయంలో భువనేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరిగాను, కన్యకాపరమేశ్వరి గాయత్రి అలంకరణలో దర్శనం ఇచ్చారు. అలాగే వేదగిరి, పెంచలకోన, జొన్నవాడ క్షేత్రాల్లోనూ అమ్మవార్ల అలంకరణ ఆకట్టుకుంది. భక్తులు ఆలయాలకు పోటెత్తారు.

నెల్లూరు : త్రిపురభైరవిగా ఇరగాళమ్మ



పూజలో పాల్గొన్న భక్తులు



జీఎస్టీ 2.0ను సద్వినియోగం చేసుకోండి

● అవగాహన ర్యాలీలో జేసీ వెంకటేశ్వర్లు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ 2.0ను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీబొమ్మ వరకు జరిగిన జీఎస్టీ అవగాహన ర్యాలీలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో కలిసి జేసీ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ఫలాలను ప్రజలు, వ్యాపార వేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర వస్తువుల ధరలు, వైద్యానికి అవసరమైన మందుల ధరలు తగ్గాయన్నారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



3వ విడత 34 గ్రామాల్లో

వచ్చే నెల 3న రీ సర్వే ప్రారంభం

పక్కాగా నిర్వహణకు అధికారుల విస్తృత ఏర్పాట్లు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ భూ ముల హద్దులు, విస్తీర్ణం పక్కాగా ఉండాలని కోరుకుంటారు. కానీ, ప్రతి గ్రామంలో భూ సమస్యలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. గత ప్రభుత్వంలో జరిగిన భూముల రీసర్వేపై అనేక అభ్యంతరాలు తలెత్తాయి. కానీ వీటికి పరిష్కారం మాత్రం అప్పటి పాలకులు చూపలేదు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం గతంలో జరిగిన రీసర్వే సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించింది. రీసర్వే సమస్యలపై 8,218 ఫిర్యాదుల అందాయి. వీటిలో సర్వేకు సంబంధించి 3,421, రెవెన్యూకు సంబంధించి 4,797 ఫిర్యాదులు అందాయి. జిల్లా సర్వే శాఖ అధికారులు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, విస్తీర్ణంలో సమస్యలు, ఇతర భూసమస్యలను దాదాపుగా పరిష్కరించారు. కొన్నింటిని ఎందుకు పరిష్కరించలేక పోయామో ఫిర్యాదు దారులకు తెలియచేశారు. జిల్లాలోని మిగిలిన గ్రామాల్లో ప్రస్తుత ప్రభుత్వం పక్కాగా సర్వే చేయించి, రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను అందజేస్తోంది. ఈ దశగా జిల్లాలో భూముల రీసర్వే కార్యక్రమం తొలుత పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభమైంది.



భూములు సర్వే చేస్తున్న అధికారులు

35 గ్రామా లు, రెండో విడతలో 32 గ్రామాల్లో రీసర్వే ప్రారంభమవగా, 13 గ్రామాల్లో సంపూర్ణంగా జరిగింది. మిగిలిన గ్రామాల్లో అక్టోబరు 15లోగా పూర్తిచేయనున్నారు.

● 3 నుంచి 34 గ్రామాల్లో..

జిల్లావ్యాప్తంగా 34 గ్రామాల్లో అక్టోబరు 3వ తేదీన మూడో విడత భూముల రీసర్వేను పక్కాగా ప్రారంభించనున్నారు. జిల్లాలోని 4 రెవెన్యూ డివిజన్ల పరిధిలో 38 మండలాలు ఉన్నాయి. వీటిలో 737 గ్రామాలు ఉన్నాయి. 24,08,354.98 ఎకరాల భూమి ఉంది. 737 గ్రామాలకుగాను 730 గ్రామాలలో రీసర్వే పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ గ్రామాల్లో తొలి విడతగా డ్రోన్ సర్వే పూర్తి చేశారు. ఇప్పటికే 329 గ్రామాల్లో 13వ నోటిఫికేషన్‌ను భూములకు సంబంధించి విడుదల చేశారు. ఇంకా 328 గ్రామాల్లో జిల్లాలో రీసర్వే జరగాల్సి ఉంది. ఈ సర్వేను పక్కాగా ఎలాంటి అభ్యంతరాలు లేకుండా జరిపించ డానికి చర్యలు చేపట్టారు.

పక్కాగా రీసర్వే చేయిస్తాం

ఎలాంటి అభ్యంతరాలు లేకుండా భూసర్వే కార్యక్రమాన్ని చేపట్టాం. ప్రభుత్వం ఏర్పాటైన తరువాత సమగ్ర, ఖచ్చితత్వ సర్వేకు ఆదేశాలు జారీ చేసింది. అక్టోబరు 3 నుంచి మూడో విడత రీసర్వే ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తాం. రైతుల అభ్యంతరాలు స్వీకరించి అప్పటికప్పుడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాం.

- నాగశేఖర్, డిప్యూటీ డైరెక్టర్, సర్వే-భూ రికార్డుల శాఖ

ఎంత ధాన్యమైనా కొంటాం

● జిల్లాలో 54 కొనుగోలు కేంద్రాలు ● పౌరపరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ అర్జున రావు

ఇంటర్వ్యూ...

ఎడగారు సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ఎంతైనా కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పౌరపరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ అర్జున రావు స్పష్టం చేశారు. రైతు సమస్యలు పరిష్కరించడానికి, జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా అర్జునరావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.



? ఎడగారులో వరి సాగు విస్తీర్ణం ఎంత

! ఈ సీజన్‌లో 1.98 లక్షల ఎకరాల్లో వరి సాగవగా, ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు లెక్క గట్టారు.

? కొనుగోలు కేంద్రాల మాటేమిటి

! ఎడగారు ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ప్రస్తుతం పంట చేతికొచ్చిన ప్రాంతాలలో 54 కొనుగోలు కేంద్రాలను తక్షణం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. తొలుత కోవూరు, ఆత్మకూరు, సర్వేపల్లి, కావలి తదితర ప్రాంతాలలో పంట చేతికంది విక్రయానికి సిద్ధంగా ఉన్నట్లు గుర్తించాం. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం సేకరిస్తాం.

? దళారుల బెడద ఎక్కువయ్యిందట

! రైతులను మోసం చేస్తున్న దళారుల విషయం తెలిస్తే తక్షణ చర్యలు తీసుకుంటాం. వారిపై కేసులు నమోదు చేయిస్తాం. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల ఇకపై రైతులు దళారులను నమ్మాల్సిన పని లేదు. ధాన్యాన్ని విక్రయించుకోడానికి రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలి.

? మద్దతు ధర ఎంత ఇస్తున్నారు

! గ్రేడ్-ఏ రకానికి క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది. పుట్టికి గ్రేడ్-ఏ రకానికి రూ. 20,306.50, సాధారణ రకానికి రూ.20,136.50 మద్దతు ధర ఇస్తున్నాం.

? కంట్రోల్ రూం ఏర్పాటు చేశారా?

! ధాన్యం అమ్మకాలలో ఇబ్బందులు తలెత్తితే 8520879979 నెంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం.

? మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చారా

! ధాన్యం సేకరణ కోసం 61 మంది మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారెంటీలు స్వీకరించాం. ఇచ్చిన మిల్లులకే ధాన్యం పంపే ఏర్పాట్లు చేశాం. ఈ మిల్లులకు, కొనుగోలు కేంద్రాలను ట్యాగ్ చేశాం. కేంద్రంలో ట్రక్ షీట్ జనరేట్ కాగానే మిల్లుకు ధాన్యం వెళ్లే ఏర్పాట్లు చేశాం. రైతులకు ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాం.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

ఆక్వాకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి!

ఆక్వా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రాయితీ అందిస్తోంది. యూనిట్ ధర కేవలం రూ.1.50 మాత్రమే. అయితే ఈ రాయితీ అందాలంటే సాగుదారులు తమ చెరువులకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దీనిపై అవగాహన కల్పించేందుకు మత్స్య శాఖ అధికారులు నెల రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని స్వచ్ఛందంగా కోస్టల్ ఆక్వా అథారిటీ (సీఏఏ), ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

అప్పుడే విద్యుత్‌లో రాయితీ

జిల్లాలో 39,590 ఎకరాల్లో సాగు..

రిజిస్ట్రేషన్ అయ్యింది 14,075 ఎకరాలకే



జిల్లాలో మత్స్య శాఖ లెక్కల ప్రకారం 39,590 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఇందులో 1,802 ఎకరాల్లో ఉప్పునీరు, 21,538 ఎకరాల్లో మంచినీటి ఆక్వా సాగు జరుగుతోంది. అనధికారికంగా మరో 5వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతున్నట్లు అంచనా. ఇప్పటివరకు 14,075 ఎకరాలకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇంకా 25,515 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉంది. ఇందులో మంచినీటి ఆక్వా సాగు చేస్తున్న రైతులు అప్సడా వద్ద, ఉప్పునీటి ఆక్వా సాగు చేస్తున్న రైతులు సీఏఏ వద్ద రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉంటుంది.

● అక్టోబరు 16 వరకు ప్రత్యేక డ్రైవ్

జిల్లాలో రొయ్యల చెరువులకు రిజిస్ట్రేషన్ చేయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. మత్స్య శాఖ ఆధ్వర్యంలో నెల రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసింది. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 16వ తేదీ వరకు నెల రోజులపాటు ఈ కార్యక్రమం చేపట్టింది. రైతు సేవా కేంద్రాల్లో ఉంటున్న గ్రామ మత్స్య సహాయకులు ఆయా గ్రామాల్లో ఉంటున్న ఆక్వా రైతుల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తులు చేయిస్తున్నారు. వీటిని మత్స్య శాఖ అధికారులు పరిశీలిం లైసెన్సులు జారీ చేస్తారు. డీకేటీ, అసైన్డ్ భూముల్లో రొయ్యలు సాగు చేస్తున్న రైతులకు తహసీల్దారు కార్యాలయం నుంచి దరఖాస్తులు వస్తే పరిశీలించి వారికి సాగు ధ్రువీకరణ పత్రాలను మత్స్య శాఖ అధికారులు అందిస్తారు.

● ఐదేళ్లపాటు లైసెన్సు

రొయ్యల సాగు చేస్తున్న రైతులు, సీఏఏ, అప్సడా నుంచి అనుమతులు తీసుకోవాలి. ఐదేళ్లపాటు లైసెన్సు ఇస్తారు. గడువు ముగిసిన తరువాత తిరిగి రెన్యువల్ చేసుకోవాలి. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు చాలా మంది తిరిగి రెన్యువల్ చేయించుకోలేదని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాన్ ఆక్వా జోన్ పరిధిలో లేని రొయ్యల చెరువులకు విద్యుత్ రాయితీ ఇవ్వలేదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం నాన్ ఆక్వా జోన్ పరిధిలో ఉన్న చెరువులకు రాయితీ విద్యుత్ అందిస్తామని ఇప్పటికే ప్రకటించింది. అయితే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించాలని స్పష్టం చేసింది. గత ప్రభుత్వంలో యూనిట్ ధర రూ.6 నుంచి 8 వరకు ఉండేదని ప్రస్తుతం రూ.4.80 ఉందని ఆక్వా రైతులు చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

విద్యుత్ రాయితీని పొందాలంటే రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జిల్లాలో 12,734 మంది రైతులు 25,515 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. డీకేటీ, అసైన్డ్ భూముల్లో సాగు చేస్తున్న రైతులు రూ.500, పట్టా భూమిలో సాగు చేస్తున్న రైతులు రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది.

-కే.శాంతి, మత్స్య శాఖ జేడీ



సౌత్‌మోపూరు జడ్పీ స్కూల్ ఆవరణలో ఆరబెట్టిన ధాన్యం

వరుణ దేవా.. వర్షించకు..!

బంగాళఖాతంలో ఏర్పడిన వరుస అల్పపీడనాలతో వాతావరణంలో మార్పులు రైతులను ఆందో ళనకు గురి చేస్తున్నాయి. అక్కడక్కడ వర్షాలు కురుస్తుండటంతో రైతులు వరుణ దేవా.. వర్షాలు వద్దయ్యా.. అంటూ ప్రాధేయపడు తున్నారు. ప్రస్తుతం ఎడగారు సీజన్ ముగింపు దశకు చేరుకుని వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. పల్లెల్లో రైతులు, రైతు కూలీలు క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం చేతికందుతున్న ఈ సమయంలో వరుణదేవా... వద్దంటూ అన్నదాతలు కోరుతున్నారు. రోడ్లు, ఖాళీ స్థలాలు, పాఠశాల మైదానాల్లో ధాన్యం ఆరబెట్టి విక్రయానికి పెడుతున్నారు.

- నెల్లూరురూరల్, ఆంధ్రజ్యోతి)



సచివాలయంలో మద్యం సేవించి మత్తులో పడుకుని ఉన్న వీఆర్వో రంతుల్లా

సచివాలయంలో తప్పతాగి!

● పడమటినాయుడుపల్లి వీఆర్వో నిర్వాకం

ఈయన పేరు రంతుల్లా. మర్రిపాడు మండలం పడమటి నాయుడుపల్లి వీఆర్వో. మరి ఎందుకు అర్ధనగ్నంగా పడుకుని ఉన్నాడని అనుకుంటున్నారా!?. పూటుగా మద్యం సేవించిన ఆయన ఇదిగో ఇలా తాను పని చేస్తున్న కార్యాలయంలోనే నేలపై మత్తులో నిద్రలోకి జారుకున్నారు. ఈ దృశ్యాలన్నీ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పడమటి నాయుడుపల్లి వీఆర్వో రంతుల్లా శుక్రవారం రాత్రి సచివాలయంలో పూటుగా మద్యం సేవించాడు. అక్కడ నుంచి రాలేని స్థితిలో చొక్కా విప్పేసి నేలపై దొర్లాడుతూ మత్తులోకి జారుకున్నాడు. శనివారం ఉదయం సచివాలయ తలుపులు తెరిచి ఉండటంతో కొంతమంది గ్రామస్థులు లోపలకు వెళ్లారు. అక్కడ అర్ధనగ్నంగా పడుకొని ఉన్న వీఆర్వోను చూసి అవాక్కయ్యారు. ఆ వీడియోలు సామాజిక మాధ్యమాల్లోకి పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారాయి. కాగా, మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో కొంతమంది అధికారులు, సిబ్బంది మద్యం సేవించి విధులకు హాజరవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 550

వైభవంగా అదనపు సివిల్ న్యాయాధికారి ఆకాష్, సలోమి వివాహ వేడుక

కావలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అడిషనల్ సివిల్ న్యాయాధికారి గుర్రంకొండ ఆకాశ్, సలోమి వివాహ వేడుక స్థానిక వెంగళరావునగర్‌లోని వారి నివాసంలో శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. పీఎస్ఆర్ సంస్థల అధినేత పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ దంపతులు వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



జాబ్ కార్డులకు ఈకేవైసీ చేయించాలి

లింగసముద్రం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామ పంచాయతీలలోని శ్రామికులు జాబ్‌కార్డులకు ఈకేవైసీ చేయించాలని ఏపీవో షేక్ సమీర్‌బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌కార్డులు ఈకేవైసీ చేయించుకున్న శ్రామికులకే భవిష్యత్తులో హాజరువేయడం జరుగుతుందని, ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

డాక్టర్ శివసాయి కిరణ్‌కి పరామర్శ



గీతాంజలి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న లిడ్ కాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

ఉలవపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో వైద్యవృత్తి నిర్వహిస్తున్న ఉలవపాడు గ్రామానికి చెందిన డాక్టర్ బడితల శివసాయి కిరణ్ కుటుంబాన్ని లిడ్‌కాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు శనివారం పరామర్శించారు. శివసాయి కిరణ్ తల్లి బడితల గీతాంజలి అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న ఆయన ఉలవపాడుకు చేరుకుని గీతాంజలి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రావినూతల రమేష్, తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి గడ్డం నవీన్ లిడ్‌కాప్ చైర్మనతోపాటు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మాట్లాడుతున్న వైద్యాధికారి శివశిద్దప్ప

వలేటివారిపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సిలో వైద్యాధికారి శివశిద్దప్ప ఆధ్వర్యంలో కందుకూరు సురక్ష ఆసుపత్రి వైద్యులు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వలేటివారిపాలెంతో పాటు చుట్టుపక్కల ప్రాంతీయులు తరలివచ్చారు. వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, స్థానిక టీడీపీ నాయకులు వలేటి మధుసూధన్‌రావు, ఈఓఆర్డీ సత్యనారాయణ, సిహెచ్‌ఓ శివరామయ్య పాల్గొన్నారు.

ఆర్ఎస్ఆర్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

బిట్రగుంట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శనివారం ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి తెలిపారు. టెకీబోట్ డైరెక్టర్, ఏఐ ఎక్స్పర్ట్ ఎన్ వెంకటరెడ్డి ఐదు రోజులపాటు కళాశాల అధ్యాపకులకు ఫండమెంటల్స్, మెషీన్ లెర్నింగ్ బేసిక్స్, డేటా అప్లికేషన్లు, ప్రేప్లెక్సిటీ, సిరి, జెమిని, డీప్‌సీక్, ఎడ్యుకేషన్ ఏఐ, మ్యాజిక్ స్కూల్ ఏఐ వంటి సాధనాల ఆచరణాత్మక ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు, ఐక్యూ ఏసీ ఇన్‌చార్జి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు స్వీకరణ

కావలి రూరల్, సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి మెరుగైన సేవలు పొందాలని, ఆదివారం కూడా బిల్లులు చెల్లించవచ్చని ఏఈ వసంతరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారుల సౌకర్యార్థం వెంగళరావునగర్ సబ్ స్టేషన్లోని రెగ్యులర్ రెవెన్యూ కలెక్షన్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈ కోరారు.

వీఎన్ఆర్‌పేటలో 'స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్'

బిట్రగుంట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్-1, కొత్తూరు గ్రామాల్లో శనివారం 'స్వస్థనారీ- సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. కోవూరుపల్లి వైద్యులు రామకృష్ణ ఆధ్వర్యం లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎం నాగేశ్వరరావు, సర్పంచు గండూరి మంజులపాల్గొన్నారు. సీహెచ్‌వో నజీమున్నీసా, అంగన్వాడీ సూపర్‌వైజర్ హైమవతి పౌష్టికాహార ఆవశ్యకతపై మహిళలకు అవగాహన కల్పించారు.

దేదీప్యమానంగా నవరాత్రి ఉత్సవాలు



అల్లూరు : పార్వతీ దేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు



కావలి : అన్నపూర్ణాదేవి అలంకారంలో కనకదుర్గ అమ్మవారు



బిట్రగుంట : లలితా త్రిపురసుందరిదేవి అవతారంలో ఉన్న అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కావలి (టౌన్) సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం గ్రామదేవత కలుగోళశాంభవి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. రాత్రి అశ్వ వాహన సేవలందుకున్నారు. శివాలయంలోని దుర్గాభ్రమరాంబ అమ్మవారు స్కంధమాత లలితా త్రిపురసుందరి అలంకారంలో కొత్తబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు లలితా త్రిపురసుందరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తుల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విష్ణు ఆలయంలోని రాజ్యలక్ష్మి అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలోను, వడ్డిపాలెంలోని కనకదుర్గా అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలోను దర్శనమిచ్చారు. భక్తులు వేలాదిగా పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● శ్రీవారికి కల్పవృక్ష, సర్వభూపాల వాహన సేవ

బృందావనం కాలనీలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవారు కల్పవృక్ష వాహన, సర్వభూపాల వాహన సేవలు అందుకున్నారు. ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాల యాగ్నిక స్వామి పరాంకుశం చినవెంకటస్వామి యాగ్నికంలో టీటీడీ ఆచార వ్యవహారాలతో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మహిళల కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం మోహినీ పల్లకీ ఉత్సవం, లక్ష్మీకాసుల మాల ఉత్సవం, రాత్రి గరుడ వాహన ఉత్సవం జరగనున్నాయి.

బిట్రగుంట : బోగోలు మండలంలో శరన్నవరాత్రుల సందర్భంగా శనివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. బోగోలు షిరిడీ సాయిబాబా మందిరంలో బొమ్మల కొలువు, లలితా త్రిపురసుందరీ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. విశ్వనాథరావుపేట కోదండరామస్వామి ఆలయంలో రాజరాజేశ్వరీ అమ్మవారు లలితా త్రిపురసుందరీ దేవిగా కనువిందు చేసింది.

అల్లూరు : దేవీ నవరాత్రులను పురస్కరించుకుని అల్లూరు పరిధిలోని పార్వతీ దేవి అమ్మవారి ఆలయం (దసరా దేవాలయం)లో శనివారం అమ్మవారికి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ వరుణ్ణి ప్రత్యేక రథంలో అలంకరించి గ్రామోత్సవానికి తరలించారు. ముందుగా ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి, కలుగోళమ్మ, గంగమ్మ, పోలేరమ్మ, వృక్ష పోలేరమ్మ ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్డీఎస్ స్కీంలో లోపాలు సరి చేయాలి

● నాణ్యమైన విద్యుత్ సరఫరా ప్రభుత్వ బాధ్యత

● అసెంబ్లీలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

అధ్యక్షా..

కావలి,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): 'ఆర్డీఎస్ స్కీంలోని లోపాలను సరిచేసి అందరికీ సమానంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడం ప్రభుత్వ బాధ్యత' అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి శనివారం అసెంబ్లీలో ప్రస్తావించారు. కేంద్రప్రభుత్వం 2021-22లో ఆర్డీఎస్ పేరుతో దేశవ్యాప్తంగా విద్యుత్‌వ్యవస్థను మెరుగుపరచేందుకు రూ. 3,03,000 కోట్లు మంజూరు చేసిందన్నారు. అందులో రాష్ట్ర వాటా రూ.15,508 కోట్లు కాగా, నెల్లూరు జిల్లాకు రూ.718 కోట్లు మంజూరైందన్నారు. త్రీపేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త విద్యుత్ స్తంభాలు, ఐదు లైన్ల విద్యుత్ తీగలతో గ్రామం యూనిట్‌గా ఏర్పాటు చేయాలన్నారు. అయితే గ్రామంలో కొన్ని వీధులలో ఏర్పాటు చేసి, కొన్నిచోట్ల పాత స్తంభాలు, పాత తీగలను అలాగే వదిలేశారన్నారు. దీంతో కొందరికి త్రీఫేజ్, మరికొందరికి సింగిల్ ఫేజ్ కరెంట్ అందుతుండటంతో గ్రామాల్లో విబేదాలు ఏర్పడుతున్నాయన్నారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని, అందరికీ సమానంగా విద్యుత్ సరఫరా చేయాలని స్పీకర్ ద్వారా ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరారు.



అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

సమస్యల పరిష్కారం కోసం రేపు వీఆర్ఏల నిరసన

లింగసముద్రం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్ఏ)ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29వ తేదీ న కందుకూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు మండల విఆర్ఏల సంఘం అధ్యక్షుడు షేక్‌నబీ సాహెబ్ తెలిపారు. ఈమేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐ ఎం రమణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నబీ, విఆర్ఏలు మాట్లాడుతూ కందుకూరు డివిజన్ పరిధిలోని మండలాల్లో ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌మ్యాన్, అటెండరు పోస్టులు విఆర్ఏలతో భర్తీచేయాలన్నారు. అదేవిధంగా విఆర్ఏలకు పేస్కేలు, ప్రమోషన్ తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఏలు బి మహేశ్వరరావు, జి దత్తుకుమార్, కె వేణుగోపాల్, సీహెచ్ నరసింహం, కె శ్రీను, కొండయ్య, షేక్ నబీసాహెబ్, సీహెచ్ జంగయ్య, ఎ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా వలేటివారిపాలెం, రాళ్లపాడు ప్రాజెక్టు రోడ్డు

లింగసముద్రం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం నుంచి లింగసముద్రం మీదుగా రాళ్లపాడు ప్రాజెక్టు ఆర్ అండ్‌బీ రోడ్డు గుంతలమయమై అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వలేటివారిపాలెం నుంచి వెంగళాపురం, జంగంరెడ్డిపాలెం, లింగసముద్రం ప్రాజెక్టు ఆర్చి వరకు రోడ్డు గుంతలమయం కావడంతో నరక యాతన పడుతున్నామని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. ఆరు నెలల క్రితం ఈ రోడ్డుకు మరమ్మతు పనులు చేశారు. అయితే నాణ్యతగా పనులు చేయకపోవడంతో ఎక్కడి గుంతలు అక్కడే ఉండి పోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాణ్యతతో రోడ్డు మరమ్మతు పనులు చేయించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

మహిళలకు ఆరోగ్య భద్రత

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : దేశంలో మహిళల ఆరోగ్య భద్రత కోసం స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ అధికారి డాక్టర్ రమేష్ వెల్లడించారు. శనివారం కొత్తూరు వైఎస్సార్ నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పఠాన్ ఇమ్రాన్‌ఖాన్, అర్బన్ సీడీపీవో అరుణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ కొండాపురం వెంకటేశ్వర్లు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచితం... ఆపై దసరా సెలవులు!

● కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్సులు



బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

కావలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం. దీనికి తోడు దసరా శెలవులు కావటం తో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో ఆటోలను ఆశ్రయించే మహిళలు ఉచిత ప్రయాణం కావటంతో ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేస్తున్నారు. రద్దీ పెరగడంతో ఆర్టీసీ ఆక్యుపెన్సీ శాతం పెరిగింది. మరోవైపు ఆర్టీసీ అదనంగా బస్సుల సంఖ్యను పెంచకపోవటంతో ఉన్న బస్సుల్లోనే ప్రయాణం చేయాల్సి వస్తోంది. శనివారం మధ్యాహ్నం కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణీకులు గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూడటం కనిపించింది. రద్దీ కారణం గా గమ్యస్థానాలు చేరేందుకు ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పటం లేదు. ఈ నేపథ్యంలో బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ఘనంగా ధ్వజ స్తంభం, నవగ్రహ ప్రతిష్ఠ



ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కొండాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేటలో కొలువైన శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ, నవగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గణపతిపూజ, కలశ స్థాపన, అంకురార్పణ, హోమం, యంత్రస్థాపన పూజల అనంతరం పండితులు ధ్వజ స్తంభం, నవగ్రహ ప్రతిష్ఠ, సీతారాముల కళ్యాణం నిర్వహించారు. అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రకాశంలో ఘనంగా ఫ్రెషర్స్‌డే



ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ప్రకాశం కరస్పాండెంట్ విజయ్‌శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

కందుకూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు ఆటపాటలు, నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు కళాశాలలో అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించుకుని ఉన్నత స్థానాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, షేక్ నూరియాషిహబ్, మీరావలి, జి ప్రసాద్, శైలేష్‌కుమార్, రామ్‌ప్రసాద్, బాలబ్రహ్మచారి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మర్రిపూడి

కందుకూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పూర్వ ప్రకాశం జిల్లా హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కందుకూరు ఆదిత్య గ్రాండ్ రెస్టారెంట్ యజమాని మర్రిపూడి శ్రీనివాసులు ఎన్నికయ్యారు. అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం రాత్రి కందుకూరులో జరిగింది. ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసియేషన్ ప్రెసిడెంట్ జి శ్రీనివాసరావు, కార్యదర్శి కె రమణ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై అధ్యక్షుడు మర్రిపూడి శ్రీనివాసరావుతో పాటు కార్యదర్శి కె నాగేశ్వరరావు, కోశాధికారి ఎం మహేష్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆతిథ్య రంగానికి నానాటికీ ఆదరణ పెరుగుతోందని, కందుకూరులో మంచి హోటల్ నిర్వహణలో ముందున్న మర్రిపూడి శ్రీను అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికవటం అభినందనీయమన్నారు. ఆయన మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిడికిటి వెంకటేశ్వర్లు, గట్టమనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గజలక్ష్మీ నమస్తుతే..!

వేడుకగా నవరాత్రి ఉత్సవాలు



నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దేవీ నవరాత్రి ఉత్సవాలు శనివారానికి ఆరో రోజుకి చేరాయి. అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు.

● నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారికి గజలక్ష్మి అలంకారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నవావరణ పూజలు, కన్యపూజలు, శ్రీలలితా కుంకుమార్చన, సుందరేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంభహారతి నిర్వహించారు. అనంతరం సంపుటీకరణ, చండీహోమం జరిగింది. ఉత్సవాలను ఉభయకర్తలు, అర్చకులు, సిబ్బంది, ఆలయ ఏసీ కోవూరు జనార్దన్ రెడ్డి పర్యవేక్షించారు.

● స్టోన్‌హౌస్‌పేటలో కన్యకాపరమేశ్వరికి గాయత్రి అలంకారం వైభవంగా జరిగింది. మూలవర్లకు ముత్యాలచీర అలంకారం, నవావరణ, ఖడ్గమాల, లలిత సహస్ర దీపాల అలంకరణ, భక్తులను ఆకట్టుకుంది. ఈ వేడుకలను ఉభయకర్తలు, ఆలయ పాలక మండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక చైర్మన్ షేగు.షణ్ముఖరావు, కార్యదర్శి చిరంజీవి, గౌరవ సలహాదారుడు ఎంపీ.ఆంజనేయులు, కోశాధికారి జనార్దన్‌రావు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, జాయింట్ కార్యదర్శి మునగా వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

● మూలాపేట మూలస్థానేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరిగా భువనేశ్వరి అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, నవావరణ పూజలు, చండీహోమం, పూలంగిసేవలు, పల్లకీసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఉభయకర్తలు, అర్చకులు, సిబ్బంది, ఈవో ఏవీ. శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.


నెల్లూరు : గజలక్ష్మిగా శ్రీరాజరాజేశ్వరి


ధనలక్ష్మి అలంకరణలో కోదండరామపురం మహాలక్ష్మి


నెల్లూరు రూరల్ : విజయలక్ష్మిగా వేదగిరిలోని ఆదిలక్ష్మి



రాపూరు : సంతానలక్ష్మి అలంకరణలో అమ్మవారు


కావలి : అన్నపూర్ణాదేవిగా కలుగోళశాంభవి అమ్మవారు


బుచ్చి : భండాసుర వధ అలంకరణలో కామాక్షితాయి

భైరవులతో భద్రం గురూ!

- వీధికుక్కలతో అప్రమత్తత అవసరం
- రేబీస్ వ్యాధితో పొంచి ఉన్న ప్రాణాపాయం
- చీకటిపడితే బయటతిరగలేని పరిస్థితి
- ఈసీజన్‌లోనే సంతతి పెంపు
- నియంత్రణలో అధికారులు, పాలకుల విఫలం
- నేడు ప్రపంచ రేబీస్ వ్యతిరేక దినం



నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుక్కకాటుతో వచ్చే రేబీస్ వ్యాధితో ప్రాణాపాయం పొంచి ఉంది. వీధికుక్కల కారణంగా ఈ వ్యాధిన బారినపడి ఎందరో బాధితులు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో గత ఐదునెలల కాలంలో జిల్లాలో మూడువేలమంది కుక్కకాటుకు గురయినట్లు తెలుస్తోంది. ప్రతీ ఏటా 8వేల మందికి పైగా జిల్లాలో కుక్కకాటుకు గురవుతున్నట్లు గణాంకాలు తెలియచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 28న (నేడు) ప్రపంచ రేబీస్ వ్యతిరేకదినంగా జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయించింది. ఈ సందర్భంగా జిల్లాలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

● సంతతి అదుపు చేయరా..?

జిల్లాలో గతంలో అటు మున్సిపాలిటీలు, ఇటు పంచాయతీలు ఎప్పటికప్పుడు వీధికుక్కలను పట్టుకుని, వాటిని చంపేసేవారు. ప్రస్తుతం ఈ విధానం అమలులో లేకపోవడంతో కుక్కల సంతతి విపరీతంగా పెరుగుతూ ఉంది. ఒక్క నెల్లూరులోనే 30వేలకుపైగా కుక్కలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కుక్కలు సంతానం ఉత్పత్తి చేయకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాల్సిన మున్సిపల్ అధికారులు మొక్కుబడిగా చర్యలు చేపడతున్నారు. దీంతో అవి వేల సంఖ్యలోకి చేరుతున్నాయి. నగర కార్పొరేషన్ పరిధిలోని కనుపర్తిపాడులో కుక్కల సంరక్షణ కేంద్రం ఉన్నా, వీధికుక్కల నియంత్రణ పూర్తిస్థాయిలో జరగడంలేదు.

● అందుబాటులో వ్యాక్సిన్ ఏదీ ?

కుక్కకాటుకు గురైన వారికి యాంటిరేబీస్ వ్యాక్సిన్ వేయాలి. డోసుల వారీగా వేసే ఈ వ్యాక్సిన్ ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో లేదు. జిల్లాలో 52 పీహెచ్‌సీలతో పాటు 10 సీహెచ్‌సీలు ఉన్నాయి. అలాగే జిల్లా ఆసుపత్రితో పాటు రెండు ఏరియా ఆసుపత్రులు, ఒక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉంది. కేవలం నగరంలోని జీజీహెచ్‌లో మాత్రమే వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. దీంతో బాధితులు ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. బయట వ్యాక్సిన్ ఖరీదు రూ. 2వేల నుంచి రూ. 4 వేల వరకు ఉంది. ఇదే వ్యాక్సిన్‌ను రెడ్‌క్రాస్ ఏఆర్‌వీ సెంటర్‌లో రూ.400లకే అందుబాటులో ఉంది. నెల్లూరు రెడ్‌క్రాస్‌కు రాలేని ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు వైద్యుల దగ్గరే చికిత్స చేయించుకుంటున్నారు.

పెరుగుతున్న బాధితులు



జీజీహెచ్‌కి ప్రతిరోజూ వచ్చే కుక్కకాటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఇక్కడ రోజూ 30 మంది వరకు యాంటిరేబీస్ ఇంజక్షన్‌లు వేస్తున్నాం. కుక్కకాటు బాధితులు నాలుగు ఇంజక్షన్‌లు వేసుకోవాలి. అందుకే జీజీహెచ్‌లో ప్రతిరోజూ ఈ ఇంజక్షన్‌ల కోసం వస్తుంటారు. ప్రతి ఒక్కరూ కుక్కకాటు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ గంగాధర్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్

ఆలస్యం వల్ల ఎన్నో అనర్థాలు



కుక్కకాటు బాధితులు వెంటనే వైద్య చికిత్సలు చేయించుకోకపోవడంతో ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి యాంటీరేబీస్ ఇంజక్షన్ వేసుకోవాలి. ఆలస్యం చేస్తే రేబీస్ వ్యాధికి గురికాక తప్పదు. ఇది మరణాలకు సైతం దారితీస్తుంది. ఏది ఏమైనా వీధి కుక్కలతో అప్రమత్తంగా ఉండాలి.

-డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ వైద్యుడు

బాలయ్య కనుసైగ చేస్తే వైసీపీ చిల్లరగాళ్లను తరిమికొడతాం

● నుడా చైర్మన్ కోటంరెడ్డి ఆగ్రహం


మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ కనుసైగ చేస్తే ఆలయపై అనుచిత వాఖ్యలు చేస్తు న్న వైసీపీ చిల్లరగాళ్లను తరిమి కొడతామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి హెచ్చరించారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. పైసాకు పనికిరాని వారంతా బాలకృష్ణను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బాలకృష్ణ మాట్లాడిన దాంట్లో తప్పేమి ఉందని ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి ఒక సైకో అని సొంత పార్టీ వారే అంతర్గత సమావేశంలో తిట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సైకో అనే పదానికి జగన్ వ ల్ల తగిన గుర్తింపు వచ్చిందన్నారు, బాలకృష్ణ మీద విమర్శలు చేసే పేర్నినాని, కొడాలి నాని, వంశీ, గుడివాడ అమర్నాథ్‌లు ఎన్నికలకు ముందు రహస్యంగా సమావేశమైంది నిజం కాదాని, జగన్ సైకో రాజకీయం వల్ల జీవితం నాశనం అవుతుందని మాట్లాడుకున్నది వాస్తవం కాదాని ప్రశ్నించారు. బాలకృష్ణ నేరుగా ఎదురు పడతే వీరిది ప్యాంట్లు తడుపుకునే పరిస్థితి అని వాఖ్యానించారు. కానిస్టేబుల్‌ను చూసి భయపడి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి దాక్కున మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బాలకృష్ణను తిడుతున్నారన్నారు. చిరంజీవి, పవన్ కల్యాణ్ అంటే బాలకృష్ణకు ఎంతో అభిమానమని చెప్పారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణ జోలికి రావద్దని, ఆయన అభిమానుల ఆగ్రహానికి తట్టుకోలేరని హెచ్చరించారు.

భక్తుల అభిప్రాయాలకే పెద్దపీట

- రూ. వంద టిక్కెట్‌పై వదంతులు నమ్మొద్దు
- కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి వెల్లడి


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చేపట్టే ఏ అభివృద్ధి కార్యక్రమమైనా, మార్పులైనా భక్తుల అభిప్రాయాలు తీసుకున్న తరువాతనే అమలు చేస్తామని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మాలకొండను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్‌ఆజాద్ ఆలయ సందర్శన అనంతరం ఆలయంలో కొన్ని మార్పులు చేయాలని సూచించారని, ఇందులో భక్తుల మనోభావాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. వంద రూపాయల టిక్కెట్ రద్దు చేశారని వస్తున్న వదంతులు అవాస్తమనని తెలిపారు. వంద రూపాయల టిక్కెట్ యథావిధిగానే కొనసాగుతుందన్నారు.. గతంలో మాదిరిగానే గర్భగుడిలో పూజలు చేసి శఠగోపం పెడుతున్నట్లు తెలిపారు. త్వరలో ఆలయానికి పాలకమండలి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం కోసం రెండో ఘాట్‌రోడ్డు పనులు త్వరలో ప్రారంబించినున్నట్లు తెలిపారు. మరో కల్యాణ మండపం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ డీసీ చంద్రశేఖర్, మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, కందుకూరు పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, నాయకులు నార్నే రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

● మాలకొండ ఆదాయం రూ. 12,49,537

మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ. 12,49,537 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక దర్శనం ద్వారా రూ.4,17,000, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 2,85,075, అన్నదానం ద్వారా రూ.3,80,235, రూము అద్దెల ద్వారా రూ.34,490, కుంకుమార్చన ద్వారా రూ. 19,480, వివాహముల ద్వారా రూ. 18 వేలు ప్రధానంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

అసంపూర్తి రోడ్లను పూర్తి చేయండి

- పక్కా ఇళ్లకు బిల్లులేవి..?
- అధికారులు సమావేశాలకు రాకుంటే ఎలా
- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల క్రితం టెండర్లు పిలిచిన రోడ్లకు ఇప్పటివరకు మోక్షం లేదు. ఆ రోడ్లన్నీ గుంతలమయంగా ఉన్నాయి. వాటి గురించి పట్టించుకోండి. పక్కా ఇళ్లు నిర్మించుకోమన్నారు. బిల్లులు మాత్రం ఇవ్వలేదు. ఇలాగైతే పేదల ఇళ్లు పూర్తయ్యేది ఎలా....? జడ్పీ సమావేశానికి అధికారులు సక్రమంగా హాజరుకావడం లేదు. వారిపై చర్యలు తీసుకోండి... అని జడ్పీ స్టాండింగ్ కమిటీలో సభ్యులు అన్నారు. జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన శనివారం నగరంలోని జడ్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రిపాడు జడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ బ్రాహ్మణపల్లి, కంపసముద్రం, కృష్ణాపురం రోడ్డుకి గత ప్రభుత్వం రూ.420 కోట్లతో టెండర్లు పిలిచినా పనులు మాత్రం ఇప్పటికీ జరగలేదు. ఆ పనులు చేస్తారో.. లేదో..? తెలపాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ప్రారంభంకానీ పనులను రద్దు చేశామని, వాటికి మళ్లీ టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపామని అధికారులు తెలిపారు. కంపసముద్రం చెరువు విస్తరణ పేరుతో కట్టలు తవ్వేశారని, దీంతో సుమారు 1000 ఎకరాలకు సాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయని ఆయన తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కలువాయి జడ్పీటీసీ సభ్యుడు బీ. అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కలువాయి ప్రాంతంలోని తెలుగు గంగ కాలువ సీతారామపల్లి,మరికొన్ని చోట్ల లీక్ అయిందని, ఆరికట్టాలని కోరారు. విడవలూరు జడ్పీటీసీ సభ్యుడు తుమ్మల లక్ష్మయ్య మాట్లాడుతూ పక్కా ఇళ్లకు బిల్లులు మంజూరు చేయకుండా ఆపి వేశారని, ఇలాగైతే పేదలకు ఇళ్ల నిర్మాణం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. వెంటనే బిల్లులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం అజెండాలోని ఇతర అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి వ్యవసాయశాఖ, మార్కెటింగ్, ఇరిగేషన్ శాఖ అధికారులతోపాటు తిరుపతి జిల్లా అధికారులు హాజరు కాకపోవడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ స్పందిస్తూ అధికారుల తీరు సరిగాలేదని, సమావేశం తేదీని ముందుగా తెలిపినా వారు హాజరు కాకపోవడంపై తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో మోహనరావును ఆమె ఆదేశించారు.

రైతుల ఆర్థిక బలోపేతానికి వేదిక ఎఫ్‌పీవోలు



మాట్లాడుతున్న ఆత్మ పీడీ మురళి

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థిక బలోపేతానికి ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవో) వేదికలని ఆత్మ పీడీ మురళి పేర్కొన్నారు. నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో శనివారం విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. లోకేష్‌బాబు అధ్యక్షతన ఎఫ్‌పీవోల ముఖ్య కార్యనిర్వాహకులు, డైరెక్టర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, పారదర్శక నిర్వహణ, సమష్టి నిర్ణయాలు అనుసరించడం ద్వారా ఎఫ్‌పీవోలు మరింత విజయవంతం అయ్యే అవకాశం ఉందని సూచించారు. సమష్టి వ్యాపారం, మార్కెటింగ్, విలువ ఆధారం వంటి అంశాల ద్వారా రైతులు ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. మార్కెటింగ్ వ్యూహాలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, విలువ ఆధారం, ప్రభుత్వ పథకాల వినియోగం, ఆర్థిక వనరుల సమీకరణ వంటి పలు అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మత్స్య విభాగం శాస్త్రవేత్త హరిసాధు, శాస్త్రవేత్త సు జాత, ఆదిశంకర డీమ్డ్ యూనివర్సిటీ ఇన్క్యుబేషన్ సెం టర్ సీఈవో డాక్టర్ యోగా నరసింహ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వాహనమిత్ర పథకానికి షరతులు విధించవద్దు

● జిల్లా ఆటో కార్మిక సంఘం డిమాండ్



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఆటో కార్మికుల సంఘం నేతలు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వాహనమిత్ర పథకానికి ఎలాంటి షరతులు విధించవద్దని జిల్లా ఆటోకార్మిక సంఘం కూటమి ప్రభుత్వాన్ని కోరింది. శనివారం నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్‌సీ కూడలి వరకు ఆటోకార్మికులతో కలసి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోకార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు రాజా మాట్లాడుతూ ఆటో, మోటారు క్యాబ్, మాక్సీ క్యాబ్ ఉన్న వాహనదారులు వాహనమిత్ర కోసం ఈనెల 31వతేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు. లైసెన్స్ ఉండాలని, వాహనం రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ అయ్యి ఉండాలని, నెలలోపు పొందిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్, వాహనదారులకు ఆధార్‌కార్డుతో పాటు తెల్లరేషన్ కార్డు ఉండాలని, అద్దె వాహనదారులు ఈ పథకానికి అనర్హులని, వాహనంపై ఎటువంటి పెం డింగ్ బకాయిలు ఉండరాదని ఇలా 16 నిబంధనలు పెట్టడంతో అనేక మంది అర్హులు ఈ పథకానికి దూరమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక నగర అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్ర, స్వ ర్ణబాబు, సీఐటీయూ నేతలు కత్తి శ్రీనివాసులు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశు వైద్యశాలలు ఏర్పాటు చేయాలి

● మంత్రి అచ్చెన్నాయుడుకు ఎమ్మెల్యే కాకర్ల వినతి

ఉదయగిరి : వరికుంటపాడు మండలం తూర్పురొంపిదొడ్ల, ఇతర గ్రామాల్లో పశు వైద్యశాలలు ఏర్పాటు చేయాలని శనివారం అసెంబ్లీలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖా మంత్రి అచ్చెన్నాయుడుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వినతిపత్రం అందజేశారు. మెట్ట ప్రాంతం కావడంతో అధికశాతం మంది రైతు లు పాడిపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అయితే సమీపాల్లో పశు వైద్యశాలలు లేకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పందించిన ఆయన తప్పకుండా అవసరమైన గ్రామాల్లో పశు వైద్యశాలల ఏర్పాటుకు చర్యలు చేప డతామన్నారు.

సామాజిక సేవకు పురస్కారం

సాధారణ కుటుంబంలో పుట్టినా, అతని ఆశయం మాత్రం ఎంతో ఉన్నతమైంది. కుటుంబ సభ్యుల ఆశలకు అనుగుణంగా విద్యలో రాణిస్తూనే తనలోని సేవా దృక్పథానికి పదును పెట్టాడు ముమ్ముల పృథ్వీరాజ్. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం(వీఎస్‌యూ)లోని జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ద్వారా సేవలకు శ్రీకారం చుట్టారాయన. ఈ క్రమంలో ఆయన గత ఏడాది రాష్ట్ర అవార్డుకు, ఈఏడాది జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 29న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు.

- చదువును కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలు
- రాష్ట్రపతి అవార్డుకు పృథ్వీరాజ్ ఎంపిక
- ఈ నెల 29న ఢిల్లీలో ప్రదానం


పృథ్వీరాజ్‌కు అభినందనలు తెలుపుతున్న వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత

వెంకటాచలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం జిల్లా సెట్టూరు మండలం చిన్నంపల్లికి చెందిన ముమ్ముల ఈశ్వరప్ప-రత్నమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వారిద్దరిని విద్యతో సేవా కార్యక్రమాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించారు. తండ్రి ఈశ్వరప్ప తాగునీటి ప్రాజెక్టులో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తుండగా, తల్లి రత్నమ్మ గృహిణి. కాగా పెద్దకుమారుడు పృథ్వీరాజ్ విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నారు.

● సమాజాభ్యుదయమే ధ్యేయంగా...

సమాజాభ్యుదయమే ధ్యేయంగా వీఎస్‌యూలోని ఎన్‌ఎస్‌ఎస్ విభాగం పనిచేస్తున్నది. ఈ క్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహణలో ముందుంది. వర్సిటీ కళాశాలలో ఎంఎస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేసిన పృథ్వీరాజ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రముఖ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఆయన ఇంటర్, డిగ్రీ నుంచే ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా సేవా కార్యక్రమాలు శ్రీకారం చుట్టారు. వర్సిటీ కళాశాలలో ఎంఎస్సీ బయోటెక్నాలజీలో చేరిన మొదటి సంవత్సరం (2021)లోనే ఎన్‌ఎస్‌ఎస్ వలంటీరుగా చేరారు. 2023 వరకు సేవా కార్యక్రమాలు చేశారు.

● సేవల్లో మేటి

రక్తదానం చేయడం, మొక్కలు నాటడం, పచ్చదనం - పరిశుభ్రత, జాతీయ సమైక్యతా శిబిరం, జాతీయ యువజనోత్సవం, మహిళా సాధికారత, పర్యావరణం, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన... ఇలా అనేక కార్యక్రమాల్లో పృథ్వీరాజ్ పాల్గొన్నారు. అంతేకాక బెంగళూరులో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపుతోపాటు కర్ణాటకలో జరిగిన నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో కూడా పాల్గొన్నారు. దీంతో గత ఏడాది రాష్ట్రస్థాయి ఎన్‌ఎస్‌ఎస్ ఉత్తమ వలంటీర్ అవార్డును అందుకున్నారు. కాగా ఈ ఏడాది రాష్ట్రం నుంచి జాతీయస్థాయికి ఎంపికై పృథ్వీరాజ్ జాతీయ అవార్డును అందుకోనున్నారు. ఈ క్రమంలో రెండురోజుల కిందట వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్ తదితరులు ప్రత్యేకంగా పృథ్వీరాజ్‌ను అభినందించారు. కాగా ఈనెల 29న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకోనున్నారు.

ఎంతో గర్వంగా ఉంది!

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌గా అందించిన సేవలు ఎంతో గుర్తింపు తెచ్చాయి. గత ఏడాది రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవడం, ఈ ఏడాది రాష్ట్రపతి చేతుల అవార్డును అందుకోనుండడం ఎంతో గర్వంగా ఉంది. వీఎస్‌యూలోని ఎన్‌ఎస్‌ఎస్ విభాగంలో చేరి ఎంతో నేర్చుకున్నా. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నా. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటాను. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతోనే జాతీయ అవార్డు సాధించా.

\- పృథ్వీరాజ్



